26-04-2024
శుక్రవారం
కరీంనగర్

సంపుటి 07, సంచిక: 145
పేజీలు: 8+8
వెల రూ. 5.00


Published from:
Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★








రూ.168 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి దేశం

గత ప్రధానులు చేసిన అప్పులు రూ.54 లక్షల కోట్లు

పదేళ్లలోనే మోదీ ప్రభుత్వం రూ.113 లక్షల కోట్లు రుణాలు

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విమర్శ

''పదేండ్ల మోసం-పదేండ్ల విధ్వంసం'' నయవంచన పేరుతో చార్జ్‌షీట్

## రిజర్వేషన్ల రద్దుకు

# బిజెపి కుట్ర

### ఉండాలా? వద్దా? అనే రిఫరెండమే లోక్‌సభ ఎన్నికలు

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోని ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల రిజర్వేషన్లను రద్దు చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం, బిజెపి విధానమని టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విమర్శించారు. రిజర్వేషన్లను రద్దు చేసేందుకు రాజ్యాంగంపైన బిజెపి చివరి యుద్ధం ప్రకటించిందని, ఇందుకు ఆ పార్టీకి 400 ఎంపి స్థానాలు అవసరమని, తద్వారా 2/3 వంతు మెజార్టీతో లోక్‌సభ, రాజ్యసభలో రిజర్వేషన్ల రద్దు బిల్లును ఆమోదించుకుని, దీనిని అమలు చేసేలా అన్ని రాష్ట్రాలపైన ఒత్తిడి తీసుకొచ్చేలా బిజెపి కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు. రిజర్వేషన్లు ఉండాలా? వద్దా? అనే రిఫరెండమే లోక్‌సభ ఎన్నికలని, రిజర్వేషన్లు కావాలనుకుంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని కోరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ''పదేండ్ల మోసం–పదేండ్ల విధ్వంసం'' నయవంచన పేరుతో బిజెపిపై ఏర్పాటు చేసిన చార్జ్‌షీట్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండాసురేఖ, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీతో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి,ఒబిసి,మైనార్టీలు బిజెపికి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్ల రద్దుకు ఉపయోగపడుతుందని, బిజెపి ఒక్కసీటు గెలిచినా ఆ సీటు బలంతో 'మీ' హక్కులను కాలరాసేందుకు ఉపయోగిస్తుందని, అందుకే లోక్‌సభ ఎన్నికల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వంద సంవత్సరాల లోపు రిజర్వేషన్లను రద్దు చేయాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్ విధానమని, 2025 నాటికి ఆర్‌ఎస్‌కు ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో రిజర్వేషన్లను రద్దు చేయాలని పట్టుదలతో తరువాయి 2లో

## కాంగ్రెస్, బిఆర్‌ఎస్ రెండు పార్టీలు ఒక్కటే

బిఆర్‌ఎస్ పాలనలో తెలంగాణాలో అవినీతి విచ్చలవిడిగా పెరిగింది : అమిత్‌షా

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి



కాంగ్రెస్, బిఆర్‌ఎస్ అమలు చేస్తున్న ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లు తొలగించి.. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు, అగ్రవర్ణ పేదలకు అమలుచేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. బిఆర్‌ఎస్, కాం గ్రెస్ రెండు పార్టీలు ఒక్కటేనని, దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి బిజెపితోనే సాధ్యమని అమిత్‌షా స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో బిజెపి 'విశాల జనసభ' పేరుతో తరువాయి 2లో

## మోడీ పాలనలో రాష్ట్రానికి భారీ నష్టం

భువనగిరిలో బిజెపి, కాంగ్రెస్ మిలాఖత్

భువనగిరి రోడ్డు షోలో బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్

ప్రజాపక్షం/యాదాద్రి ప్రతినిధి



ప్రధాని మోడీ పాలనలో తెలంగాణ రాష్ట్రం భారీగా నష్టపోయిందని మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు విమర్శించా రు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి భువనగిరిలో నిర్వహించిన బిఆర్‌ఎస్ రోడ్డు షో సందర్భంగా స్థానిక మాజీ ఎంఎల్‌ఎ పైళ్ల శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ప్రజలనుద్దేశించి కెసిఆర్ ప్రసంగించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక పార్టీ దేవుడి పేరుతో ఓట్లు అడుగుతుండగా, ఇంకో పార్టీ ఒట్లు పెట్టి ఓట్లు తరువాయి 2లో

## మోదీ పేరు లేకుండా నడ్డాకు ఇసి నోటీసు

రాజస్థాన్ ప్రసంగంపై ఈ నెల 29లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం

రాహుల్, ఖర్గే వ్యాఖ్యలపైనా ఖర్గేకు కూడా నోటీసు జారీ



**న్యూఢిల్లీ :** రాజస్థాన్ రాష్ట్రం బన్స్‌వారాలో ప్రధాని మోదీ చేసిన విద్వేషపూరిత ప్రసంగాలపై కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్), పౌర సమాజ సంస్థలు చేసిన ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించింది. అయితే నేరుగా ప్రధానికి కాకుండా బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డాకు నోటీసు జారీ చేసింది. నోటీసులో సైతం ఎక్కడా ప్రధానమంత్రి పేరును తరువాయి 2లో

## సంపద పునః పంపిణీ మ్యానిఫెస్టోలో ఎక్కడుంది?

చూపించాలని ప్రధానికి కాంగ్రెస్ సవాల్

మంగళసూత్రాలు తీసుకుంటామని ఎక్కడ చెప్పామో చెప్పాలి : జైరామ్ రమేష్



**న్యూఢిల్లీ :** సంపద పునః పంపిణీ గురించి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఎక్కడ ప్రస్తావించారో చూపించాలని ప్రధాని మోదీకి ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ సవాలు విసిరారు.తాము మంగళసూత్రాలు తీసుకుంటామని ఎక్కడ అన్నామో చెప్పాలని నిలదీశారు. మంగళసూత్రాన్ని గౌరవించని వ్యక్తే దాని గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తమ మ్యానిఫెస్టోలో కాని, తమ ఎజెండాలో కాని ఎక్కడా వారసత్వ పన్ను ప్రస్తావన లేదని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జైరామ్ రమేశ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీనే 1985లో వారసత్వ పన్ను రద్దు చేశారని చెప్పారు. అయితే, తరువాయి 2లో

## 17 స్థానాలకు 700 నామినేషన్లు దాఖలు!

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ గురువారం ముగిసింది. మొత్తం 17 లోక్‌సభ స్థానాలకు గానూ దాదాపు 700 వరకు నామినేషన్‌లు దాఖలు చేశారు. కంటోన్మెంట్ శాసనసభ స్థానంలో ఉప ఎన్నికలకు కూడా నామినేషన్‌ల తుది గడువు ముగిసింది. లోక్‌సభ ఎన్నికల సమరంలో ఓ కీలక ఘట్టం పూర్తయింది. ఎంతో కీలకమైన ఈ ఘట్టానికి తరువాయి 2లో

## మే 27న ఎంఎల్‌సి ఉప ఎన్నిక

నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి మే 2న నోటిఫికేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. మే2న నోటిఫికేషన్ రానుండగా, మే 27న పోలింగ్ జరగనుంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం విడుదల చేసింది. సిట్టింగ్ ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇటీవల తరువాయి 2లో

## 88 నియోజకవర్గాలు... 1202 మంది అభ్యర్థులు

88 స్థానాల్లో నేడు రెండవ విడత లోక్‌సభ పోలింగ్

**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రెండో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. పెద్దఎత్తున భద్రతా బలగాలను మోహరించింది. 13 రాష్ట్రాల్లోని 88 నియోజకవర్గాల్లో శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6వరకు పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ కేరళలోని వాయనాడ్ నుంచి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కేరళలో మొత్తం 20 స్థానాలకు, కర్నాటకలో 28 సీట్లకుగానూ 14 స్థానాల్లో, రాజస్థాన్‌లో 13, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో 8 చొప్పున, మధ్యప్రదేశ్‌లో 7, అసోం, బీహార్ లో 5 చొప్పున, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌లో 3 చొప్పున మణిపూర్, త్రిపుర, జమ్ముకశ్మీర్‌లో ఒక్కొక్క నియోజకవర్గంలో పోలింగ్ జరగనుంది. మొత్తం 1202 మంది అభ్యర్థులు తరువాయి 8లో



## ప్రమాదంలో ఆరుగురు మృతి

ప్రజాపక్షం/కోదాడ

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ శివారులోని శ్రీరంగాపురం వద్ద గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో తరువాయి 8లో






## ఇరాన్ ర్యాపర్ సలేహీకి మరణ శిక్ష




**టెహ్రాన్ :** ఇరాన్‌లో దేశవ్యాప్తంగా రెండేళ్ళక్రితం తీవ్రస్థాయిలో జరిగిన నిరసన ప్రదర్శనల సందర్భంగా నమోదైన కేసుల్లో ఆ దేశానికి చెందిన ర్యాపర్ (మ్యుజీషియన్, స్టోరీటెల్లర్), హిప్ హాప్ ఆర్టిస్ట్ తూమజ్ సలేహీకి మరణశిక్ష పడింది. ఇరాన్ రివల్యూషనరీ కోర్టు గురువారం సలేహీకి మరణశిక్ష విధించింది. ఇరాన్‌లో నిరసన ప్రదర్శన సందర్భంగా దేశ సుస్థిరతను కించపరచేవిధంగా ప్రచారం చేశారని, ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాలకు పాల్పడ్డాడని ఆరోపణలు చేస్తూ తూమజ్ సలేహీని 2021 సెప్టెంబరు 12న పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై విచారణ అనంతరం మరణశిక్ష ఖరారైంది. ప్రధానంగా ఇరాన్ మతరాజ్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని తూలనాడుతూ తిరుగుబాటు ప్రచారం చేశారని ఆయన ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొన్నారు. 22 ఏళ్ళ వయసుగల ఖుర్దిష్ ఇరానియన్ యువతి మహసా అమిని హిజాబ్‌ను సక్రమంగా ధరించలేదన్న కారణంగా పోలీసులు అరెస్టు చేశారు. ఆమె 2022లో పోలీసు కస్టడీలో ఉండగానే మరణించడంతో దేశవ్యాప్తంగా అనేక నెలపాటు నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ నిరసన జ్వాలల్లో అనేకమంది పోలీసులు ప్రదర్శకులు కూడా మరణించారు. ఈ సందర్భంగా తూమజ్ సలేహీ పాడిన పాటలు ఈ నిరసన ఉద్యమానికి ఎంతో ప్రేరణ ఇచ్చాయి. ఈ ఉద్యమం సుదీర్ఘంగా కొనసాగడానికి ఆయన పాటలు ఎంతగానో దోహదం చేశాయి. ఈ కారణంగా ఆయనను అరెస్టు చేసి విచారణ జరిపి మరణశిక్ష విధించారు.

## అమెరికాపై ఆధారపడని స్వతంత్ర ఇయు ఉండాలి

ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్



**పారిస్ :** అమెరికాపై ఆధారపడని ఒక స్వతంత్ర యూరోపియన్ యూనియన్ (ఇయు) ఉండాలని ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ అన్నారు. యూరోపియన్ యూనియన్ సేనలను ఉక్రెయిన్‌కు మద్దతుగా పంపడంలో వెనుకంజ వేయకూడదని అన్నారు. జూన్ 6 నుండి 9 వరకూ జర్మనీలో యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు ఎన్నికలు జరుగనున్న పూర్వరంగంలో పారిస్‌లోని సోర్బోన్ యూనివర్సిటీలో మేక్రాన్ గురువారంనాడు కీలక ఉపన్యాసం చేశారు. యూరోపియన్ యూనియన్‌కు బ్రెగ్జిట్ తర్వాత 1979లో మొదటి సారి ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. ఈసారి యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు 10 వ విడత ఎన్నికలు జరుగుతున్నాయి. వాస్తవానికి ఆయన 2017 సెప్టెంబరులో కూడా ఇదే వేదికపై ఇదే విషయంపై ప్రసంగించారు. కానీ ఇప్పటికి ఏడు సంవత్సరాలు గడిచాక ప్రపంచవ్యాప్తంగా అనేక పరిణామాలు సంభవించిన తరుణంలో మేక్రాన్ ఈ విధంగా అదే ప్రసంగాన్ని పునరుద్ఘాటించారు. యూరోపియన్ యూనియన్ ఎన్నికల తరుణంలో అమెరికాపై ఆధారపడని యూరోపియన్ యూనియన్ కావాలని నినాదం ఎత్తుకున్నారు. యూరప్ రక్షణకు ఒక విశ్వసనీయమైన వ్యూహం రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శక్తిమంతమైన యూరప్ ఉండాలని, అసలు సార్వభౌమాధికారం అనే పదాన్ని ఆ భావనను మొదట ప్రపంచానికి చెప్పింది యూరప్ దేశాలేనని ఆయన ఉద్ఘాటించారు. యూరోపియన్ యూనియన్ ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందని అందుకు ఒక వ్యూహం కావాలని, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి యూరోపియన్ యూనియన్‌కు ఉండాలని అన్నారు. ఐక్యత, సార్వభౌమాధికారంల యూరోపియన్ యూనియన్ గణనీయమైన ప్రగతి సాధించిందని మేక్రాన్ అన్నారు. ఐతే యూరోపియన్ యూనియన్‌లో అవినీతి నిర్మూలనకు ఒక స్వతంత్ర వాచ్‌డాగ్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో మేక్రాన్ పార్టీ కొంత ఇరకాటంలో పడిన తరుణంలో ఆయన ఈ కీలక ప్రసంగం చేశారు.

# నేతన్యాహూ ఇంటి బయట పోటెత్తిన నిరసనలు




ప్రపంచం

**గాజా :** హమాస్‌కు అత్యంత సురక్షితమైన చిట్టచివరి ఆవాసాన్ని కూడా ధ్వంసం చేసేందుకు ఇజ్రాయిల్ బలగాలు సిద్ధం అవుతున్న తరుణంలో ఆయుధాలు వదిలిపెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ టాప్ అఫీషియల్ ఒకరు గురువారం ప్రకటించారు. ఇందులో భాగంగా సానుకూల సంకేతాలు ఇస్తూ 201 రోజుల తర్వాత ఒక బందీ వీడియోను విడుదల చేశారు. ఇజ్రాయిల్‌కు చెందిన 23 ఏళ్ళ వయసుగల అమెరికా యువకుడు హెర్ష్ గోల్డ్‌మన్‌ను గాజాలో బందీగా ఉన్న వీడియోను చేశారు. దీంతో గోల్డ్‌మన్ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. తక్షణం అమెరికా, ఖతార్ సహా మధ్యవర్తిత్వం చేసే దేశాలు రంగంలోకి దిగి బందీలను విడుదల చేయాలని వారు కోరారు. ఇదిలా ఉండగా ఈ బందీ వీడియో విడుదల కాగానే ఇజ్రాయిల్‌లో గురువారంనాడు ప్రదర్శకులు ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూ నివాసం ఎదుట నిరసన ప్రదర్శనలు చేశారు. ''షేమ్ ఆన్ యూ'', ''షేమ్ ఆన్ యూ'' అంటూ ప్రదర్శకులు నినాదాలు చేశారు. గాజాలో యుద్ధం కోసం నేతన్యాహూ బందీలను బలిపెడుతున్నారని నినాదాలు చేశారు. హమాస్ చెరలో ఇప్పటికీ ఇంకా 133 మంది బందీలుగా ఉన్నారు. ఐతే హమాస్ ఆయుధాలు వదిలేసే ఈ విషయంపై తదుపరి వివరాలు, వివరణలు, సంప్రదింపుల గురించి ఇతర సమాచారం తెలియరాలేదు. గాజాలో దాదాపు మూడు లక్షలకు పైగా ఇళ్ళు నేలమట్టం కావడంతో 15 లక్షల మంది ప్రజలు రఫాలో తలదాచుకున్నారు. రఫాలో కూడా ఐడిఎఫ్ దాడులకు సన్నాహాలు చేస్తూ ఉండటంతో హమాస్ అఫీషియల్ నుండి ఈ ప్రకటన వచ్చింది. ఈ సన్నాహాల్లో భాగంగా ఇజ్రాయిల్ సైన్యం 40,000 టెంట్‌లను కొనుగోలు చేసి సిద్ధగా ఉంచింది. రఫా నుండి తరలించే వారికి ఈ టెంట్లు సమకూర్చాలని ఐడిఎఫ్ భావిస్తున్నది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ దాడుల్లో 16 ఏళ్ళ బాలుడు మరణించాడు. ఇంకోవైపు ఇజ్రాయిల్–లెబనాన్ సరిహద్దుల్లో కూడా ఉద్రిక్తతలు నెలకున్నాయి. ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు దాడులు కొనసాగించాయి. మరోవైపు ఖాన్‌యూనిస్ ఆసుపత్రిలో రహస్యంగా ఇజ్రాయిల్ సైన్యం ఖననం చేసిన మృతదేహాలు ఇప్పటివరకూ 400 వెలికి తీశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని యూరోపియన్‌యూనియన్ డిమాండ్ చేస్తున్నది. బిడ్డల జాడ తెలియని తల్లితండ్రులు అక్కడకు చేరుకుని వెదకులాట ప్రారంభించారు.

### దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ ఖండన

మే 1 నుండి నిరసన కార్యక్రమాలు

ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దురాగతాలను దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ ఒకప్రకటలో తీవ్రంగా ఖండించింది. సామూహి ఊచకోత, జాతి వివక్షనుప్రపంచ దేశాలు ఐక్యంగా ప్రతిఘటించాలని సౌత్ ఆఫ్రికా కమ్యూననిస్టుపార్టీ(ఎస్‌ఎసిపి) కోరింది. పాలస్తినా ప్రజలకు తమ సంఘీభావం ప్రకటించింది. పాలస్తినాకు అనుకూలంగా మే 1 వ తేదీ నుండి వారంరోజులపాటు జరిగే కార్యక్రమాల్లో దక్షిణాఫ్రికా ప్రజలు భాగం పంచుకుంటారని ప్రకటించింది. కమ్యూనిస్టు పార్టీ నిరసన కార్యక్రమాల్లో గొంతెత్తి భాగం పంచుకుంటుందని తెలియజేసింది. ఖాన్ యూనిస్‌ని ఆసుపత్రిలో ఇజ్రాయిల్ సైన్యం అమాయక ప్రజలను సామూహికంగా హింసించి చంపి ఖననం చేయడాన్ని అమానుష చర్యగా పేర్కొంది. దీనిపై అంతర్జాతీయస్థాయిలో దర్యాప్తు జరపాలని దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ కోరింది. అక్టోబరు 7 నుండి ఇప్పటివరకూ 34,300మంది అమాయక ప్రజలను ఐడిఎఫ్ హతమార్చిందని ఆవేదన వ్యక్తం చేసింది.

## అమెరికాలో ఇజ్రాయిల్ వ్యతిరేక నిరసనలు

# వందలమంది యూనివర్సిటీ విద్యార్థుల అరెస్టు

వాటర్ బాటిల్స్‌తో పోలీస్‌పై దాడి





**టెక్సాస్ :** అమెరికా విశ్వవిద్యాలయాల్లో పాలస్తినాకు మద్దతుగా విద్యార్థుల నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. పలు విశ్వవిద్యాలయాల్లో పోలీసులు ఈ సందర్భంగా వందలమంది విద్యార్థులను అరెస్టు చేశారు. ఎమర్సన్ కాలేజీలో 108 మంది, కాలిఫోర్నియాలో 93 మంది, అలుమ్ని పార్కులో 100 మంది సహా యాలే, కొలంబియా, న్యూయార్క్ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను అరెస్టు చేశారు. పోలీసులు హెలికాప్టర్లలో పర్యవేక్షించి వారు ఆ ప్రాంతాలను ఖాళీ చేసేందుకు పది నిమిషాలు ముందస్తు వార్నింగ్ ఇచ్చారు. తర్వాత వారిని అరెస్టు చేశారు. పోలీసులు ఒక మహిళా విద్యార్థిని అరెస్టు చేయబోగా ప్రదర్శకులు పోలీసులపైకి వాటర్ బాటిల్స్ విసిరారు. ''లెట్స్ గో'' అంటూ నినాదాలు చేశారు. పాలస్తినాపై ఒత్తిడి తేవాలనీ, యుద్ధ విరమణ జరగాలని, ఇజ్రాయిల్ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం తెంచుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఆస్టిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, హార్వర్డ్, బ్రౌన్‌లలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా విద్యార్థులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. టెక్సాస్, డాలస్,న్యూమెక్సికో, ప్రిన్స్‌టన్, ఛార్లోట్, ఎమోరి,రైస్ యూనివర్సిటీల్లో విద్యార్థులు నిరసనలు తెలియజేస్తున్నారు.నిరసన ప్రదర్శకులను చెల్లాచెదురు చేసే ప్రయత్నం చేశారు. ఐతే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ సందర్భంగా ఒక ప్రకటన చేస్తూ విద్యార్థులకు నిరసన తెలియజేసే హక్కు ఉందని, ఆ హక్కును లాక్కోవద్దని అన్నారు. కాగా _మసాచ్యుసెట్స్,న్యూయార్క్,కాలిఫోర్నియా,టెక్సాస్‌లలోని విద్యాలయాల్లో ఈ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. కాలిఫోర్నియా అలుమ్ని పార్కులో నిరసన ప్రదర్శకులు నినాదాలు చేసి నిరసనలు తెలియేశారు. పబ్లిక్ సేఫ్ అధికారులు వారిని అడుగడుగునా వెంటాడారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు నిరసన ప్రదర్శనలు జరుపుతూ ఉండటంతో హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ స్పందించారు. ఈ పర్యవేక్షణ బాధ్యతలనునేషన్ గార్డ్స్‌కు అప్పగించాలని కోరారు. కాగా కొలంబియా విశ్వవిద్యాలయంలో ఈనెలారంభం నుండీ చాలా ఉధృతంగా విద్యార్థులు పాలస్తినా అనుకూల నిరసన ప్రదర్శనలుచేస్తున్నారు. ఇప్పటికే చాలామంది విద్యార్థులను అక్కడ అరెస్టు చేయడంతో ఫ్యాకల్టీ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు చేతికి సంకెళ్ళు వేయడంపై పెద్ద ఎత్తున నిరసన పెల్లుబికింది.

## స్పెయిన్ ప్రధానమంత్రి రాజీనామాకు రెడీ



**మాడ్రిడ్ :** స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంచెజ్ రాజీనామాకు సిద్ధపడ్డారు. ఆయన భార్యపై అవినీతి ఆరోపణలు రావడంతో తాను పదవికి రాజీనామా చేయాలని ఆలోచన చేస్తున్నట్లు ఆయన గురువారం ప్రకటించారు. అవినీతికి పాల్పడ్డారని ఆయన భార్య బెగోనా గోమెజ్‌పై దర్యాప్తుకు న్యాయస్థానం బహిరంగ ప్రకటన చేయడంతో పెడ్రో శాంచెజ్ స్పందించారు. ఈ నెలాఖరు వరకూ ప్రధానమంత్రిగా తాను అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంలేదని, విరామం తీసుకుంటున్నానని ఆయన ప్రకటించారు. ఈ ప్రభుత్వానికి తాను నాయకత్వం వహించాలా? వద్దా? అనేవిషయంపై ఒక నిర్ణయం తీసుకోవడానికి తనకు తగినంత సమయం కావాలని ఆయన అన్నారు.

## 'కాళేశ్వరం'పై విచారణ షురూ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో నిర్మించిన బ్యారేజీల నిర్మాణ లోపాలు, నిధుల దుర్వినియోగం,అవినీతి తదితర అంశాలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ విచారణను ప్రారంభించింది. విచారణలో భాగంగా ప్రజల నుంచి కూడా ఫిర్యాదులను,నివేదనలు స్వీకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే మే 31 వరకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫిర్యాదులను, నివేదనలను విచారణ కమిషన్‌కు దాఖలు చేయాలని నీటి పారుదల శాఖ తెలిపింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం బహిరంగ ప్రకటనను జారీ చేశారు. సాక్ష్యాధారాలతోపాటు నోటరీ ద్వారా ప్రమాణ పూర్వక అఫిడవిట్లను సీల్డ్ కవర్‌లో పెట్టి, హైదరాబాద్, బిఆర్‌కె భవన్‌లోని 8వ అంతస్తు, డి బ్లాక్‌లోని కమిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 31వ పెట్టెలో వేయాలని సూచించారు. అఫిడవిట్లను పోస్ట్ ద్వారా కూడా కమిషన్ కార్యాలయ చిరునామాకు పంపించవచ్చని ఆయన తెలిపారు. అయితే తగిన సాక్ష్యాలు లేని, నోటరి ద్వారా పొందిన ప్రమాణ పత్రం లేని అఫిడవిట్‌లను తిరస్కరిస్తామని పేర్కొన్నారు. కాగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నిర్మాణ,నాణ్యత, నిర్వహణ లోపాలను వెలికితీసి, వాటికి బాధ్యులను గుర్తించడం, ప్రాజెక్ట్‌లోని అవినీతి పద్ధతులు , మూడు బ్యారేజీల నిర్మాణంలో నిధుల దుర్వినియోగం తదితర అంశాలపైన కమిషన్ విచారణ చేపట్టనుంది.

## రెండు రోజులు వడగాల్పులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న రెండు రోజులు వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరన కేంద్రం అధికారులు వెల్లడించారు. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. వచ్చే రెండురోజులు ఇలాగే ఉంటుందని, అంచనగా ఉందన్నారు. అత్యధికంగా నల్లగొండ జిల్లా బుగ్గబావిగూడెం 44.9 డిగ్రీల సెల్సియస్, ఆ తర్వాత కరీంనగర్ జిల్లా వీణవంకలో 44.8 డిగ్రీల సెల్సియస్ మేర గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్టు చెప్పారు.

## భారీ నష్టం (మొదటి పేజీ తరువాయి)

అడుగుతోందని విమర్శించారు. బిఆర్‌ఎస్ హయాంలో అద్భుతంగా యాదాద్రి ఆలయాన్ని నిర్మించుకున్నామని, ఎన్నడైనా యాదాద్రిని ఓట్ల కోసం వాడుకున్నామా? ఇది మనకు, వాళ్లకు తేడా అని వివరించారు. దేవుడి పేరిట ఓట్లు అడుగుతూ మతం మత్తును నింపుతున్న పార్టీ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. దేశంలో పది ఏళ్ల పాలన చేసిన మోడీ ప్రభుత్వం ఏ వర్గానికి కూడా న్యాయం చేయలేదన్నారు. మేక్ ఇన్ ఇండియా, సబ్‌కా సాత్ సబ్ కా వికాస్ అని పెద్ద పెద్ద నినాదాలు ఇచ్చారే తప్ప ఏమైనా లాభం చేకూర్చారా అని ప్రశ్నించారు. దేశంలో ఖాళీగా ఉన్న 18లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు మోడీ తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. భేటీ పడావో భేటీ బచావో అంటూ నినాదం ఇచ్చిన బిజెపి పాలనలో ఆడపిల్లల చదువులకు ఏం చేశారని నిలదీశారు. భేటీ బచావో అనే పదం నినాదంగానే మిగిలిపోయిందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళిత, పేద మహిళలపై రోజు దాడులు జరిగిన సంఘటనలు వెలుగు చూశాయన్నారు. మోడీ పాలనలో దేశంలో రూపాయి విలువ హీన స్థితిలోకి పడిపోయిందన్నారు. డాలర్ ముందు రూపాయి 83 రూపాయలకు పడిపోయిందని, ఇదేనా బిజెపి దేశానికి నిలబెట్టిన గౌరవం అని నిలదీశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే భూమి ఆకాశాన్ని ఒకటి చేసి పిడుగులు పడ్డట్టుగా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, ఎలిమినేటి ఉమ మాదవ రెడ్డి, జనగామా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజి ఎమ్మెల్యేలు గాదిరి కిషోర్‌కుమార్, గొంగిడి సునిత, చిరుమర్తి లింగయ్య, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మాజి మార్కెట్ కమిటి చైర్మన్ నల్లమాస రమేష్ గౌడ్, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, నాయకులు తదితరులు ఉన్నారు.

## రెండు పార్టీలు ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన బహిరంగసభలో కేంద్ర మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. సభలో అమిత్ షా ప్రసంగిస్తూ బిఆర్‌ఎస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టులో కావచ్చు.. మరోకటి కావచ్చునని తెలంగాణాలో అవినీతి మాత్రం విచ్చలవిడిగా పెరిగిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలైనా బిఆర్‌ఎస్ నేతల అవినీతిపై విచారణ జరిపించలేదన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని మరోసారి స్పష్టమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ఢిల్లీకి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఎటిఎంగా మార్చారని విమర్శించారు. ఎంఐఎం, ఓవైసిలకు భయపడి కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదన్నారు. బిజెపిని గెలిపిస్తే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని పునరుద్ఘాటించారు. తెలంగాణలో 12 లోక్‌సభ సీట్లలో గెలిపించి మోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేయాలని, మెదక్‌లో బిజెపిని వికసింపచేసి రఘునందన్‌రావును గెలిపించాలని ఆయన కోరారు. ఈ సభలో మాజీ ఎంఎల్‌ఎలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల లలిత, జి.ప్రేమేందర్‌రెడ్డి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి, నాయకులు రాంచందర్‌రావు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

### అమిత్‌షాకు సహార బాధితుల నిరసన సెగ

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న బిజెపి విశాల జనసభ బహిరంగ సభలో ప్రసంగిస్తుండగా సహార బాధితులు తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. సహార బాధితులు తమకు న్యాయం చేయాలని, సహార ఏజెంట్లను ఉరితీయాలని, డిపాజిట్‌దారులకు డబ్బులు చెల్లించాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. డిపాజిట్‌దారులు పెద్ద ఎత్తున ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేసినప్పటికీ కేంద్రమంత్రి అమిత్‌షా స్పందించకపోవటం విచారకరం. డిపాజిట్‌దారులు బహిరంగ సభలో ముందుకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు.

## మ్యానిఫెస్టోలో ఎక్కడుంది?

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి నేతలు అరుణ్ జైట్లీ, జయంత్ సిన్హాలు వారసత్వ పన్నుకు అనుకూలంగా మాట్లాడారని గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ అబద్ధాలను వ్యాప్తి చేస్తూ, నిజమైన అంశాల నుండి ప్రజల దృష్టిని మరల్చారని విమర్శించారు. ప్రధాని మోదీ 'సత్యమేవ జయతే'కు సంకేతంగా మారారని అన్నారు. బిజెపి చెబుతున్న అంశాలను తాము పట్టించుకోబోమని, నిరుద్యోగం, ధరల పెరుగు అంశాలపైనే మాట్లాడుతామని స్పష్టం చేశారు. లోక్‌సభ మొదటి దశ ఎన్నికలలో బిజెపి కొన్ని రాష్ట్రాలలో తుడిచి పెట్టుకుపోతుందని, మరి కొన్ని రాష్ట్రాలలో 2019 కంటే చాలా తక్కువ స్థానాలు వస్తాయని తెలిపారు. దీంతో మోదీ మరో దిశగా ఎన్నికల ఎజెండాను మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని, మొదట కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు మతం రంగు పులిమేందుకు ప్రయత్నించాడని, తరువాత న్యాయ్ పత్ర్ (కాంగ్రెస్ మ్యానిఫెస్టో)లో లేని అంశాలపై మాట్లాడుతూ అబద్ధాలతో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారం చేస్తున్నప్పటికీ మోదీ కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు ప్రచారం చేస్తున్నారని వ్యంగ్యంగా అన్నారు. రాహుల్‌గాంధీ భారత జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్రలో వచ్చిన ప్రజల నుండి వచ్చిన సూచనల ఆధారంగా తమ మ్యానిఫెస్టోను రూపొందించినట్లు తెలిపారు. తమది సానుకూల ఎజెండా అని, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రాజ్యాంగం, వ్యవస్థలపై దాడి వంటి అంశాలపై తాము ఎన్నికల పోరాటం చేస్తున్నామని జైరామ్ రమేశ్ అన్నారు. ప్రధాని మోదీ '400 పార్', 'మోదీ గ్యారంటీ' అనే నినాదాలు ఇవ్వడం ఆపేశారని, ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకు నిస్సిగ్గుగా ప్రజలను చీల్చే భాష వాడుతున్నారని అన్నారు.

## ఎంఎల్‌సి ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎంఎల్‌ఎగా గెలుపొందిన నేపథ్యంలో గత డిసెంబర్ 9న ఆయన తన ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా ఎంఎల్‌సి పదవీకాలం 2027 మార్చి 29 వరకు ఉంటుంది. కాగా 2021 మార్చిలో జరిగిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్ రెడ్డి(టిఆర్‌ఎస్), ప్రొఫెసర్ ఎం.కోదండరామ్(టిజెఎస్), తీన్మార్ మల్లన్న (ఇండిపెండెంట్), విజయసారథి (సిపిఐ), ప్రేమేందర్‌రెడ్డి (బిజెపి) పోటీ చేయగా పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపొందిన విషయం తెలిసిందే.

### కాంగ్రెస్ తరపున తీన్మార్ మల్లన్న

నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ ముందస్తుగానే తమ అభ్యర్థిని ప్రకటించింది. ఎంఎల్‌సి అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న పేరును ఖరారు చేసిన విషయం తెలిసిందే.

### ఎన్నికల షెడ్యూల్

మే 2న నోటిఫికేషన్, మే 9 వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు, మే 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు, మే 27న ఉప ఎన్నిక (ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్), జూన్ 5న ఓట్ల లెక్కింపు

## 700 నామినేషన్లు!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 18న నోటిఫికేషన్ వెలువడ గా, అదే రోజు నుంచి నామినేషన్‌లు స్వీకరణ ప్రారంభమైన విషయం తెల్సిందే. మొత్తం 17 స్థానాల్లో బుధవారం వరకు 603 మంది పోటీలో నిలవగా, చివరి రోజైన నేడు పెద్దఎత్తున నామినేషన్‌లు దాఖలయ్యాయి. గురువారంతో నామినేషన్‌ల దాఖలుకు గడువు ముగియడంతో శుక్రవారం నుంచి పరిశీలన జరగనుంది. 29న ఉపసంహరణ గడువుగా నిర్ణయించారు. మరోవైపు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకూ నామినేషన్‌ల గడువు ముగిసింది. 17 ఎంపి స్థానాలు, ఒక ఎంఎల్‌ఎ స్థానానికి మే 13న ఎన్నికలు జరగనుండగా, జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు డమ్మీ అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు కూడా చాలా మంది నామినేషన్‌లు దాఖలు చేశారు. నామినేషన్‌ల ఉపసంహరణకు ఈనె 29వ తేదీ తుది గడువుగా నిర్ణయించిన విషయం తెల్సిందే. వచ్చేనెల 13న పోలింగ్, జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. గురువారం చివరి రోజు, దీనికి తోడు మంచి రోజు కావడంతో ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యాయి. కొంతమంది అభ్యర్థులు రెండు లేదా మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. ఇక్కడి నుంచి 13 నామినేషన్లు దాఖలయ్యాయి. శాసనసభ స్థానంలో బిఆర్‌ఎస్ తరఫున దివంగత మాజీ ఎంఎల్‌ఎ నందిత సోదరి నివేదిత బరిలో నిలవగా, కాంగ్రెస్ తరఫున నారాయణ్ శ్రీ గణేశ్, బిజెపి తరఫున వంశా తిలక్ నామినేషన్‌లు దాఖలు చేశారు.

## రద్దుకు బిజెపి కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నదన్నారు. మండల్ కమిషన్ అంశం ముందుకు రాగానే కమండల్ తీసుకొచ్చారని, అద్వానీ రథయాత్ర తీసి మత విద్వేషాలను రెచ్చగొట్టి, రెండు జాతుల మధ్య పంచాయతీ పెట్టించి, మండల కమిషన్‌ను అమలు కాకుండా బిజెపి అడ్డుకున్నదని రేవంత్ దుయ్యబట్టారు. మండల్ వర్సెస్ కమండల్ అని చర్చ కూడా జరిగిందని గుర్తు చేశారు. ఒబిసి జనగణను లెక్కించి, నిధుల కేటాయింపు, నియామకాల విషయంలో స్పష్టమైన గిరిగియాలని రాహుల్ అనుకుంటున్నారని, ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లను అమలు చేసిన కాంగ్రెస్, ఇప్పుడు ఒబిసిల పక్షాన నిలబడేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. అందుకే బిజెపి కుట్ర చేసి, ఎన్నికల్లో కాంగ్రెస్‌పై విషప్రచారం చేసి, ఎలాగైనా ఎన్నికల్లో గెలుపొందాలని, తద్వారా రిజర్వేషన్లను రద్దు చేయాలని బిజెపి బావిస్తోందన్నారు.

### రిజర్వేషన్లు రద్దు చేసే బిజెపికి ఎలా మద్దతిస్తారు?

వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న వారు రిజర్వేషన్లు రద్దు చేయాలనుకుంటున్న బిజెపికి ఏ విధంగా మద్దతునిస్తున్నారో తెలియదని రేవంత్‌రెడ్డి అన్నారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం బిజెపికి మద్దతునిస్తే, నూటికి నూరు శాతం రిజర్వేషన్ల రద్దుకు దారి తీస్తుందన్నారు. రిజర్వేషన్లు ఉండాలా? రద్దు కావాలా? అనే రిఫరెండంతో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. రిజర్వేషన్లను ఉండాలని, ఎస్‌సి,ఎస్‌టి,మైనార్టీ, ఒబిసిలకు అండగా నిలడాలని కాంగ్రెస్ అనుకుంటుందన్నారు. దేశాన్ని రూ.168 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచారని, గత ప్రధాన మంత్రులు కలిసి రూ.54 లక్షల కోట్లు అప్పులు చేస్తే, పదేళ్లలో మోదీ ప్రభుత్వం రూ.113 లక్షల కోట్లు అప్పులు చేసిందని వివరించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిజెపి పాలనలో అంబానీ, ఆదాని లు బాగుపడ్డారన్నారు. దీప్ దాస్ మున్షీ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మోడీ ప్రభుత్వం దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారన్నారు. బిజెపి పరివార్ పోయి, మోడీ పరివార్ వచ్చిందని ఎద్దేవా చేశారు.

### 'నయవంచన ఛార్జ్ షిట్' ప్రతి ఇంటికి చేరాలె..భట్టి విక్రమార్క

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, దేశ సంపదను క్రోని క్యాపిటలిస్ లకు అప్పగిస్తోందని విమర్శించారు. దేశ సంపదను క్రోని క్యాప్టలిస్ట్ లకు దోచిపెట్టిన విషయాన్ని రాహుల్ గాంధీ తన పాదయాత్ర ద్వారా దేశమంతా ప్రచారం చేశారన్నారు. ప్రజలకు బిజెపి చేసిన 'నయవంచ ఛార్జ్ షీట్'ను ప్రతి ఇంటికీ, పౌరునికి చేరేలా పార్టీ శ్రేణులు చూడాలని పిలుపునిచ్చారు.

## నడ్డాకు ఇసి నోటీసు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించలేదు. అయితే, ప్రధానికి వ్యతిరేకంగా తమకు వచ్చిన ఫిర్యాదుల ప్రతులను నోటీసుతో పాటు జత చేసి నడ్డాకు ఇసి పంపింది. ఒక ప్రధానికి వ్యతిరేకంగా ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘనపై నోటీసు ఇవ్వడం ఇదే ప్రథమమని ఇసి వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే, రాహుల్ గాంధీ ప్రసంగాలకు వ్యతిరేకంగా బిజెపి చేసిన ఫిర్యాదులపై కూడా ఖర్గేకు ఇసి నోటీసు జారీ చేసింది. ఈ నోటీసులపై ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటల వరకు వివరణ ఇవ్వాలని కోరింది. గతంలో ఎన్నికల పరవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారికి నేరుగా ఇసి నోటీసులు ఇచ్చేది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా కొందరికి ఇలాగే నోటీసులు ఇచ్చింది. స్టార్ క్యాంపెయినర్‌లకు కళ్ళెం వేసేందుకు బాధ్యులను చేస్తూ ప్రజా ప్రాతినిధ్య చట్టంలో నిబంధనల ఆధారంగా పార్టీ అధ్యక్షులకు నోటీసులు ఇచ్చినట్లు ఇసి వర్గాలు సమర్థించుకున్నాయి. స్టార్ క్యాంపెయినర్‌లు చేసే ప్రసంగాలకు వ్యక్తిగత బాధ్యత వహించాల్సినప్పటికీ , ఒక్కో కేసును బట్టి పార్టీ అధ్యక్షులకు ఇసి లేఖ రాస్తుందని ఎన్నికల సంఘం వర్గాలు పేర్కొన్నాయి. ప్రజల సంపదను తీసుకొని ముస్లింలకు పునఃపంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోందని, అలాగే మహిళల మంగళసూత్రాలు కూడా వదిలిపెట్టరని ఈ నెల 21న మోదీ చేసిన వ్యాఖ్యలపై ఇసికి ఫిర్యాదులు వెళ్ళాయి. రాజకీయ ప్రసంగాల ద్వారా ఉన్నత ప్రమాణాలను నెలకొల్పాలని , ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా తప్పకుండా అమలు చేయాలని బిజెపి స్టార్ క్యాంపెయినర్‌ల దృష్టికి తీసుకెళ్ళాలని నడ్డాను ఇసి కోరంది. ఉన్నత స్థానాలలో ఉన్న వ్యక్తులు ప్రచారంలో చేసే ప్రసంగాలు చాలా తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తాయని పేర్కొంది. ఒక ప్రధానికి వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకోవడం ఇదే మొదటిసారి అని ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు ఇచ్చిన ఫిర్యాదులపై ప్రధానికి ఎన్నికల సంఘం క్లీన్‌చిట్ ఇచ్చింది. ప్రధానికి వ్యతిరేకంగా ఇసి తీసుకున్న కొన్ని నిర్ణయాల విషయంలో అప్పటి ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసా తన లిఖిత పూర్వక అసమ్మతిని వ్యక్తం అలాగే నడ్డాతో పాటు, రాహుల్‌గాంధీ ప్రసంగాలకు సంబంధించి ఖర్గేకు కూడా ఇసి నోటీసులు జారీ చేసింది. అయితే నోటీసులలో మోదీ, రాహుల్ గాంధీ, ఖర్గే పేర్లను నేరుగా ప్రస్తావించకుండా , వారిపై చర్య తీసుకోవాలని వచ్చిన వినతిపత్రాలను నడ్డా, ఖర్గేలకు ఇసి పంపిన నోటీసులతో జత చేశారు. కేరళ రాష్ట్రం కొట్టాయంలో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ దురుద్దేశ్యంతో కూడిన తప్పుడు ఆరోపణలు చేశారని, ప్రధాని ఒకే దేశం ఒకే భాష, ఒకే మతం దిశగా దేశాన్ని నెట్టేస్తున్నారని ఆరోపించారని బిజెపి ఫిర్యాదు చేసింది.అలాగే తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో కూడా ప్రధాని మన భాష, చరిత్ర, సంప్రదాయాలపై దాడి చేస్తున్నారని రాహుల్ ఆరోపించారని కూడా ఫిర్యాదు చేసింది. తనను అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానించలేదని, ఎస్‌సి, ఎస్‌టిలపై వివక్షనే ఇందుకు కారణమని ఖర్గే వ్యాఖ్యానించారని, ఇది కూడా ఎన్నికల నియమావళి ఉల్లంఘనే అవుతుందని బిజెపి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుల ఆధారంగానే ఖర్గేకు ఇసి నోటీసు జారీ చేసింది.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024



| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |



## భుజాలపైకి ప్రచార బాధ్యత

భర్తలు జైళ్లలో ఉంటే, ఆయా పార్టీల బాధ్యతలు భార్యలు స్వీకరించడం కొత్తేమీ కాదు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్, జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) చీఫ్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్ తమతమ పార్టీల ప్రచార బాధ్యతలను భుజాలపైకి ఎత్తుకున్నారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ పశువుల మేత కుంభకోణంలో ముద్దాయిగా జైల్లో ఉన్నప్పుడు, ఆయన భార్య రబ్రీ దేవ్ పార్టీ పగ్గాలు స్వీకరించారు. ముఖ్యమంత్రి పీఠాన్ని కూడా అధిరోహించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమార్జన, క్విడ్ ప్రొకో ఆరోపణలపై జైలుకు వెళ్లినప్పుడు ఆయన భార్య భారతి రంగంలోకి దిగారు. తల్లి విజయమ్మ, చెల్లెలు వైఎస్ షర్మిల కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరిన షర్మిల ఆంధ్రప్రదేశ్‌లో తన సోదరుడు జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తుండడం విశేషం.

ప్రస్తుత లోక్‌సభ విషయానికి వస్తే, మద్యం కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటూ కేజ్రీవాల్ జైల్లో ఉన్నందున, ఆ పార్టీ తరఫున ప్రచార బాధ్యతలను సునీత స్వీకరించారు. ఢిల్లీతోపాటు పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోనూ ఆమె పర్యటిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. భూకబ్జా కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న హేమంత్ సోరెన్‌కు ఆయన భార్య కల్పన అండగా నిలిచారు. 'ఇండియా' కూటమి తరఫున ఆమె ఎన్నికల సభల్లో పాల్గొంటున్నారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు బనాయించి, వారిని జైల్లోకి తోస్తున్నదంటూ సునీత, కల్పన తమతమ ప్రసంగాలను కొనసాగిస్తున్నారు.

## యుపిలో 8 కీలక స్థానాలు

ఏడు విడతల్లో పూర్తికానున్న లోక్‌సభ ఎన్నికల మొదటి ఘట్టం ఈనెల 19న పూర్తికాగా, 26వ తేదీ, శుక్రవారం రెండో విడత పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికల్లో ఎప్పు డూ ఉత్తరప్రదేశ్ (యుపి) ఫలితాలే కీలకం. అందుకే, ఈసారి కూడా దేశ ప్రజల దృష్టి యుపిపైనే ఉంది. సమాజ్‌వాది పార్టీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీలుగా ఉన్న 'ఇండియా' కూటమి కి, బిజెపి నేతృత్వం వహిస్తున్న ఎన్డీఎకు మధ్య కీలక సమరం జరగనుంది.



ఈసారి ఒంటరిగా నే బరిలోకి దిగాలని బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పీ) చీఫ్ మాయావతి నిర్ణయించుకోవడంతో పోరు త్రిముఖంగా మారే అవకాశాలు లేకపోలేదని పరిశీలకు లు అంటున్నారు. రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో జరిగిన ర్యాలీలో దేశ సంపదను ముస్లింలకు ధారాదత్తం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని, ఆ పార్టీని గెలిపిస్తే హిందువులు దారుణంగా నష్టపోతారని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్న నేపథ్యంలో, రెండో విడత పోలింగ్ ఉత్కంఠ రేపుతున్నది. అమ్రోహా, మీరట్, భాగ్‌పట్, ఘజియాబాద్, గౌతం బుద్ధ్ నగర్, అలీఘర్, మధుర, బలందర్‌షహర్ లోక్‌సభ స్థానాలకు జరుగుతున్న ఈ పోలింగ్‌లో మొత్తం 91మంది సభ్యులు పోటీలో ఉన్నారు. 2019లో, రెండవ దశలో ఎన్నికలు జరగనున్న ఎనిమిది సీట్లలో ఏడు స్థానాలను బిజెపి గెలుచుకుంది, అమ్రోహా సీటను బిఎస్పీ కైవసం చేసుకుంది. ఈసారి ఈ నియోజకవర్గంలో విజయం కోసం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, లోక్‌సభ ఎన్నికల కోసం శ్రమిస్తున్నారు. 'ఇండియా' కూటమి అభ్యర్థి కున్వర్ డానిష్ అలీకి మద్దతుగా ప్రచారం చేశారు. బిఎస్పీ తరఫున ముజాహిద్ హుస్సేన్ బరిలోకి ఉన్నారు. 2014లో ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన కన్వర్ సింగ్ తన్వర్ బిజెపి అభ్యర్థిగా మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో డానిష్ అలీకి 6,01,082 ఓట్లు రాగా, కన్వర్ సింగ్ తన్వర్‌కు 5,37,834 ఓట్లు లభించాయి. రామాయణ్ టీవీ సీరియల్‌లో రాముడిగా నటించిన అరుణ్ గోవిల్ బిజెపి అభ్యర్థిగా రాజకీయాల్లో అరంగేట్రం చేస్తున్న మీరట్ నియోజకవర్గంలో, యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మూడు పర్యాయాలు ఈ నియోజకవర్గం నుంచి ఎంపిగా ఎన్నికైన రాజేంద్ర అగర్వాల్ స్థానంలో అరుణ్ గోవిల్‌ను బిజెపి ఎంపిక చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచి సమాజ్‌వాది పార్టీ, బిఎస్పీ, ఆర్ఎల్‌డి కూటమికి చెందిన యాకూబ్ ఖురేషిపై అగర్వాల్ కేవలం 5000 స్వల్ప మెజారిటీతో గెలిచారు. ఈసారి సమాజ్‌వాది పార్టీ, బిఎస్పీ కూడా, 36 శాతం ముస్లిం జనాభా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి హిందూ అభ్యర్థులనే నిలబెట్టడం గమనార్హం. సమాజ్‌వాది పార్టీ నుంచి సునీతా వర్మ, బిఎస్పీ నుంచి దేవవ్రత్ కుమార్ త్యాగి పోటీలో ఉన్నారు. రెండుసార్లు గెలిచి, హ్యాట్రిక్ కోసం ఎదురుచూస్తున్న సినీనటి హేమమాలిని బిజెపి తరఫున మరోసారి ఎన్నికల్లో నిల్చుంటున్నారు. 'ఇండియా' కూటమి నుంచి కాంగ్రెస్‌కు చెందిన ఒబిసి నాయకుడు ముఖేష్ ధన్గర్, బిఎస్పీ నాయకుడు చౌదరి సురేశ్ సింగ్ ఈసారి హేమామాలినితో పోటీపడుతున్నారు. మార్పు కోసం 'ఇండియా' కూటమి అభ్యర్థిని గెలిపించాలని అంటూ కాంగ్రెస్ ఓట్లు అడుతున్నది. 2014లో హేమామాలిని రాష్ట్రీయ లోక్‌దళ్ నాయకుడు, అప్పటి సిట్టింగ్ ఎంపి జయంత్ చౌదరిని ఓడించారు. కాగా, జయంత్ చౌదరి ఈసారి బిజెపితో చేతులు కలిపారు. కాగా, బిఎస్పీ తరఫున పోటీ చేస్తున్న చౌదరి సురేశ్ సింగ్ జాట్ వర్గానికి చెందిన బలమైన నాయకుడు. గతంలో బిజెపిలో ఉన్న ఆయన ఇప్పుడు బిఎస్పీ తరఫున పోటీలో ఉన్నారు. నిజయోవర్గంలోని 19.30 లక్షల ఓటర్లలో, జాట్ కమ్యూనిటీ దాదాపు 5 లక్షల ఓట్లతో అత్యంత ప్రభావవంతమైన వర్గంగా గుర్తింపు పొందింది. ఆ తర్వాతి స్థానాల్లో రాజ్‌పుత్‌లు, బ్రాహ్మణులు (సుమారు 3 లక్షల మంది) ఉన్నారు. ఇక్కడ జాదవుల సంఖ్య 2 లక్షలుకాగా, ముస్లింలు 1.6 లక్షల మంది ఉన్నారు. ఏ వర్గం వారు ఎవరికి ఓటు వేస్తారన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. కాగా, కేంద్ర మంత్రి పురుషోత్తమ్ రూపాలా రాజ్‌పుత్‌లపై చేసిన వ్యాఖ్యలతో నిరసన వెల్లువలను చవిచూస్తున్న బిజెపి ఘజియాబాద్‌లో నందకిషోర్ పండిత్‌ను పోటీకి దింపింది. మార్చి 22న జరిగిన ఒక దళిత సమ్మేళనంలో పాల్గొన్న రూపాలా రాజ్‌పుత్‌లను ఉద్దేశించి, వారంతా బ్రిటిషర్ల అడుగులకు మడుగులొత్తారని విమర్శించారు. తమ కుమార్తెలనిచ్చి వివాహాలు కూడా చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజ్‌పుత్ వర్గా ల్లో దుమారం రేపాయి. ఈసారి ఎన్నికల్లో రాజ్‌కోట్ నుంచి పోటీ చేస్తున్న రూపాలా వ్యాఖ్యల ప్రభావం ఘజియాబాద్ నియోజవర్గంలోనూ బలంగానే ఉంటుందని అంటున్నారు. కాగా, కాంగ్రెస్ నుంచి డాలీ శర్మ పోటీ చేస్తున్నారు. ఈ నిజయోకవర్గంలో ముస్లింలు, దళితుల



తర్వాత, రాజపుత్‌ల జనాభా ఎక్కువ. కాబట్టి, రూపాలా వ్యాఖ్యల కారణంగా బిజెపి ఇక్కడ సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉంది. భాగ్‌పట్ నిజయోజకవర్గంలో రాజ్‌కుమార్ సంగ్వాన్ (రాష్ట్రీల లోక్‌దళ్), ప్రవీణ్ బన్సాల్ (సమాజ్‌వాది పార్టీ) మధ్య ద్విముఖ పోరు ఉంటుందని అంచనా. అలీగఢ్‌లో సమాజ్‌వాది పార్టీ నుంచి బిజేంద్ర సింగ్, బిజెపి నుంచి సతీష్ కుమార్ గౌతమ్ మధ్య పోటీ ఉండవచ్చు. అదే విధంగా గౌతమ్ బుద్ధ్ నగర్‌లో డాక్టర్ మహేశ్ శర్మ (బిజెపి), మహేంద్ర నాగర్ (సమాజ్‌వాది పార్టీ) మధ్య ముఖాముఖి పోరు తప్పకపోవచ్చు. బిఎస్పీ నుంచి రాజేంద్ర సింగ్ సోలంకీ కూడా రేసులో ఉన్నారు. బులందర్‌షహర్‌లో బిజెపి నుంచి భోలా సింగ్, సమాజ్‌వాది పార్టీ నుంచి 'ఇండియా' కూటమి అభ్యర్థిగా శివరామ్ వాల్మీకి మధ్య ద్విముఖ పోటీ ఉండవచ్చు.



## రాయ్‌బరేలీ నుంచి వరుణ్‌కు ఆఫర్?

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేయాల్సిందిగా వరుణ్ ఫిరోజ్ గాంధీని బిజెపి కోరిందని, అయితే, ఆయన ఈ ఆఫర్‌ను తిరస్కరించారని సమాచారం. పార్టీ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వచ్చిన వార్తా కథనాలను అనుసరించి రాయ్‌బలేరీ నుంచి కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ వరుణ్ రంగంలోకి దిగితే, 'గాంధీ వర్సెస్ గాంధీ' పోరు ఉంటుందని బిజెపి ఆశిస్తోంది. అయితే, ఇందుకు వరుణ్ ఏమాత్రం ఆసక్తిని ప్రదర్శించలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పిలిభిత్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అయితే ఈసారి ఆయన స్థానంలో జితిన్ ప్రసాదకు బిజెపి రంగంలోకి దింపింది. ఈ హఠాత్ పరిణామంతో వరుణ్ మనస్తాపం చెందారని అంటున్నారు. తన ఇంటి తలుపులు ఎప్పుడూ ప్రజల కోసం తెరచుకునే ఉంటాయని, పిలిబిత్‌కు ఎలాంటి సేవలు అందించడానికైనా తాను నిరంతరం సిద్ధంగా ఉంటానని పేర్కొంటూ ఆయన ఒక బహిరంగ లేఖ కూడా రాశారు.

ఇలావుంటే 2004 నుంచి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న రాయ్‌బరేలీ నుంచి గత ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ, ఈ ఏడాది ఫిబ్రవరిలో రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. దీనితోఈ స్థానాన్ని ప్రియాంకకు కేటాయించాలని కాంగ్రెస్ ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెప్తున్నారు. బిజెపి నుంచి నూపుర్ శర్మ టికెట్ ఆశిస్తున్నారు. వరుణ్ పోటీకి నిరాకరించడంతో, నూపుర్‌కు బిజెపి టికెట్ లభించే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

## గెలిపించండి ఇంకా అభివృద్ధి చేస్తాం



**ప్రజాపక్షం/రామన్నపేట:** ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించండి అద్భుతంగా అభివృద్ధి చేసే బాధ్యత మాదని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎంపి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో సుభాష్ విగ్రహం వరకు జరిగిన రోడ్‌షోలో కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలను పూర్తి చేస్తామని, అర్హులైన ప్రతి బీదవానికి పెన్షన్లు, ఇండ్లు ఇస్తామని రాబోయే డీలిమిటేషన్‌లో రామన్నపేటను తిరిగి నియోజకవర్గంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేసి యువకులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు.

లక్షకుపైగా భారీ మెజార్టీతో చామల కిరణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా నాయకులు దామోదర్‌రెడ్డి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ఉట్కూరు నరసింహా, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నూతి విద్యాసాగర్‌రావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పున్నా కైలేష్, కోఆర్డినేటర్ వెంకటరమణ, ఎంపిపి పూస బాలమణి బాలనరసింహా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, ఎంపిటిసిలు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఎండీ.రేహాన్, నాయకులు రాజిరెడ్డి, పూస బాలకిషన్, రామిని రమేష్, జెల్లా వెంకటేశం, ఎండి. అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


## జనసందోహం మధ్య రఘురాం రెడ్డి నామినేషన్

### ఖమ్మంలో కాంగ్రెస్–కమ్యూనిస్టు భారీ ర్యాలీ

### ముందుపీఠిన మంత్రులు పొంగులేటి, తుమ్మల, రేణుకాచౌదరి, సిపిఐ నేత కూనంనేని, పలువురు ఎంఎల్‌ఎలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆలస్యంగా వచ్చినా అదరగొట్టాడన్నట్లు ఖమ్మం పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన నాటి నుంచి ఎవరు నిర్వహించని రీతిలో అట్టహాసంగా కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ జన సందోహంతో గురువారం ఆయన నామినేషన్‌ను దాఖలు చేశారు. నామినేషన్‌కు ముందు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ఇంచార్జి దీపా దాస్ మున్షిని కలిసి ప్రత్యేక పూజల అనంతరం ఖమ్మంకు బయలుదేరిన రఘురాంరెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఖమ్మం నయాబజార్ కళాశాల వద్ద భారీ స్వాగతం లభించింది. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజక వర్గాల నుంచి కదిలి వచ్చిన కాంగ్రెస్ వామపక్ష కార్యకర్తలు నయాబజార్ కళాశాల నుండి నూతన కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అగ్ర భాగాన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని





సాంబశివరావు, ఖమ్మంజిల్లాకు చెందిన శాసన సభ్యులు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావిద్, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్ ఎదుట రఘురాం రెడ్డి రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు.

**సేవ చేసే అవకాశం కల్పించండి : రామ సహాయం**

బిఆర్ఎస్ ప్రభుత్వం అన్నింటా విఫలమైందని కాళేశ్వరం మొదలు పరీక్ష ల నిర్వహణ వరకు ఎక్కడ బిఆర్ఎస్ ప్రభుత్వం సఫలీకృతం కాలేదని ఖమ్మంపార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. నామినేషన్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు పోటీ చేసే అవకాశం కల్పించిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని ఓటర్లు తనకు ఓటేసి సేవ చేసే భాగ్యం కలిగించాలన్నారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడమే అందరి లక్ష్యం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐదేండ్ల పాటు మౌనంగా ఉండి ఇప్పుడు బాపు పేరుతో కెసిఆర్ తిరుగుతున్నారని ఆయనను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రామాలయాలు నిర్మించిన బిజెపికి ఓటేయాలనుకుంటే నేను రామాలయం నిర్మించానని రఘురాంరెడ్డి తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్యం పదిలం

### అలంపూర్ ఎన్నికల ప్రచారంలో మంత్రి జూపల్లి, ఎంపి అభ్యర్థి మల్లు రవి



**ప్రజాపక్షం/అలంపూర్:** కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజాస్వామ్యం పదిలంగా ఉంటుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి క్రిష్ణారావు, పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్‌లు అన్నారు. గురువారం నాడు అలంపూర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ముందుగా వారు జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం జోగులాంబ అమ్మవారి దేవాలయం నుండి ర్యాలీగా బయలుదేరి గాంధీ చౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి క్రిష్ణారావు మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఆలంపూర్ ప్రాంతానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులు అయిన తుమ్మిళ తదితర సాగు నీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారన్నారు. కాంగ్రెస్ వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్‌లోకి తన స్వార్థ్యం కోసం వెళ్లి దళిత జాతిని అవమానించారన్నారు. పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్‌లు మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడపుతున్నాయని కాంగ్రెస్ వస్తేనే రాష్ట్రానికి, దేశానికి మేలు జరుగుతుందన్నా రు. తనను ఎంపిగా ఈ ప్రాంత ప్రజలు గెలిపిస్తే తాగు, సాగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. అనంతరం ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటువేసి తప్పు చేశామని అలంపూర్ ప్రజలు అనుకుంటున్నారని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ తప్పు చేయకుండా కాంగ్రెస్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. అనంతరం సిపిఐ నాయకులు పెద్దబాబు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి మాట్లాడారు. బిజెపిని సాగనంపాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ఇస్మాయిల్, కాంగ్రెస్ నాయకులు చారి,రాము తదితరులు పాల్గొన్నారు.

## రాజేందర్‌రావుకు సిపిఐ నేతల మద్దతు




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెలిచాల రాజేందర్‌రావు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలు గురువారం కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సిపిఐ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ మర్రి వెంకటస్వామితో పాటు ఇతర నేతలను కలిసారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించి గెలుపులో సిపిఐ శ్రేణులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో పాటు సిపిఐ భాగస్వామ్యం ఉన్నందున రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు అన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం సిపిఐ శ్రేణులు పనిచేస్తారని తెలిపారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలో రాజేందర్‌రావుకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఆయన గెలుపు కోసం సిపిఐ, కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సమావేశంలో సిపిఐ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గడిపె మల్లేష్, ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి , కాంగ్రెస్ నాయకులు అంజని కుమార్, జక్కని ఉమాపతి, బత్తిని చంద్రయ్య, మల్లిఖార్జున శైలజ, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, గొడిశెల తిరుపతి, పైడిపల్లి రాజు, మంద సుదర్శన్, కంది రవీందర్ రెడ్డి, బ్రాహ్మాండ్లపెల్లి యుగేందర్, ముద్రకోల రాజయ్య, న్యాలపట్ల రాజు, చెంచల మురళి, మల్లేశం తదితరులున్నారు.

## మాకు దమ్ముంది హామీలు అమలు చేస్తాం : మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీల మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత విడతల వారీగా అమలు చేస్తున్నామని.. మా ప్రభుత్వానికి దమ్ముందని, అమలు చేసి తీరుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో కరీంనగర్ ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేందర్‌తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్‌లో భారీ ర్యాలీలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ తరఫున ఎంపి అభ్యర్థిగా బి ఫారమ్ తీసుకున్న తర్వాత మొదటిసారిగా తిమ్మాపూర్‌కు వచ్చిన సందర్భంగా ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర నెలలు అవుతుందన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూం లేదంటే అడగనిచ్చే పరిస్థితులు లేవని, ఉద్యోగాలు లేవంటే పోలీసులతో అణగదొక్కేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గల్లా పూర్తిగా ఖాళీ అయ్యిందని, అయినా అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోపే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందించామన్నారు. అర్హులందరికీ 500లకే గ్యాస్ అందిస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఆగస్టు 15 లోపు 2 లక్షల రైతు రుణమాఫీ



చేస్తామన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి 60 వేల కోట్ల అప్పు ఉంటే కెసిఆర్ దిగిపోయే నాటికి 7 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు ఇయ్యలేదన్నారు. ఎన్నికలు అయిపోగానే కొత్త రేషన్ కార్డులు ఇచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. మహిళలకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామని, వడ్లకు 500 బోనస్ ఇస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3500ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం నిర్మించిన దగ్గర ఓట్లు అడగమని, 200414 మధ్య ఇందిరమ్మ ఇల్లు నిర్మించిన గ్రామాల్లోనే ఓట్లు అడుగుతామని సవాల్ చేశారు. కాంగ్రెస్ వస్తే హనుమాన్ చాలీసా చదువనివ్వరని తప్పుడు ప్రచారం చేస్తున్న బిజెపి నేతలకు బుద్ధుందా? అని ప్రశ్నించారు.

రాముడి పట్టాభిషేకం కూడా కాకముందే అక్షింతలు గ్రామాల్లో పంపిస్తున్నారన్నారు. పదేళ్లలో ప్రధానిగా మోడీ ఈ దేశానికి, రాష్ట్రానికి ఏమైనా చేసి ఉంటే ఆయన ఫోటోలు పెట్టి ఓట్లు అడగాలే తప్ప రాముడి ఫోటోలు పెట్టి ఎందుకు ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. తిరిగి రాముడి పేరుతో రాజకీయం చేయలేదంటున్నారన్నారు.

యాత్రల పేరుతో కెసిఆర్ మళ్లీ ఫోన్ ట్యాపింగ్ చేయడానికే బయలుదేరారా? అని ఎద్దేవా చేశారు. మే 13న పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీ అ

ప్రజాపక్షం

శుక్రవారం, ఏప్రిల్ 26

# హద్దులు దాటుతున్న మోదీ మాటలు

రెండు పర్యాయాలు అధికారంలోకి రావడంలో ప్రతిపక్షాలపై అన్నిరకాల అస్త్రాలను ప్రయోగించిన ప్రధాని నరేంద్ర మోదీకి మూడోసారి అధికారం తనదేనన్న ధీమా సడలుతున్నట్లుంది. అందుకే రెచ్చిపోయి, హద్దులు దాటి, ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఎక్కువ మంది పిల్లలున్న ముస్లింలకు దేశ ఆదాయాన్ని, సంపదను కట్టబెట్టడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదంటూ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌కు ఓటువేస్తే తాళిబొట్లను కూడా ముస్లింలకు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలంటూ హిందూ మహిళలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఒబిసి కోటాకు కోత పెట్టి రిజర్వేషన్లను ముస్లింలకు కట్టబెట్టడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం ప్రయత్నించిందంటూ మరో వివాదానికి తెరతీశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముస్లిం లీగ్ ముద్ర ఉందన్నారు. తాజాగా గురువారం ఆగ్రా ర్యాలీలో ప్రసంగిస్తూ, ఉత్తరప్రదేశ్‌లో'ఇద్దరు అబ్బాయిల' మధ్య స్నేహం బుజ్జగింపు రాజకీయాలపై ఆధారపడి ఉందంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాది పార్టీ నేత, యుపి మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌పై విమర్శలు గుప్పించారు. వీరి బుజ్జగింపు రాజకీయాలు దేశంలోని నిజాయితీపరుల హక్కులను హరిస్తాయని దేశ ప్రజలకు హెచ్చరికలు కూడా జారీ చేశారు. పౌరసత్వ సవరణ చట్టంపై యావత్ దేశంలో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నప్పటికీ, అమలు చేసి తీరుతామంటూ అగ్నికి ఆజ్యం పోస్తున్నారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిపై సహేతుక విమర్శలకు తిలోదకాలిచ్చి, కువిమర్శలకు తెరతీశారు. అసందర్భ మాటలు తూటాలు పేలుస్తున్నారు. దేశాభివృద్ధికి, దేశ భవిష్యత్తుకు, సమస్యల పరిష్కారానికి ఎలాంటి నిర్మాణాత్మక చర్యలు చేపడతామనే అంశాన్ని పక్కకునెట్టి, విపక్ష నేతలపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడడం ప్రధాని స్థాయికి తగని పని. మోదీకి రాజ్యాంగంపై నమ్మకం లేదు. లౌకిక విధానం సరిపడదు. రైతులు, కార్మికుల ప్రయోజనాలు పట్టవు. మతసహనం అంటే ఏమిటో తెలియనే తెలియదు. అభివృద్ధిపై అబద్ధాలు.. అభూత కల్పనలు. భారత శాస్త్రవేత్తలు సాధించిన చంద్రయాన్ వంటి ఘనతను కూడా తన ఖాతాలో వేసుకుంటూ గొప్పలు. 'వికసిత్ భారత్', 'అచ్చేదిన్', 'అమృత్‌కాల్' వంటి పదాల జిమ్మిక్కులే తప్ప మోదీ ప్రసంగాల్లో కొత్తదనం లేదు. 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా', 'స్టాండప్ ఇండియా', 'స్కిల్ ఇండియా' ఇత్యాది పథకాల పేర్లలో లేని జాతీయోత్పత్తిని ఉన్నట్లు భ్రమింపచేసే యత్నాలేగానీ, ప్రజలకు అందుతున్న ఫలాలు అంతంత మాత్రమే. ఒక్కోసారి ఒక్కో కొత్త రకమైన హామీతో ఎన్నికల క్షేత్రంలోకి దిగిన మోదీకి ఈసారి చెప్పుకోవడానికి ఏమీ లేదు. పేదల బతుకులు మెరుగుపడిన దాఖలాలు లేవు. రైతుల ఆదాయం రెట్టింపు హామీకి కాలం చెల్లింది. కోట్లాది ఉద్యోగాల హామీ అటకెక్కింది. ఏ ఒక్క హామీని నెరవేర్చని మోదీ వద్ద ప్రజల ప్రశ్నలకు సమాధానాలు లేవు. ప్రతిపక్షాల విమర్శలకు వివరణలు లేవు. చేసిందిగానీ.. చేయబోయేదిగానీ ఏమీలేక, మళ్లీ మత సంస్కృతినే పాత్ర ధరించారు. హిందూ జాతి ఉద్ధరకుడిగా తనను తాను ప్రకటించుకుంటూ, ముస్లింలపై విషం కక్కుతున్నారు. వారి మత విశ్వాసాలను కించపరుస్తూనే, హిందువుల్లో భయాందోళనలకు కారణమవుతున్నారు. ప్రతిపక్ష నాయకులను విమర్శిస్తున్న తీరు... బడుగుబలహీన వర్గాలను విస్మరిస్తున్న వైనం మోదీ ఆలోచనా సరళిని ఆవిష్కరిస్తున్నాయి. ఆయన, రాజ్యాంగ స్ఫూర్తిని అణచివేసే, భారతీయ హిందూ రాజ్యంగా మార్చేసే ప్రయత్నంలో పడ్డారు. వ్యూహాత్మకంగా ముస్లింల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టి, మత విద్వేషాన్ని హిందువుల మస్తిష్కాల్లో నింపే పన్నాగం పన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడం, ముస్లిం వ్యతిరేకతను పెంచడం ద్వారా హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసుకోవడమే మోదీ అంతర్యం. అందుకు ఆయన ఎన్ని మాటలైనా మాట్లాడతారు. ఎన్ని హద్దులనైనా దాటేస్తారు. దేశ ఐక్యత, భవిష్యత్తు ఏమైపోతేనేం.. పదవి ఉంటే చాలు. ఇదీ మోదీ తీరు.

## సుప్రీంకోర్టు ఆదేశం బేఖాతరు

# 8 కోట్లమందికి రేషన్‌కార్డులు ఏవీ?

**డా.గ్యాన్ పాథక్**

కొవిడ్ మహమ్మారి విజృంభించినప్పుడు 2020 మార్చి 24వ తేదీ సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీ లాక్‌డౌన్ ప్రకటించిన తర్వాత మన దేశంలో వలస కార్మికులు ఎదుర్కొన్న అత్యంత భీతిగొలిపే వాస్తవం మొట్టమొదటిసారి ప్రపంచం దృష్టికి వచ్చింది. ఆర్థిక వ్యవస్థ పూర్తిగా స్తంభించి పోయిన సమయంలో మోదీ ప్రభుత్వం వద్ద ఒక ప్రత్యామ్నాయ విధానం కూడా లేనందున ఆహార సరఫరాతో సహా వలస కార్మికులకు బ్రతకడానికి ఉన్న అన్నిదారులూ మూసుకుపోయాయి. ఆ తర్వాత సరిగ్గా నాలుగు సంవత్సరాల తర్వాత కూడా ఉద్యోగాలు కోల్పోవడం, అతి తక్కువ వేతనాలు, అనిశ్చిత, తాత్కాలిక, అభద్రతతో కూడిన ఉపాధి పొందుతున్న ఎనిమిది కోట్లమంది వలస కార్మికులున్నారు. మార్కెట్ ధరలకు ఆహార వస్తువులు కొనుగోలు చేయలేక, సబ్సిడీపై ఇచ్చే ఆహారధాన్యాలు ఉపయోగించుకోలేని స్థితిలో వారు రేషన్ కార్డులకోసం ఇంకా ఎదురుచూస్తునే ఉన్నారన్న విషయాన్ని భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం 2024 మార్చి 24వ కనుగొన్నది. ఈ కారణంగా భారీ సబ్సిడీలతో లేదా ఉచితంగా సరఫరా చేసేందుకు ఉద్దేశించిన 2013 నాటి ఆహార భద్రతా చట్టం వారికి ఎలాంటి విలువా ఇవ్వడంలేదు సరికదా, సరైన పత్రాలు లేకపోవడంవల్ల చివరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 80 కోట్ల మంది పేద ప్రజలకు ప్రకటించిన ఉచిత ఆహార ధాన్యాలు కూడా ఈ ఎనిమిదికోట్లమంది వలస కార్మికులకు చేరడం లేదు.

భారత సర్వోన్నత న్యాయస్థానం ఈ వలస కార్మికుల దురవస్థను, పేదరికాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు రెండు నెలలలోపు తప్పనిసరిగా రేషన్ కార్డులు ఇచ్చి తీరాలని ఆదేశాలు జారీ చేసిం ది. ఎంత విచారకరమైన విషయమంటే, సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నందువల్ల ఎన్నికల నియమావళి సాకులతో ఇప్పుడు వారికి రేషన్ కార్డులు రావడం లేదు. ఎందుకంటే దేశంలో ప్రభుత్వ అధికారులు అంద రూ ఎన్నికల సందడిలో తలమునకలై ఉన్నారట!

వలస కార్మికులపట్ల ఈ నిర్లక్ష్యం, ఉదాసీనత ఇంకా కొనసాగుతున్నది. నిరుద్యోగం కూడా పెరుగుతున్నది. 2017–18 నాటికి చూస్తే దేశంలో నిరుద్యోగం 45 ఏళ్ళలో ఎన్నడూలేనంతస్థాయిలో 6.1 శాతానికి పెరిగింది. 2016 నవంబర్ 8వ తేదీన దేశంలో ప్రకటించిన నోట్ల ఉపసంహరణ దగ్గర నుండీ కూడా వలస కార్మికులు కష్టాలు అనుభవిస్తూనే ఉన్నారు. కేవలం నగదు చలామణీపైన మాత్రమే మనుగడ సాగించే సూ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఇ)లు నోట్ల ఉపసంహరణ కారణంగా మూత పడటంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోగా, లక్షలాది పరిశ్రమలు, సంస్థలు కూడా 75 శాతం మేరకు తమ కార్యకలాపాలను కుదించుకున్నాయి.

నిరుద్యోగం అసాధారణస్థాయికి చేరుకోవడంతో తమ పేదరికాన్ని భరించలేని అనివార్యమైన పరిస్థితుల్లో అతి తక్కువ వేతనాలు తీసుకుని పనులు చేయడానికి సిద్ధపడటంతో ఆ పరిస్థితులు వలస కార్మికులు దోపిడీకి గురికావడానికి దారితీశాయి. శాశ్వత ప్రాతిపదికపై నియమించే ఉద్యోగాలు భర్తీచేయకుండా వాటిల్లో కూడా కాంట్రాక్టు విధానం, పొరుగు సేవలు (ఔట్‌సోర్సింగ్) విధానం వంటి కార్మిక వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం అనుసరించడంవల్ల సంఘటిత, అసంఘటిత రంగాలలో అనిశ్చితి పెరిగిపోయింది. పనులు కోల్పోయిన లక్షలాదిమంది వలస కార్మికులు తమ తమ భార్యా బిడ్డలతో కలిసి కనీస ఆహారం, తిండి, నీరు కూడా లేకుండా పట్టణ, నగర ప్రాంతాల నుండి తమ స్వస్థలాలైన గ్రామాలకు కాలి నడకన వెనక్కు మళ్లారు. అప్పుడు గాని ఈ వాస్తవం ప్రజలకు తెలియలేదు. ఇలా కాలినడకన వందల కిలోమీటర్లు నడిచి వెళ్ళినవారిలో ఎంతోమంది తిండీ, నీరు, నిద్ర, భద్రత లేక మరణించారు. ఈ విధంగా అమానుషంగా నశించి పోయిన వారి గురించి మీడియా అంతటా అవే వార్తలతో నిండిపోయిన తరుణంలో, వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిచాలని డిమాండ్ చేసినప్పుడు అసలు ఆ విధమైన మరణాల గురించి తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని నరేంద్రమోదీ ప్రభుత్వం పార్లమెంటు వేదికపై బుకాయించింది.

### ఇ–శ్రమ్ పోర్టల్‌లో పేర్ల నమోదులోనూ అన్యాయమే

చివరకు కొవిడ్ మహమ్మారి 2022లో తగ్గుముఖం పడుతున్నప్పుడు ఎట్టకేలకు మోదీ ప్రభుత్వం దిగివచ్చి వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇస్తామని సుప్రీంకోర్టుకు, దేశానికి ఒక హామీ ఇచ్చింది. కనీసం వసల కార్మికులకు ఆ విధంగా సబ్సిడీపై ఆహార ధాన్యాలైనా సమకూరతాయని అందరూ సంతోషపడ్డారు. కానీ కేంద్ర ప్రభుత్వానికి వలస కార్మికులంటే ఎంత నిర్లక్ష్యం, ఉదాసీనతా అంటే, ఈ కార్మికులలో 80 శాతం మందికి ఇ–కెవైసీ పత్రాలు లేవని అందువల్ల వారికి సబ్సిడీపై ఆహార ధాన్యాలు సమకూర్చడం సాధ్యం కాదనీ సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అప్పటినుండీ వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఫలితంగా 2013 ఆహార భద్రతాచట్టం కింద వారికి వర్తించవలసిన సబ్సిడీ/ఉచిత ఆహార ధాన్యాలు వారికి అందడంలేదు. మొదట చెప్పినట్టు 2020 కొవిడ్ సంక్షోభ సమయంలో కూడా 80కోట్లమంది పేదలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన ఉచిత ఆహార ధాన్యాలు కూడా అందలేదు. కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీలకు 2023లో ఎన్నికలు జరిగిన సమయంలో ఈ ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ పథకం కాలపరిమితి ముగుస్తున్నప్పుడు, ఈ పథకాన్ని అదే ఏడాది డిసెంబరు 31 నుండి మరో ఐదేళ్ళపాటు పొడిగిస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ఈ పథకం పొడిగించిన తర్వాతైనా సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు తమకు రేషన్ కార్డులు వస్తాయని వలస కార్మికులు ఎంతో ఆశాభావంతో ఎదురుచూశారు. ఐతే గమనించాల్సిన విషయం ఏమిటంటే, 2021లో ప్రారంభించిన ఇ–శ్రమ్ పోర్టల్ పై వలస కార్మికుల పేర్లు, వారి వృత్తులను రిజిస్ట్రేషన్ చేయించే కార్యక్రమాన్ని మోదీ ప్రభుత్వం వేగవంతం చేసింది. కానీ అలా రిజిస్టర్ చేసుకున్న వలస కార్మికులకు కూడా రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఇప్పటికీ వలస కార్మికులలో చాలామంది పేర్లను ఇ–శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించకపోవడం సమస్యగా మారింది. ఇ–కెవైసి పత్రాలు వంటివి లేవన్న కారణంగా లక్షలాదిమంది వలస కార్మికుల పేర్లు ఇప్పటికీ ఇ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడంలేదు.

దేశంలో వలస కార్మికులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన కష్టాలలో ఇదొకటి. ఈ విధంగా మోదీ ప్రభుత్వం వారి కష్టాలను మరింతగా పెంచుతున్నది. ఉదాహరణకు, పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలును తీసుకుందాం. అసోంలో వలసకార్మికుల జీవితాలపైన, భవితవ్యంపైన ఈ చట్టం ప్రభావం చూపించింది. ప్రత్యేకించి బెంగాలీ భాష మాట్లాడే వలస కార్మికులు దేశంలో ఎక్కడికి వెళ్ళినా వారు బంగ్లాదేశ్ నుండి అక్రమంగా దేశంలోకి వలస వచ్చిన కార్మికులని సందేహిస్తున్నారు. పుణె నుండి వెలువడిన ఒక నివేదిక వారి సమస్యలను, మనోవేదనను కళ్ళకుకట్టింది. వారి పత్రాలన్నీ సరిగ్గానే ఉన్నప్పటికీ ఆధార్, ఓటర్ ఐడిలో అతి చిన్న తేడాలు కనిపించినాగానీ సమస్యగా చూస్తున్నారు. ముఖ్యంగా ఇలా బెంగాలీభాష మాట్లాడే వలస కార్మికులు గనుక ముస్లిం వర్గానికి చెందిన వారైతే వారు మరిన్ని సమస్యల్లో పడుతున్నారు. వలస కార్మికులు ఇంకా ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి నానా తంటాలూ పడుతున్నారు. వారికి సరైన ఉపాధి, ఉద్యోగాలు లేకపోవడంవల్ల ఎన్నికల్లో ఓటు హక్కు ఉపయోగించుకునే సమయానికి వారు తమ స్వస్థలాలకు కూడా వెళ్ళలేకపోతున్నారు. ఎక్కడైనా పనిప్రదేశాల్లో రోజులతరబడి కార్మికులు పనికి రాకపోతే యాజమాన్యాలు ఎట్టిపరిస్థితుల్లోనూ వారిని అనుమతించరు. పైగా ఓటు వేయడానికి వెళ్ళాలంటే వారికి చాలా దారిఖర్చులు అవుతాయి. పైగా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు వారి నిజవేతనాలకంటే కూడా చాలా ఎక్కువగా ఉండటంతో వారికి దక్కాల్సిన కూలీ కూడా గణనీయంగా క్షీణించిపోతున్నది.

### అభివృద్ధి లక్ష్యాల సాధనకు కార్మిక సంక్షేమమే శరణ్యం

వారాంతపు గణాంకాల ప్రాతిపదికపై (సిడబ్ల్యుఎస్) ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికుల సంఖ్యకు అనుగుణంగా 2022–23 పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్)ను గమనిస్తే, కార్మిక జనాభాలో 62 శాతం మంది పనులు చేయడంలేదు. అంటే వారికి పనులు లేవు. అసంఘటిత రంగంలో కూడా వారికి ఎప్పుడూ పనులు ఉండటంలేదు. వేతనపరంగా కూడా వలస కార్మికులు దోపిడీకి గురికావడం పెరిగింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) కూడా గుర్తించింది.

కేంద్ర ఉద్యోగ అధ్యయనాల మానవాభివృద్ధి సంస్థ (ఐహెచ్‌డి), ఐఎల్ఓలు సంయుక్తం గా తయారు చేసిన ఇండియన్ ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ (ఐఇఆర్) ప్రకారం, 90 శాతం కార్మికులు గుడ్డిలోమెల్ల అన్నతరహాలో ఏదోరూపంలో అరకొరస్థాయిలో పనులు సంపాదించుకోగలుగుతున్నారు. వీరిలో 82 శాతంమంది అసంఘటిత రంగానికి చెందినవారే. కేవలం 21.5శాతం మంది మాత్రమే రోజువారీ పనులు చేసుకునే (రెగ్యులర్) కార్మికులు ఉన్నారు. గడచిన పదేళ్ళుగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ పాలనలో వలస కార్మికుల బతుకులు దుర్భరంగా మారిపోయాయి. సిఎంఐఇ (సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, 2024 మార్చి నాటికి దేశంలోని పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగిత నిష్పత్తి 7.8 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం 7.4 శాతంగా ఉంది. అంటే దీని అర్థం గ్రామీణ ప్రాంతాలలో అతి తక్కువ వేతనాలతోనైనా కార్మికులకు కొంతలో కొంత పనులు దొరుకుతున్నాయి. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మోడీ ప్రభుత్వం ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ముందుగా పెంచిన వేతనాలు చాలా తక్కువే. కనిష్టంగా మూడుశాతం నుండి పది శాతం మేరకు వివిధ రాష్ట్రాలలో ఈ వేతనాలు పెంచారు.

మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో ఈ పథకం కింద కనీస వేనాన్ని అతితక్కువగా రూ.221లకు పెంచారు. అందువల్ల గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు కార్మికుల వలసలు పెరుగుతున్నాయని మనం అర్థం చేసుకోవాలి. కానీ దురదృష్టవశాత్తూ పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగం చాలా హెచ్చుస్థాయిలో ఉంది. దీనివల్ల చాలా తక్కువ వేతనాలు ఇస్తున్నారు. దాంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వలస కార్మికులను పెద్దస్థాయిలో దోపిడీకి గురవుతున్నారు. అందువల్ల మోదీ ప్రభుత్వం తక్షణం వలస కార్మికులపై తన దృష్టి కేంద్రీకరించాలి. 2030 నాటికి 8.8 శాతం మేరకు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి) సాధించాలన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వం కార్మికుల హక్కులను పరిరక్షించాలి. వలస కార్మికులు, మహిళా వలసకార్మికులతోపాటు భద్రత తక్కువగా ఉండి, ప్రమాదకరమైన ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు రక్షణ, భద్రత కల్పించి వారు స్వేచ్ఛగా పనిచేయగల పరిస్థితులు సృష్టించాలి. అదేవిధంగా వలస కార్మికుల సంక్షేమం, వారి రక్షణ వంటి అంశాలు కార్మిక విధానంలో కీలక అంశాలుగా ఉండాలి.

# అప్పుచేసి యుద్ధాలకు ఊతం!



భద్రతకు, సార్వభౌమాధికారానికి భంగం వాటిల్లినప్పుడు ఏ దేశమైనా యుద్ధానికి సిద్ధమవుతుంది. అన్ని రకాల వనరులను వినియోగించుకుంటుంది. అవసరమైతే అప్పులు చేస్తుంది. కానీ, వేరే దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను ఏ దేశం కూడా పనిగట్టుకొని ప్రోత్సహించదు. అప్పులు తెచ్చి మరీ నడిపించదు. కానీ, అమెరికాను మాత్రం ఈ విషయంలో మినహాయించాలి. రష్యా మీడియా కథనం ప్రకారం, అమెరికా ఆర్థిక పతనం అంచున ఉంది. చరిత్రలో ఎంతో మంది యుద్ధ పిపసతో మరణించారు. ఎన్నో రాజ్యాలు యుద్ధాల కారణంగానే కుప్పకూలిపోయాయి. ఇప్పుడు అమెరికాదీ అదే పరిస్థితి. అమెరికా 'డెబిట్ క్లోక్'లో అధికారికంగా ఉంచిన సమాచారం కూడా ఈ అనుమానాలను నిజం చేసేదిగానే ఉం ది. అమెరికాకు 34 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉందని ఈ లెక్కల సారాంశం. ట్రిలియన్ అంటే ఒకటి తర్వాత 12 సున్నాలు లేదా లక్ష కోట్లు. అంటే అమెరికా అప్పు 34 లక్షల కోట్ల డాల ర్లు. రష్యా, ఉక్రేన్ యుద్ధాన్ని పెంచిపోషిస్తున్నది. ఉక్రేన్‌కు ఆయుధ సాయం అందిస్తున్నది. ఆయుధాల కోసం సొమ్ము ఎక్కడి నుంచి వస్తున్నది? ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులనే ఖర్చు చేస్తున్నదా? అందుకు ప్రజలు అంగీకరిస్తున్నారా? అమెరికా స్వయంగా యుద్ధం చేయడం లేదా యుద్ధానికి సాయం చేయడం అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నది. కువైట్ లేదా ఇరాక్... శ్రీలంక లేదా అఫ్గానిస్థాన్... వివిధ దేశాలకు, పలు సందర్భాల్లో తన సైన్యాన్ని కూడా పంపుతున్నది. ఈ ఖర్చును ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం నుంచి ఖర్చు చేస్తున్నదనుకుంటే పొరపాటే. అందుకుగాను ఫెడరల్ రిజర్వ్‌పై ఆధారపడుతున్నది. భారీగా అప్పులు తీసుకుంటున్నది. డాల్లర్ అనేది ప్రపంచ కరెన్సీ కాకముందు, అంటే 1920 వరకూ యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన పౌండ్ స్టెర్లింగ్ ప్రపంచ కరెన్సీగా ఉండేది . ఎన్నో దేశాలు తమ భవిష్యత్ అవసరాల కోసం ఇంగ్లాండ్‌లో, పౌండ్ రూపంలో డబ్బు దాచుకునేవి. ఆరోజుల్లో భవిషత్ అవసరాలు అంటే రైలు ఇంజినులు, ఓడ ఇంజిన్లు, ఫ్యాక్టరీలకు.. మిల్లులకు కావాల్సిన యంత్ర సామగ్రి తదితరాలు. ఆ రోజుల్లో ఇంగ్లాండ్‌లోనే ఈ యంత్రాల తయారీ ఎక్కువగా ఉండేది. కాబట్టి అన్ని దేశాలు పౌండ్ రూపంలో డబ్బు దాచుకునేవి. అయితే, మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల తర్వాత అనేక దేశాలు దెబ్బతిన్నాయి. పునర్నిర్మాణం కోసం ఇంగ్లాండ్‌లో దాచుకున్న సొమ్మును యంత్రాలు లేదా యంత్ర సామాగ్రి రూపంలో వెనక్కు తీసుకోవాలని అనుకున్నాయి. కానీ, ఈ రెండు ప్రపంచ యుద్ధాలు ఇంగ్లాండ్‌పైన కూడా తీవ్ర ప్రభావం చూపాయి. డబ్బు దాచుకున్న దేశాలకు యంత్ర సామాగ్రిని ఇవ్వలేక పోయింది. దివాలా పరిస్థితులు నెలకొన్నాయి. అలాంటి పరిస్థితుల్లోనే బ్రిటిష్ ప్రభుత్వం భారత్‌కు స్వాతంత్ర్యాన్ని ప్రకటించిందన్న వాదనలు లేకపోలేదు. ఏదిఏమైనా, బ్రిటన్ పౌండ్ స్థానాన్ని అమెరికా డాలర్ ఆక్రమించింది. దీనితో ప్రపంచ వాణిజ్య రంగంలో అమెరికా పెత్తనం పెరిగింది.




ఆయుధాల అమ్మకాన్ని ప్రధాన రాబడిగా ఎంచుకుంది. వాటి అమ్మకం కోసం దేశాల మధ్య చిచ్చుపెడుతున్నది. యుద్ధాలను ప్రోత్సహిస్తున్నది. ఇందుకు అవసరమైన భారీ మొత్తాలను ఫెడరల్ రిజర్వ్ నుంచి తీసుకుంటున్నది. తమతమ కేంద్ర బ్యాంకుల నుంచి ప్రభుత్వాలు రుణాలు తీసుకోవడం కొత్తేమీ కాదు.

అయితే, ఆయా మొత్తాలను సంక్షేమ పథకాలకు, అభివృద్ధికి ఉపయోగిస్తారు. కానీ, అమెరికా మాత్రం విధ్వంసానికి వాడుతున్నది. యుద్ధాలను ప్రోత్సహిస్తూ, తన పెద్దరికాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. ప్రపంచ శాంతి అంటూ చిలుక పలుకులు వల్లెవేస్తున్నది.

# ముంచుకొస్తున్న సాగునీటి కష్టాలు



దేశవ్యాప్తంగా ఇప్పటికే సాగు నీటికి కటకట మొదలైంది. అనేక రిజర్వాయర్లలో నీటిమట్టం సగటున 35 శాతానికి పడిపోయింది. దక్షిణ భారత దేశంలో ఇది కేవలం 20 శాతంగా ఉంది. రాబోయే కొన్ని వారాలు, నెలల్లో వ్యవసాయానికే కాదు.. తాగునీటికి కూడా తిప్పలు తప్పవని సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ప్రధాన జలాశయాలు, నదీ పరీవాహక ప్రాంతాలలో నీటి నిల్వ క్షీణిస్తూనే ఉంది. వేసవి ఇంకా గరిష్ఠ స్థాయికి చేరుకోనప్పటికీ, నీటి లభ్యత ప్రమాదకరమైన కనిష్ఠ స్థాయికి పడిపోయింది. కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నీటి కొరతతో సతమతమవుతున్నాయి. సిడబ్ల్యుసి పర్యవేక్షిస్తున్న భారతదేశంలోని 150 ప్రధాన రిజర్వాయర్లలో ప్రత్యక్ష నిల్వ 61.801 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బిసిఎం). ఈ రిజర్వాయర్ల మొత్తం ప్రత్యక్ష నిల్వ సామర్థ్యంలో ఇది కేవలం 35 శాతం మాత్రమే. సగటు నిల్వలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. గత పదేళ్లలో ఎన్నడూ లేనంతగా పరిస్థితి విషమిస్తున్నది. మహానది, పెన్నార్ బేసిన్ల మధ్య తూర్పున ప్రవహించే 13 నదుల్లో నీరు నిలిచిపోయింది. అదనంగా, పెన్నార్, కావేరి వంటి ప్రధాన నదీ పరీవాహక ప్రాంతాలలో, నీటి మట్టాలు 'అత్యంత లోటు'గా నిపుణులు పేర్కొంటున్నారు. కాగా, దక్షిణ భారతంలో, సిడబ్ల్యుసి పర్యవేక్షణలోని 42 రిజర్వాయర్ల పూర్తి సామర్థ్యంలో కేనవలం 20 శాతం మాత్రమే నింపారు. ఈ రిజర్వాయర్లు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళలో ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో నిల్వ 34 శాతం కాగా, ఇప్పుడు గత పదేళ్ల కనిష్టానికి పడిపోయాయి. ఉత్తర, తూర్పు, పశ్చిమ, మధ్య ప్రాంతాలలో నీటి మట్టాలు వరుసగా 32 శాతం, 45.24 శాతం, 40 శాతం, 43 శాతంగా ఉన్నాయి. నాగార్జున సాగర్ (తెలంగాణ), శ్రీశైలం (ఆంధ్రప్రదేశ్), తుంగభద్ర, ఘటప్రభ (కర్ణాటకలో) వంటి ప్రధాన డ్యామ్‌లలోనూ నీటి మట్టాలు తగ్గుముఖం పట్టాయి. ఈ ఆనకట్టలు రైతులకు సాగునీటిని అందించడమేగాక, తాగునీటి వసతిని కల్పిస్తాయి. విద్యుత్తును కూడా ఉత్పత్తి చేస్తాయి. కృష్ణా నదికి అవతల ఉన్న నాగార్జున సాగర్‌లో ప్రస్తుత లైవ్ స్టోరేజీ కేవలం 0.111 బిసిఎం మాత్రమే. అంటే రిజర్వాయర్ ప్రత్యక్ష సామర్థ్యంలో కేవలం 2 శాతం మాత్రమే. సిడబ్ల్యుసి పర్యవేక్షణలోని మరో 21 ప్రాజెక్టుల్లో, కనీసం 13 డ్యామ్‌లలో నీటి మట్టాలు సాధారణం కంటే తక్కువ స్థాయికి పడిపోయాయి. ఇవి పంజాబ్, రాజస్థాన్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, నాగాలాండ్, బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని రిజర్వాయర్లు. ఇక, నదీ పరీవాహక ప్రాంత నిల్వ స్థానం కూడా తగ్గుముఖం పట్టింది. కనీసం 13 నదులు , రుషికుల్య, బహుద, వంశధార, నాగావళి, శారద, వరాహ, తాండవ, ఏలూరు, గుండ్లకమ్మ, తమ్మిలేరు, మూసి, పాలేరు, మున్నేరు నదులకు మార్చి 21 నుండి నీరు లేదు. ఈ నదులు 86,643 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రవహిస్తాయి. మొత్తం విస్తీర్ణంలో దాదాపు 60 శాతం వ్యవసాయ భూమి ఉంది. అంతేగాక, సింధు మినహా గంగా, గోదావరి, మహానది, తాపి, నర్మద, మహి, కృష్ణా, బ్రహ్మపుత్ర వంటి అన్ని నదీ పరీవాహక ప్రాంతాలలో నీటి మట్టాలు తగ్గుముఖం పట్టాయి. ఈ వేసవి జూన్ మాసం వరకూ కొనసాగుతుంది. ఇప్పటికే దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. ఇవి మరింత పెరగడం ఖాయం. ఇలాంటి పరిస్థితుల్లో సాగు నీటి సమస్య మరింత జటిలమవుతుంది. వర్షాకాలంలో నీటిని నిలువ చేసుకునే విధానాలను మెరుగుపరచకపోవడమే ఈ దుస్థితికి కారణం. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించకుంటే, భవిష్యత్తు మరింత ప్రమాదంలో పడుతుంది.

# పేదరికం ఎక్కడ తగ్గింది ?



లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా పాల్గొంటున్న ప్రధాని నరేంద్ర మోదీ తన పదేళ్ల పాలనకు తానే కితాబునిచ్చుకుంటున్నారు. దేశంలో పేదరికం తగ్గిందంటూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గృహ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సిఇఎస్) సంక్షిప్త నివేదికను ప్రామాణికంగా పేర్కొంటున్నారు. దీనికి 2023–24 సమాచారాన్ని కూడా జోడించి, విశ్లేషించిన తర్వాతే సంపూర్ణ నివేదిక విడుదలవుతుంది. అయితే, ఎన్నికల నేపథ్యంలో, అరకొర సమాచారాన్ని భూతద్దంలో చూపెడుతూ, పేదరికం తగ్గిందని కేంద్రం విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నది. 2030 నాటికి ఆకలి కేకలులేని ప్రపంచాన్ని ఆవిష్కరిచాలన్న ఐక్యరాజ్య సమితి లక్ష్యాన్ని చేరుకుంటున్నామనే అభిప్రాయాన్ని కల్పిస్తున్నది. పేదరికాన్ని కొలిచేందుకు అనుసరిస్తున్న హేతుబద్ధత ఏమిటనేది ప్రధాన ప్రశ్న. సంపూర్ణ గణాంకాలు రాకముందే, ఒక విషయాన్ని ఎలా నిర్ధారిస్తారన్నది మరో ప్రశ్న. ఈ రెంటికీ మోదీ సర్కార వద్ద సమాధానాలు లేవు. ధరలు తగ్గలేదు... ద్రవ్యోల్బణ రేటు తగ్గలేదు.. ప్రజల తలసరి ఆదాయంగానీ, కొనుగోలు శక్తిగానీ పెరగలేదు. జీవిత ప్రమాణాలు గత పదేళ్ల కాలంలో మరింత దిగజారాయేతప్ప మెరుగుపడలేదు. క్షేత్రస్థాయి పరిశీలనలు లేకుండానే, పేదరికంపై స్వయంగా ప్రధానే ప్రజలను తప్పుతోవ పట్టించడం దారుణం. ఇప్పటికే ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఐదో స్థానం సంపాదించామని, మరో నాలుగైదేళ్లలో మూడో స్థానానికి చేరుకుంటామని త్రిశంకు స్వర్గాన్ని చూపిస్తున్న కేంద్రం, ఒకవైపు 81.35 కోట్ల మంది ప్రజలు ఉచిత రేషన్ వల్ల లబ్ధి పొందుతున్నారని ప్రకటిస్తున్నది. మరోవైపు 24.82 కోట్ల మంది పేదలికాన్ని అధిగమించారని అంటున్నది. ఏది నిజం? ఎంత నిజం? దేశంలో ఉద్యోగావకాశాలు మెరుగుపడలేదు. గతంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగ సమస్య వేధిస్తున్నది. ఉపాధిలేని వారి సంఖ్య రోజురోజకూ పెరుగుతుంటే, పేదరికంగా గణనీయంగా ఎలా తగ్గున్నదో ప్రధానికే తెలియాలి. దేశ సంపద కేవలం పది శాతం మందికే వెళుతున్నదని ఆక్స్‌ఫామ్ ఇచ్చిన నివేదిక తప్పు అయినప్పుడు, హెచ్‌సిఇఎస్ సంక్షిప్త నివేదిక ఒప్పు ఎలా అవుతుంది? దేశంలో మౌలిక వసతులు లేని గ్రామాలు ఎన్నో. వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న బిజెపి ఎన్నికల హామీ ఎప్పుడో అటకెక్కడంతో, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు కోకొల్లలు. కార్పొరేట్ వర్గాలు తప్ప, దేశంలో సామాన్యులు ఎవరూ బాగుపడలేదు. పేదరిక గణనలో లెక్కలేనన్ని లొసుగులు ఉన్నాయని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ పురస్కార గహీత అమర్త్యసేన్ గతంలో చేసిన విమర్శలు ప్రధాని చెవికి చేరలేదు. క్రమం తప్పకుండా, ఏదో ఒక అధ్యయనం.. నివేదికల పేరుతో ప్రజలను ఏమార్చడం అలవాటైన ప్రధాని, పేదరికం తగ్గిందని ప్రకటించడంలో వింత ఏముంది? 125 దేశాల ఆకలి సూచీలో మనదేశం 111వ స్థానంలో ఉందని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నప్పటికీ, అంతా బూటమని కొట్టిపారేసిన మోదీ ఎన్ని కథలైనా అల్లుతారు. వినేవారు ఉండాలే గానీ, ఎన్ని కాకి లెక్కలనైనా చెప్తారు. ప్రజలే వాస్తవాలు గ్రహించాలి. ఎన్నికల్లో మరోసారి గెలిచేందుకు బిజెపి ఆడుతున్న నాటకాన్ని గుర్తించాలి. వాస్తవాలు తెలుసుకోవాలి. సర్వేలు, నివేదికల పేరుతో కేంద్రం చేస్తున్న ప్రచారాన్ని నిశితంగా గమనించాలి. ఒక నిజానికి తొంభైతొమ్మిది అబద్ధాలను జత చేర్చి, వడ్డివారిస్తున్న మాటల విందు అవసరం లేదంటూ తిప్పికొట్టాలి.

# ఎడారి దేశాలకు అకాల వర్షాలు!



ఇటీవల దుబాయ్‌లో కురిసిన భారీ వర్షం ఎన్నో రకాల చర్చలకు శ్రీకారం చుట్టింది. వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ అంశాలను ప్రధానంగా తెరపైకి తెచ్చింది. భూగోళం వేడెక్కుతుండటంతో, ఈ దశాబ్దం చివరి నాటికి ఎడారి దేశాలన్నింటిలోనూ వార్షిక వర్ష పాతం దాదాపు 30 శాతం పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిటరేట్స్ (యుఎఇ) అంతటా ఇదే పరిస్థితి కొనసాగుతుందని హెచ్చరిస్తున్నారు. మానవులు చమురు, గ్యాస్, బొగ్గును కాల్చడం కొనసాగిస్తే వాతావరణం వేడెక్కుతూనే ఉంటుంది. వర్షాలు మరింత తీవ్రరూపం దాలుస్తాయి. వరదలతో ప్రాణనష్టం జరుగుతూనే ఉంటుంది. ఇలావుంటే, దుబాయ్‌లో వర్షాలకు క్లౌడ్ సీడింగ్ కూడా ఒక కారణమన్న వాదన పుట్టుకొచ్చింది. ఇంతకీ క్లౌడ్ సీడింగ్ అంటే ఏంటి? దాని పాత్ర ఏంటి? అనే ప్రశ్నలు రావడం సహజం. క్లౌడ్ (మేఘం), సీడింగ్ (విత్తనాలను నాటడం) అనే రెండు పదాల కలయికతో క్లౌడ్ సీడింగ్ అనే పదం ఏర్పడింది. ఇది వింతగా అనిపించవచ్చు కానీ, సాధారణ భాషలో చెప్పాలంటే మేఘాలలో వర్షపు విత్తనాలను (ఉత్ప్రేరకాలు) నాటే ప్రక్రియ. విత్తనాలుగా అంటే ఉత్ప్రేరకాలుగా సిల్వర్ అయోడైడ్, పొటాషియం క్లోరైడ్, సోడియం క్లోరైడ్ వంటి పదార్థాలను వాడతారు. విమానాల సహాయంతో ఈ పదార్థాలను మేఘాలలో వెదజల్లుతారు. ఈ పదార్థాలు మేఘంలో ఉండే నీటి బిందువులను ఘనీభవించేలా చేస్తాయి. తర్వాత ఈ మంచు ముక్కలు ఇతర ముక్కలకు అతుక్కుపోయి మంచురేకులు(స్నోఫ్లేక్)గా ఏర్పడతాయి. ఈ మంచు రేకులు తర్వాత వర్షంలా నేలను చేరతాయి. అంటే వర్షం కురుస్తుంది. కృత్రిమ వర్షాల కోసం దశాబ్దాలుగా ఈ పద్ధతిని వాడుతున్నారు. నీటి కొరతను అధిగమించడానికి ఇటీవలి ఏళ్లలో యుఎఇ కూడా ఈ టెక్నాలజీని ఉపయోగించింది. అయితే, దుబాయ్ వర్షాలకు క్లౌడ్ సీడింగ్ కారణం కాదని కొంత మంది వాదిస్తున్నారు. పర్యావరణ మార్పుల ఫలితంగానే వర్షాలు ముంచెత్తాయన్నది వారి వాదన.

# పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### ఎన్నికల పరిశీలకులు అమిత్ కటారియా



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు, ఐఎఎస్ అధికారి అమిత్ కటారియా ఆదేశించారు. ఈ మేరకు అధికారులంతా సమన్వయంతో పారదర్శకంగా పనిచేయాలని పేర్కొన్నారు. గురువారం ఉదయం కరీంనగర్‌లోని ఆర్ అండ్‌బి గెస్ట్ హౌస్‌లో పార్లమెంటు పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, సిపి, ఎస్పీలు, పలువురు అధికారులతో ఎన్నికల పరిశీలకులు సమావేశమయ్యారు. ఈ మేరకు కరీంనగర్ రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వివరాలను ఎన్నికల పరిశీలకులకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అమిత్ కటారియా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు. పార్లమెంటు నియోజకవర్గం పోలీస్ శాఖ పరిశీలకులు మనీష్ చౌదరి మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికలు పూర్తయ్యేలా పోలీస్ అధికారులు బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. ఎక్కడ ఏ కంప్లైంట్ వచ్చినా వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని, నగదు తరలింపుతో పాటు ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలు పాటించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వే లైన్స్ బృందాలు ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా పెట్టాలని పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌజ్‌లో ఉదయం 11.30 నుంచి 12.30 మధ్యలో ఏదైనా ఫిర్యాదులపై ప్రజలు నేరుగా కలుసుకోవచ్చని సూచించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు అశ్విని కుమార్ పాండే మాట్లాడుతూ అభ్యర్థుల వ్యయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్**
పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా జిల్లా యంత్రాంగం తరపున పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టామని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వెల్లడించారు. ఈ మేరకు ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సంధర్బంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 85 సంవత్సరాలు దాటిన ఓటర్లకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పార్లమెంటు పరిధిలో 2194 పోలింగ్ స్టేషన్లుండగా అన్ని వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం పోలింగ్ సిబ్బందిని అధికారులతో కలుపుకుని 13635 మందిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. సి విజిల్ యాప్ ద్వారా 106 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 73 ఫిర్యాదులను పరిష్కరించామని పేర్కొన్నారు. సువిధ కింద అనుమతుల కోసం 142 ధరఖాస్తులు వచ్చాయని ,ఇందులో 102 అనుమతులు ఇచ్చామని, 15 ప్రాసెస్‌లో ఉన్నాయని వివరించారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఇప్పటి వరకు 36 మంది అభ్యర్థులు 62 నామినేషన్ వేశారని తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటివరకు ఏడు కోట్ల 95 లక్షల నగదును పట్టుకున్నామని వివరించారు. అక్రమంగా తరలిస్తున్న 23 లక్షల 71 వేల విలువ గల మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. రెండు కిలోల 342 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని తెలిపారు. 46 వేల మంది కొత్త ఓటర్లు నమోదయ్యారని, పోలింగ్ పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు 8552 ఈవీఎంలను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇబ్బంది ఎదురైతే వెంటనే ఏర్పాటు చేసేందుకు అదనంగా ఈవీఎంలను సిద్ధంగా ఉంచుతున్నామని తెలిపారు.

**పటిష్ట బందోబస్తు ఏర్పాటు : సిపి అభిషేక్ మొహంతి**
పార్లమెంటు ఎన్నికలకు పోలీస్‌శాఖ తరపున పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ సిపి అభిషేక్ మొహంతి పేర్కొన్నారు. ఎన్నికల పరిశీలకులకు పోలీస్‌శాఖ తరపున తీసుకుంటున్న చర్యలను సిపి వివరించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తమ శాఖ తరపున ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నిక్తా పట్నాయక్, సిరిసిల్ల కలెక్టర్ అనురాగర్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, కరీంనగర్ అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డిఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో కె.మహేశ్వర్, సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ కీమా నాయక్, హనుమకొండ సెంట్రల్ జోన్ డిసిపి అబ్దుల్ బారీ, కాజీపేట, హుస్నాబాద్ ఏసిపిలు తిరుమల్, సతీష్, ఆర్డీవోలు పలువురు అధికారులున్నారు.



## ఇంటర్ ఫలితాల్లో 'కెఎల్‌ఎన్' ప్రభంజనం

ప్రజాపక్షం/మిర్యాలగూడ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. గత 18 సంవత్సరాలుగా విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులు పొందుతున్నారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చినట్లు కళాశాల కరస్పాండెంట్ బి.కిరణ్‌కుమార్, డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, పీఎల్‌ఎన్.రెడ్డి, హన్మంతరెడ్డి, చైతన్యలు తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పరీక్ష ఏదైనా విజయమే తమ విద్యార్థుల సొంతమని నిరూపించి రాష్ట్ర స్థాయిలో నెం.1 ర్యాంకులు తీసుకురావడం జరిగిందన్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో నౌషిన్ 467, హాసిత 466, అఫన్ 466, బైపీసీలో అంజుమ్ 435, సమీ కసిఫానూరిన్ 431, సెకండ్ ఇయర్‌లో చరిత 985, పవన్ 982, శ్రవణ్ 981, గీతాంజలి 980, సెకండ్ ఇయర్ బైపీసీలో సంజన 986, సమీర్ 983 మార్కులు సాధించినట్లు తెలిపారు.

### జెఇఇ మెయిన్స్‌లో సత్తా ...



ప్రజాపక్షం/మిర్యాలగూడ: జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో కెఎల్ఎన్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కళాశాల కరస్పాండెంట్ బి.కిరణ్‌కుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. పమ్మి చంద్రమౌళేశ్వర్‌రెడ్డి ఆల్ ఇండియా 271వ ర్యాంకు, డి.వర్షిత్‌సాయి 2811, ఆర్.శ్రీరామ్ 3395వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. 20 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, పీఎల్‌ఎన్.రెడ్డి, హనుమంతరెడ్డి, చైతన్యలు ఉన్నారు.




## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాపక్షం/మిర్యాలగూడ: ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే వ్యాధులు రావని హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ జి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌వీ గార్డెన్‌లో న్యూమోనియా వ్యాధిగ్రస్తులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బ్రోకో న్యూమోనియా వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ వంటి వాటి వల్ల ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకి న్యూమోనియా వ్యాధి ప్రబలుతుందని తెలిపారు. ఈ వ్యాధి ధూమపానం వల్ల, కాలుష్యం వల్ల, చల్లని పదార్థాలు తీసుకోవడం వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాదిని సకాలంలో గుర్తిస్తే అతి తక్కువ ఖర్చుతోనే వ్యాధిని అరికట్టవచ్చున్నారు.




## జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. జె.హానికర్ అత్యుత్తమ ర్యాంకు (48), డి.గణేష్ రావు (485), ఎం.చిత్రాంజలి (532), ఎ.రఘుపతి (789), ఎల్.జస్వంత్ (910), సిహెచ్. శివ (1397), ఎస్.సుమంత్(1473), బి.వర్షిత రాణి 1626), ఆర్.నిఖిల్ (2279), ఎం.ధనుంజయ్ (2464), సిహెచ్. ఆశిష్ నాయక్ (3113), ఎ.గంగాధర్ (3289), పి.శ్రీజ (4563), జె.కీర్తి (4633), డి.దేవేందర్ (4836), ఎల్.చంద్రపతి (4883), ఎం.హిమబిందు (5210), బి.అక్షిత్ గౌడ్ (5310), బి.సందీప్ (5685), బి.వంశీకృష్ణ నాయక్ (5964), వి.శ్రీతేజ (6262) ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ ప్రశాంత్ రెడ్డిలు పాల్గొని ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. చక్కని ప్రణాళికతో పరీక్షలలో విద్యార్థులు చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు సరిచేస్తూ అభ్యసనం పెంచడం, సమయపాలన ద్వారా ర్యాంకులు సాధ్యమైందని తెలిపారు. రానున్న కాలంలో మరింత ఉత్తమ ర్యాంకులు సాధించుటకు, వ్యవస్థ అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు.



## అక్రమంగా దాచిన పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాపక్షం/దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని జంగాల కాలనీ గుట్టల్లో డంప్ చేసిన అక్రమ పిడిఎస్ బియ్యాన్ని సమాచారం మేరకు గురువారం 12 గంటలకు స్పాట్‌కు వెళ్ళి స్వాదీనం చేసుకోవడం జరిగిందని దేవరకొండ డిటిసిఎస్ హన్మంత్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జంగాల కాలనీకి చెందిన 32 క్వింటాళ్ళ బియ్యాన్ని దేవరకొండ ఎంఎల్‌ఎస్ పాయింట్ కు తరలించి భద్రపరచడం జరిగిందని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడిన అక్రమంగా పిడిఎఫ్ బియ్యాన్ని తరలించిన చర్యలుంటాయని రేషన్ బియ్యాన్ని తినేవారు మాత్రమే తీసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

## సమష్టి నిర్ణయాలతో ఆలయాల అభివృద్ధి

ప్రజాపక్షం/అలంపూర్ : సమష్టి నిర్ణయాలతో అలంపూర్ ఆలయాల అభివృద్ధి సాధ్యం అవుతుందని ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు అన్నారు. గురువారం అలంపూర్ దేవస్థానం కార్యాలయంలో ఆలయ ఇఒ పురంధర్ కుమార్‌తో చైర్మన్, పాలక మండలి సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, వెంకట నారాయణ సమావేశం అయ్యారు. ఆలయంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై వారు చర్చించారు.

## ఐఐటి జెఇఇ ఫలితాల్లో
# అల్ఫోర్స్‌కు ర్యాంకుల పంట







ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఐఐటి జేఈఈ (మెయిన్) 2024 ఫలితాలలో అల్ఫోర్స్ ఐఐటి అకాడమీల విద్యార్థుల వివిధ క్యాటగిరీలలో జాతీయ స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. యం. హర్షిత్ 252 ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలువగా , ఎ.వర్షన్ రావు 444 ర్యాంకు, పి.మనోహర్ 466 వ ర్యాంకు, జి.శ్రీహాస్ (503) ర్యాంకు, బి.భరద్వాజ్ నాయక్ (781), పి.చందన (1213) సత్య అమూల్య (1301), సుభోదా చౌదరి (1367), కె.శ్రీనిధి (1562), ఎండి. షఫిక్ (1603), మిత్ర 1612), సి.హెచ్ అనూహ్య 1632), ఎ.శివ వరుణ్ (1719), యన్.ప్రణయ్ (1721), పి.రాహుల్ (1751), యం. ప్రణీత్ రెడ్డి (1912), జె.ఉమా మైత్ర (1953), ఎల్.అరుణ్ కుమార్ (2353), సి.హెచ్ సిద్ధార్థ (2444), పి.రాఘవీరారెడ్డి (2510), కె.విశాల్ రెడ్డి (2557), కె.రోహన్ ప్రీత్ (2643), జె.హర్షవర్ధన్ (2908), జి.లహరి (2965) ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని మరింత ఇనుమడింప జేశారని యాజమాన్యం తెలిపింది. వెయ్యి లోపు 5 ర్యాంకులు, 5 వేల లోపు 34 ర్యాంకులు, 461 మంది విద్యార్థులు ఐఐటి అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడం విశేషం. రాబోయే ఐఐటి అడ్వాన్స్ పరీక్ష వ్రాయుటకు ఎంపికైే విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంచే కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 202324 విద్యా సంవత్సరంలో 30 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐఐటిలలో సీట్లు సాధించగా 66 మంది విద్యార్థులు వివిధ ఎన్ఐటిలలో సీట్లు సాధించారు. పటిష్ట ప్రణాళికతో విద్యా బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదల, అహర్నిషంగా కృషి వల్ల అల్ఫోర్స్ ఇంతటి ఘన విజయం సాధించగలిగిందని తెలిపారు. ఐఐటి జేఈఈ (మెయిన్) 2024 ఫలితాలలో జాతీయ స్థాయి అత్యున్నత ర్యాంకులు సాధించిన అల్ఫోర్స్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అభినందించారు. అందుకు తోడ్పడిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.




## సిఎం రేవంత్‌రెడ్డికి వెలిచాల కృతజ్ఞతలు

ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో రాజేందర్ రావు గురువారం ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. తన ఎంపికకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంధర్భంగా రాజేందర్‌రావుకు కాంగ్రెస్ పార్టీ బీ ఫారం అందజేశారు. రాజేందర్‌ఆవు వెంట రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ బాబు తదితరులున్నారు.

## ఓటుతోనే చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం



ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : ఓటర్లకు అవగాహనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ (సిబిసి) ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ప్రారంభించి ప్రలోభ రహితంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి ప్రతి ఓటరు నిజాయితీతో ఓటు వేయడం ద్వారా చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి ఊతం ఇవ్వాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంపు దిశగా ఓటర్లకు అవగాహన కల్పించే నిమిత్తం కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన మూడు రోజుల ఛాయా చిత్ర ప్రదర్శనను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసామ్య మహోత్సవం వంటి ప్రస్తుత ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడంలో ఓటర్లు తమవంతు పాత్ర పోషించాలని కోరారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మన ప్రజాస్వామ్యం ఉందని, ప్రజాస్వామ్యం పరిడవిల్లెందుకు అందరికీ ఉపయుక్తమయ్యే ప్రజాస్వామ్యానికై ఓటు వేయవలసిన బాధ్యత ఉందని అన్నారు. , అంతేకాక రాబోయే తరాలకు మంచి జరుగుతుందని, అందువల్ల అందరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండలరావు ఓటరు చైతన్యం పై స్వయంగా రచించి రూపొందించిన పాటను పాడి వినిపించారు . ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, సీబీసీ జిల్లా క్షేత్ర ప్రచార అధికారి కోటేశ్వర్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండలరావు, ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అరుణ్ కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్ శ్యామ్, బోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఐఐటి మెయిన్స్‌లో మెరిసిన జయ విద్యార్థులు

ప్రజాపక్షం/సూర్యాపేట: జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ మెయిన్స్ 2024 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమైన ప్రతిభన కనబర్చినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు తెలిపారు. జాతీయ స్థాయిలో 10వేలలోపు 16 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. కందిపబండ వెంకటేష్ 528, గుజ్జా చందన 954, బి హర్షిత 1183, ఎం హర్షిని 4031, కె సిద్ధార్థన్ 4098, జి గోపి 4803, కె సాయి శివరంజన్ 5921, జి అక్షయ్ 6433, జె గౌతమ్ కుమార్ 7651, పి కౌశిక్ 7846, కె అభిజిత్ 8399, ఎస్ నివేదిత 8985, విష్ణుతేజ 9099, ఎస్ దీక్షిత 9338, డి సోమేష్ 9755 ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. మొత్తం 129మంది విద్యార్థుల్లో 48 మంది అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారన్నారు. కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రుల సహకరాతంతోనే విద్యార్థులు అత్యుత్తమైన ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.




## సామాన్య విద్యార్థులతో
## అసమాన్య ఫలితాలు సాధిస్తున్న శ్లోక

ప్రజాపక్షం/ సూర్యాపేట టౌన్: సామాన్య విద్యార్థులతో అసమాన్య ఫలితాలు సాధించడం శ్లోక ఐఐటీ, మెడికల్ అకాడమితోనే సాధ్యమని కరస్పాండెంట్ మారం వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం విడుదలైన జెఈఈ మెయిన్స్‌లో శ్లోకా విద్యార్థులు ఉత్తమైన ర్యాంకులు సాధించడంతో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి శంకర్ 99.38, డి శివాని 99.03, ఎం వరుణ్ 95.7, యక్షేంద్ర 94.40, సిహెచ్ వేణుగోపాల్ 90.06 పర్సెంటేజ్ సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు మరో పది మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా విద్యాబోధన చేయడంతోనే ఇలాంటి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించేందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

## కోదాడలో ట్రామా సెంటర్

### ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హామీ



ప్రజాపక్షం/కోదాడ : జాతీయ రహదారిపై కోదాడ బైపాస్ సమీపంలో దుర్గాపురం స్టేజీ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల కుటుంబాల ఎమ్మెల్యే పద్మాతిరెడ్డి సంతాపం, సానుభూతి తెలియజేశారు.రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని సంబంధిత వైద్యాధికారులను కోరారు. రెండురోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కుటుంబం భార్య భర్తలు చనిపోవడం జరిగిందని ఆ ఘటన మరువక ముందే ఈ ఘటన జరిగిన ఆరుగురు మృతిచెందడం చాలా బాధాకరమన్నారు. జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా కోదాడలో ట్రామా సెంటర్ ఏర్పాటు అత్యవసరమని దీని ఏర్పాటు కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఈ విషయాన్ని గతంలో కోదాడలో వందపడకల హాస్పటల్ శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ దృష్టికి తీసుకవెళ్లడం జరిగిందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ట్రామా సెంటర్ మంజూరు కృషి చేస్తామన్నారు.

**కోదాడ వైద్యశాలను సందర్శించిన జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే**
పట్టణ శివారులో రోడ్డు ప్రమాదం ఘటనపై జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హుటాహుటిన కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని గాయపడ్డ వారిని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట డిఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

## సంపత్ కుమార్‌కు పదవి ఇవ్వాలి

### కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో విజ్ఞప్తి

ప్రజాపక్షం/అలంపూర్ : ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్‌కు ప్రభుత్వంలో చోటు కల్పించాలని కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపి అభ్యర్థి మల్లు రవి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అలంపూర్‌కు వచ్చిన మంత్రి జూపల్లి, మల్లు రవి, సంపత్ కుమార్‌లు అలంపూర్‌లోని గాంధీ చౌక్‌లో ప్రచారం నిర్వహించారు. అనంతరం హరితా టూరిజంలో మండల నాయకులు, కార్యకర్తలతో ఆయా మండలాల వారీగా వారు సమావేశం అయ్యారు. ఈ సంధర్భంగా కొందరు నాయకులు, కార్యకర్తలు మంత్రి జూపల్లి ముందు సంపత్ కుమార్‌కు ప్రభుత్వంలో చోటు కల్పించాలని కోరారు. సంపత్ కుమార్ జోక్యం చేసుకొని వారికి సర్ది చెప్పారు.




## ప్రభుత్వ పాఠశాలలను
# బలోపేతం చేయాలి

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాపక్షం/చౌటుప్పల్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విశాల భారతి పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులు కందుల మల్లారెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గిపోయి ప్రభుత్వ పాఠశాలల మనగడం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ళ విఠలాచార్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా మహోన్నతమైనదని అన్నారు. ఉపాధ్యాయులుగా మల్లారెడ్డి ఎంతోమంది విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, యాదాద్రి జిల్లా అధ్యక్షులు మిర్యాల దామోదర్, ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర్ల యాదయ్య, జిల్లా కార్యదర్శులు ముత్యాలు, రవికుమార్, మండల అధ్యక్షులు కె. సైదారెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్, మాజీ రాష్ట్ర నాయకులు దోనూరి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## నర్సింహులు మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాపక్షం/మానవపాడు : అలంపూర్ నియోజకర్గంలోని మానవపాడు మండల పరిధిలోని కొర్విపాడు గ్రామానికి చెందిన యువ నాయకులు భీమేష్ తండ్రి నర్సింహులు అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే విజయుడు ఇంటికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. అనంతరం వారి కుటంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట ఆనంద్, గోపాల్, రవి తదితరులు ఉన్నారు.

## రేపు తిరుమలగిరిలో కాంగ్రెస్ ర్యాలీ

### విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే సామేల్



ప్రజాపక్షం/ తిరుమలగిరి: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా ఈనెల 27న తిరుమలగిరి పట్టణంలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ ర్యాలీని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం పట్టణంలోని ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపి అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డికి భారీ మెజార్టీని అందించేలా ప్రతి కార్యకర్త, నాయకులు పని చేయాలన్నారు. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాల్లో ఆయా శాఖల అధ్యక్షులు నాయకులు, ప్రజాప్రతినిధులను సమన్వయం పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు వై నరేష్, జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ శాగంటి అనసూర్య రాములు, నాయకులు పాలకురి రాజయ్య, ధరావత్ జమ్మిలాల్ నాయక్, సుంకరి జనార్ధన్, కందుకూరి అంబేద్కర్, పేరాల వీరేష్, లక్ష్మయ్య, దాచేపల్లి వెంకన్న, నవిన్ పాల్గొన్నారు.

## శ్రీసాయి కళాశాల ప్రభంజనం

ప్రజాపక్షం/హసన్‌పర్తి : ఇంటర్ ఫలితాల్లో శ్రీసాయి జూనియర్ కళాశాల స్టేట్ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్ తెలిపారు. కళాశాల నుంచి ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో సట్ల రచన 992/1000, దుర్మి అక్షయ 990/1000, సిరిపురం వర్షిత 987/1000, అన్నాపురం అక్షిత 981/1000, పయ్యావుల వంశీ 981/1000, బైపీసీలో సర్కార్ భూమిక 988/1000, కస్తూరి అక్షిత 982/1000, కత్తుల వర్షిత 981/1000, సీఈసీలో షేక్ అహసన్ 970/1000, ప్రథమ సంవత్సరం సీఈసీలో వడికరి ధనశ్రీ 492/500, బైపీసీలో బోనగిరి దీక్షిత 437/440, గోరంట్ల అనన్య 433/440, బానోతు అశ్విత 434/440, ఎంపీసీలో మోతకూరి అక్షయ 458/440, గుగులోతు నితిన్ 457/470, బొలగని తరుణ్ తేజ 455/470 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.కళాశాల ఛైర్మన్ కేదాసి వెంకటేశ్వర కుమార్, కరస్పాండెంట్ ఉప్పుల కుమారస్వామి, డైరెక్టర్లు అనుమాండ్ల విద్యాసాగర్, ఆకుతోట శాంతారాం కర్ణ, మారం నరేందర్ పాల్గొన్నారు.

## విద్వాన్ కళాశాలకు అద్భుత ఫలితాలు

ప్రజాపక్షం/హసన్‌పర్తి : ఇంటర్ ఫలితాల్లో విద్వాన్ జూనియర్ కళాశాల అద్భుతమైన ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలోనే అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు యాజమాన్యం బందు వెంకట్, యాట మైపాల్‌రెడ్డి, ముప్పిడి జగదీష్ తెలిపారు. బైపీసీలో స్టేట్ 2వ ర్యాంకు 437/440 సాధించిన కంచు దివ్యను మంత్రి సీతక్క అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సహకరించిన అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

## నాల్గోస్థానంలో పాపన్నపేట కళాశాల

ప్రజాపక్షం/పాపన్నపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాలలో గత ఏడాది కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లాలో నాలుగో స్థానంలో ఫలితాలలో పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నిలిచింది. మండల పరిధిలో ఒకే ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండడంతో మండల పరిధిలోని విద్యార్థులు అధిక సంఖ్యలో ఈ కళాశాలలోని విద్యను అభ్యసిస్తున్నారు. 2022/2023సంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో 49 ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరంలో 46 ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 2023/2024లో ద్వితీయ సంవత్సరంలో 65 ఉత్తీర్ణత సాధించగా, మొదటి సంవత్సరంలో 63 ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం సీఈసీలో ఎం.గాయత్రి, ఎండి.సాదియా, బైపీసీలో ఎల్.నిఖిత, ఎల్.గీత, ఎంపీసీలో డి.మానస, జి.అశ్విని, కళాశాల టాపర్ లుగానిలువగా, మొదటి సంవత్సరంలో సీఈసీలో జే, సంగీత, బి.వరాలు, బైపీసీలో జై, తేజస్విని ఆర్.కృష్ణవేణి, ఎంపీసీలో కే.బుజ్జమ్మ, ఏం.లక్ష్మి కళాశాల టాపర్ లుగా నిలిచారు. ఫలితాలు సాధించడానికి కృషిచేసిన అధ్యాపకులకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కిష్టాపురం చెక్ పోస్ట్ తనిఖీ



ప్రజాపక్షం/రాయపర్తి : మండలంలోని కిష్టాపురం ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు గురువారం డిసిపి పిసీతారాంనాయక్‌ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చెక్ పోస్ట్ గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల ను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా పనిచేయాలని అన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా డబ్బులు తీసుకెళ్లే వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. వాహనాలను తనిఖీ చేసేటప్పుడు వాహనదారులతో మర్యాదపూర్వకంగా ఉండాలని అన్నారు. ఎస్ఐ వడ్డి సందీప్, తుల సంపత్, కత్తుల శ్రీనివాస్‌పాల్గొన్నారు.

### చెక్‌పోస్ట్ పనితీరుపై డిసిపి తనిఖీ



ప్రజాపక్షం/జఫర్గఢ్ : జఫర్గఢ్ లోని నల్లబండ చెక్ పోస్ట్ ను జనగామ డీసీపీ సీతారాం ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ తనిఖీల్లో భాగంగా ముందుగా పోలీస్ చెక్ పోస్ట్ నందు విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారుల వివరాలతో పాటు ప్రజలకు ఆసౌకర్యం కాకుండా ప్రతి వాహనం ను తనిఖీ చేయాలని సిబ్బంది కి వివరించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు మేరకు తప్పకుండా పనిచేయాలి.

## ఇవిఎంల పనితీరుపై అవగాహన



ప్రజాపక్షం/దుబ్బాక: ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఈవీఎం యంత్రాల పని తీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్, దుబ్బాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమ అగ్రవాల్ అన్నారు. గురువారం దుబ్బాకలో తహసీల్దార్ లకు నిర్వహించిన ఎన్నికల శిక్షణా కార్యక్రమాల్లో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ఎలాంటి సందేహాలు ఉన్నా అడిగి తెలుసుకోవాలన్నారు. శిక్షణ తరగతులను అర్థం చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గంలోని తహశీల్దార్ లు, ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

## మెదక్‌లో 23మంది నామినేషన్లు




ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : మెదక్ పార్లమెంటు ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొదటి ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్లలో చివరి రోజైన గురువారం 23 మంది అభ్యర్థులు 36 నామినేషన్లు దాఖలు చేశారని మొత్తం 54 మంది అభ్యర్థులు 90 నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ గడువు గురువారం మూడు గంటలకు ముగిసింది. చివరి రోజు 23 మంది అభ్యర్థులు 36 నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. మెదక్ ఎంపి స్థానానికి బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాజీ మంత్రి హరీష్ రావుతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు.జిల్లా ఎన్నికల అధికారిరాహుల్‌రాజ్ శుక్రవారం నామినేషన్లను పరిశీలించనున్నారు.

## నారాయణ విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : హన్మకొండ జిల్లా ఖాజీపేటలో జరిగిన జోనల్ స్పోర్ట్స్ మీట్ 2024లో జనగామ నారాయణ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కబడ్డి, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. ఈ క్రీడలకు వై సురేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నారాయణ స్కూల్ విద్యార్థులను అభినందించారు. నారాయణ స్కూల్ విద్యార్థుల ప్రతిభపై డిజిఎం రిజ్వానా, ఆర్ఐ వేణు కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి, రమేష్ రిగ్నం బిశ్వకర్మ, కమలాకర్, హై స్కూల్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, ఈ ఛాన్స్ కోఆర్డినేటర్ హారిక, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ శిరీష, పిఈటి ఘనశ్యాం, మధుకర్, మహేష్, అకాడమిక్ డీన్ విక్రం, ఏఓ చారిలు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.

# దేశ రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

### మేడేను విజయవంతం చేయాలి
### ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్




ప్రజాపక్షం/వరంగల్ : 138వ మేడే దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, 29న కార్మిక చట్టాల పునరుద్ధరణకై బిజెపి ఓడిద్దామని, దేశ రాజ్యాంగాన్ని , ప్రజలను రక్షించుకుందామని ఏఐటియూసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు.గురువారం వరంగల్ శివనగర్‌లోని తుమ్మర భవన్‌లో 138వ మేడే వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1867 సంవత్సరంలో ఇంగ్లాడ్‌లో మొట్టమొదటిగా కార్మిక సంఘం ఏర్పడిందని, 1914నుండి 1918 చివరిలో జనరల్ కౌన్సిల్ ఆఫ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పడిందన్నారు. అమెరికాలో ఇండ్రస్టియల్ వర్కర్స్ ఆఫ్ ది వరల్డ్ పేరుతో యూనియన్ ఏర్పడిందన్నారు. సమ సమాజ స్థాపనకు కార్మిక చట్టాల సాధనకు 1991లో జనరల్ జర్మనీలో ప్రారంభమై 1886 రోహియో కొలంబోస్‌లో 12గంటలకు 8గంటల తగ్గించాలనే ఉద్యమంలో భాగంగా కార్మికులు సమ్మెలు కూడా ఉధృతం సాగాయి.అంతర్జాతీయ కార్మిక సంఘం ఏర్పడి అమెరికా నగరంలో హే మార్కెట్‌లో 1886లో మే 1న సమ్మె చేయాలని నిర్ణయించిన ప్రపంచ కార్మిక సంఘాల ఐక్య సోషలిస్టు మరియు కార్మిక సమ్మె హే మార్కెట్‌లో భారీ నిరసన ప్రదర్శన ఎనిమిదిగంటల పని దినంకై కదం తొక్కారు. దీంతో పెట్టుబడి దారులు, వారి గుండాలు, పోలీసులు జరిపిన తుపాకి కాల్పుల్లో చనిపోగా, చాలా మందికి తీవ్రగాయాలయ్యాయి. నాటి మే 1 పోరాటమే అమెరికన్ ప్రభుత్వం దిగివచ్చి 8గంటల పని దినాన్ని అమలు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునీశ్వరుడు, జిల్లా సహాయ కార్యదర్శి దామెర కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి యాకుబ్, మియాపురం గోవర్ధనచారీ, నాగవెల్లి శంకర్, సంద్ర కుమార్, కలకోట రాజు, అమ్ముడాల సుమలత, శంకర్, సాంబయ్య, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడే 1న వాడవాడలా ఉత్సవాలు

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి




ప్రజాపక్షం/హన్మకొండ : మే 1న జిల్లా వ్యాప్తంగా కార్మిక వాడలలో మేడే ఉత్సవాలు నిర్వహించాలని ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి కోరారు. గురువారం హన్మకొండ పెగడపల్లి డబ్బాల సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన మేడే గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి మాట్లాడారు. 1886 మే 1న అమెరికాలోని చికాగోలో పని గంటలు తగ్గించాలని సమ్మె చేపట్టిన కార్మికులపై జరిపిన కాల్పులలో చనిపోయిన వారి రక్తంతో తడసిన ఎర్ర జెండాను నేటికి మేడే రోజున కర్మిక వర్గం వారి స్ఫూర్తిగా ఎగుర వేస్తూ మేడే ఉత్సవాలను జరుపుకుంటున్నారని అన్నారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కూడా కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను సైతం కాలరస్తూ పెట్టు బడిదారులకు అనుకూలంగా నడుచుకుంటున్నదని అన్నారు. ఏఐటీయూసి జిల్లా నాయ కులు గుంటి రాజేందర్,జనార్ధన్,గాండ్ల రవి,రమేష్, సతీష్‌రెడ్డి, పూజారి అమృతయ్య, దేవేంర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## ‘మెదక్‌జిల్లా గడ్డ.. బిఆర్ఎస్ అడ్డ’

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : రాష్ట్రంలో ఎన్ని ఎన్నికలు వచ్చినా మెదక్ జిల్లా గడ్డ...బిఆర్ఎస్ అడ్డగా ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ నేతలకు అహంకారం నెత్తికి ఎక్కిందని పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడిస్తే భూమి మీదకు వస్తారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ కు మద్దతుగా వచ్చిన ప్రజలతో మెదక్ రాందాస్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్, బీజేపీ పై ఘాటు విమర్శలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బాండ్ పేపర్లతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజులైనా ఒక్క హామీ అమలు చేయడం లేదని అన్నారు. బాండ్ పేపర్ పరువు సీఎం రేవంత్‌రెడ్డి తీశారన్నారని దుయ్యబట్టారు. ఇప్పుడు దేవుళ్లను రాజకీయాలకు సీఎం వాడుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు బిజె పి, కాంగ్రెస్ నేతల ఝుటా, బట్టేబాజ్ మాటలు నమ్మరని, సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. మాజీ ఎంఎల్‌ఏ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి,ఎంఎల్ఏ కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడారు.ఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎం ఎల్ ఎ పద్మా దేవేందర్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్, ఎంఎల్ఏలు కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, ఎమ్మెల్సీలు సుభాష్ రెడ్డి,యాదవ రెడ్డి,నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్,వంటేరు ప్రతాప్ రెడ్డి,దేవేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, ఆంజనేయులు భారీ సంఖ్యలో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇళ్లు అమ్మితే లబ్ధిదారులపై చర్యలు

### వేషాలపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భావేశ్ మిశ్రా



ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి : నిరుపేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులు ఎవరైనా అమ్ముకుంటే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మంచి నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా భూపాలపల్లి పరిధిలోని వెలిశాలపల్లి లో రెండు పడక గదుల ఇండ్లను పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన మంచినీటి సంపు ను పరిశీలించి సంపు యొక్క నిలువ నీటి సామర్థ్యాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ కాలనీలోని నాలుగవ అంతస్తు బిల్డింగ్ ఎక్కి నీటి సరఫరాకు ఏర్పాటు చేసిన ట్యాంక్ లను పరిశీలించారు. తర్వాత కాలనీ ప్రజలతో మంచినీటి సరఫరాపై కలెక్టర్ ముకాముఖీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులు వారికి కేటాయించిన ఇళ్లను అమ్మినస్తీతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సగటున ఒక కుటుంబం అద్దె ఇంట్లో ఉంటే కనీసం 2 వేల నుండి 3 వేలు అద్దె చెల్లించాల్సి వస్తుందని అది సంవత్సరానికి దాదాపు 30 వేలు అవుతుందని, అద్దె కట్టలేని నిరు పేదలను గుర్తించి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించామని కలెక్టర్ అన్నారు. కేటాయించిన ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని సంతోషంగా ఉండాలి కానీ ఇళ్లను అమ్ముకోవడం సరైంది కాదని కలెక్టర్ అన్నారు. ఇందుకనుగుణంగా కాలనీ లో ఏర్పాటు చేసుకున్న సొసైటీ కమిటీ ఎవరైనా లబ్ధిదారులు ఇళ్ళు అమ్మిన లేదా వేరే వారికి కిరాయి ఇచ్చినస్తీతే మునిసిపల్ అధికారులకు తెలియ చేయాలని అన్నారు. అలాగే కాలనీలో ఏదేని సమస్యలు వస్తే కుటుంబానికి మీ పరిధిలో నిర్వహణకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్లంబర్, వాటర్ మెన్ ఇతరత్రా అవసరాల రీత్యా నగదు అవసరం అవుతుందని లబ్ధిదారులు ప్రతి నెలా కాలనీ నిర్వహణకు కొంత నగదు జమ చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజితో పాటు కాలనీ చుట్టూ ప్రహరి గోడ నిర్మించాలని, కాలనీకి సరిపడు విద్యుత్ సరఫరాకు ట్రాన్సుఫార్మర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. ఇందుకనుగుణంగా క్రమేపి విడతల వారిగా సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఈ వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, ఏఈ రోజా తదితరులు పాల్గొన్నారు.

# వంట కార్మికులకు రూ.10వేల వేతనం అమలుచేయండి

### మధ్యాహ్న భోజన వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవిందర్




ప్రజాపక్షం/హన్మకొండప్రతినిధి:వంటకార్మికులకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.10వేల వేతనం ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అమలు చేయాలి తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవిందర్ అన్నారు.హన్మకొండ బాల సముద్రంలోని ఏఐటియూసి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ధర్మల రమ్మూర్తి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ హన్మకొండ జిల్లా మహాసభకు హాజరైన మధ్యాహ్న భోజన వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవిందర్ మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా సొంత డబ్బులు పెట్టి పఠశాలలో వంటలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూ పెట్టిన బిల్లు లు సకాలంలో అందక కార్మికులు అనేక ఇబ్బందులకు గురి అ గుతున్నారని అన్నారు. వంట కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,పెంచిన వేతనాలు కూడా సరిగా అందడం లేదని అన్నారు. అలాగే ఎవరూ వంటలకు రాని రోజు నుండి 22 సంవత్సరాలుగా వంటలు చేస్తున్న వంట కార్మికులను చిన్నచిన్న కారణాలతో తొలగించే విధానాలను విరమించుకోవాలని,అలాగే తొలగించకుండాజీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్, ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, మీ పోరటలకు సీపీఐ పూర్తిగా ఎల్లవేలలా అండగాఉండుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన వర్కర్స్ జిల్లా నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది.ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్,200మందివంటకార్మికులు పాల్గొన్నారు.

### భోజన వర్కర్స్ యూనియన్ నూతన కమిటి

మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నూతన కమిటి గౌరవ అధ్యక్షులు జక్కు రాజు గౌడ్, అధ్యక్షులు జనగాని లక్ష్మి , ఉపాధ్యక్షులు వొల్లాల లక్ష్మి , ఎండి మస్తాన్ బి,ప్రధాన కార్యదర్శిగా ధర్మల రామ్మూర్తి,, సహాయ కర్యదర్శులుగా దామెర కవిత, వైనాల విజయ,ల్యాగ విజయ,రాధమ్మ,కోశాధికారి కల్పన బస్కె రాణి,సధరం శాంత,ఒస్కుల ఇందిరలను ఎన్నుకున్నారు.

## ఎల్‌ఓసి అందజేత

ప్రజాపక్షం/అలంపూర్: అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామానికి చెందిన లోకేష్‌కి రూ.లక్ష 50 వేల ఎల్‌ఓసి కాపిని గురువారం నాడు ఎమ్మెల్యే విజయుడు అందజేశారు.బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పుల్లూరు నాగేశ్వర్ రెడ్డి, కరుణ సింహ కోడిండచ రఘు రెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లామత్స్యశాఖ చైర్మన్‌టిగోపాల్‌పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సందడి

ప్రజాపక్షం/అలంపూర్:ఎన్నికల ప్రచారం నిమి త్తం కాంగ్రెస్‌ఎంపి అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, మంత్రి జూపల్లికృష్ణారావు,ఎఐసిసికార్యదర్శి సపంత్‌కుమార్ అలంపూర్‌కు వచ్చారు. గద్వాల జిల్లా మహిళా అధ్యక్షురాలుదండమూడి నాగ శిరోమణి పార్టీ మహిళా నాయకులతో కలిసి సందడి చేశారు.

# పోలింగ్ శాతం పెంపునకు కృషి చేయాలి

### ఎన్నికల పరిశీలకురాలు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : పోలింగ్ శాతం పెంచడానికి కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్ అన్నారు. గురువారం భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు, కమలాపురం, అజాంనగర్‌లలో పోలిం గ్ కేంద్రాలను తనిఖీ చేసి అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా, ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ మాట్లాడుతూ గత పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లుకు మౌలిక సదుపాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఓటర్లుకు ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల వద్ద నీడ ఉండేవిధంగా టెంట్లు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం మరుగుదొడ్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లుకు అభ్యర్థుల గుర్తులు స్పష్టంగా కనపడే విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వికలాంగులు, వయో వృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, వీల్ ఛైర్స్ అందుబాటులో ఉంచాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు గ్రామస్థాయి నుండి ఓటర్లుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. స్ట్రాంగ్ రూము వద్ద 24/7 సీఆర్పీఎఫ్ భద్రతా దళాల పటిష్ట నిఘా ఉండాలని అన్నారు. సి సి కెమెరాలను, విజటర్స్, సిబ్బంది విధుల రిజిస్టర్ పరిశీలించారు. జిల్లాకు విచ్చేసిన ఆమెకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా, ఎస్పి కిరణ్ ఖరే పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో లోక్ సభ ఎన్నికల నిర్వహణకై చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా అబ్జర్వర్ కు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి సంజీవరావు, ఆర్డిఓ మంగిలాల్, డిఎస్పీ సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ‘కడియం కావ్యను గెలిపించాలి’




ప్రజాపక్షం/ధర్మసాగర్:ఇండియా కూటమి కాగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని హనుమకొండ సిపిఐ జిల్లా కార్యధర్శీ కర్రె బిక్షపతి అన్నారు.హనుమకొండ జిల్లా ఖాజిపేట మండలములోని రాంపూర్ గ్రామములో సిపిఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది ఈసమావేశనికి సిపిఐ జిల్లా కార్యదర్శీ బిక్షపతి విచ్చేసి మాట్లాడుతూ,భారత దేశంలో గత పది సంత్సరంల నుండి బిజెపి ప్రభుత్వం హిందూ దేశంగా మార్చేందుకు లౌకిక వ్యవస్థ ప్రజ్యాస్యా వ్యవస్థ లేకుండా కుట్ర చేస్తున్నారని అన్నారు.దేశవ్యాప్తంగా గిరిజనులు ముస్లింలు దళితులు క్రిస్టియన్స్‌లపై వేలాదిగా దాడులు చేస్తున్నారని అన్నారు.దేశవ్యాప్తంగా ఇండియా కుంటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.ఈకార్యక్రమములో సిపిఐ జిల్లా సహాయ కార్యధర్శీ మద్దెల మల్లేష,మండలకార్యధర్శీ మునిగాల బిక్షపతి,ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగాపాణి,మాలోతు శంకర్‌నాయక్,బొట్టు బిక్షపతి,ఐలయ్య,లక్ష్మి ,పద్మ,తదితరులు పాల్గోన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు మిత్రులు మృతి

### వర్ధన్నపేటలో ఘోరం

ప్రజాపక్షం/వర్ధన్నపేట: వరంగల్ ఖమ్మం ప్రధాన రహదారి రోడ్డు ప్రమాదంతో రక్తసిక్తం అయిపోయింది. అతివేగం నాలుగు కుటుంబాలను ఛిద్రం చేసింది. వివాహ వేడుక, ఇంటర్ ఫలితా ల జోష్ తో కళకళలాడాల్సిన కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. వరంగల్‌జిల్లా వర్ధన్నపేట పట్టణ పరిధిలోని వరంగల్‌ఖమ్మం జాతీయ రహదారి పై రాజరాజేశ్వరస్వామి దేవాలయం సమీపంలో బుధవారం రాత్రి జరిగినరోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఇల్లంద, వర్ధన్నపేట, సింగారం గ్రామాలకు చెందిన నలుగురు యువకులు బుధవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొన్నారు. పెళ్లి సందడిలో ఎంజాయ్ చేస్తున్న సమయంలోనే ఇంటర్మీడియెట్ రిజల్ట్స్ రావడం, అందులో ఒక యువకుడు మంచి మార్కులతో పాస్ కావడంతో ఆ నలుగురు యువకులు సంతోషంతో విందు చేసుకున్నారు. రోజంతా సందడిగా గడిపిన ఆ నలుగురు, వర్ధన్నపేటకు చెందిన యువకుడిని ఇంటి వద్ద దింపడానికి బండిపై వస్తుండగా రాత్రి 11 గంటల ప్రాంతంలో వర్ధన్నపేట బ్రిడ్జ్ సమీపంలో ఓ ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా కొన ప్రాణంతో ఉన్న మరో యువకున్ని ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. వర్ధన్నపేట ఎస్.ఐ. ప్రవీణ్ కుమార్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందచేశారు. మృతులను వర్ధన్నపేటకు చెందిన పొన్నం గణేష్ (20), ఇల్లందకు చెందిన పొన్నాల. రణిల్ కుమార్(19), మల్లెపాక. సిద్ధు(19), మహ బూబాబాద్ జిల్లా సింగారం గ్రామానికి చెందిన కౌశమర్ల వరుణ్ తే(19) గా గుర్తించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంతో నడపడం వల్లే ప్రమాదం జరిగి తమ పిల్లలు చనిపోయారంటూ కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని డిసిపి సీతారాం పరిశీలించారు.

## జెఇఇ ఫలితాల్లో కెరీర్ పాయింట్ విద్యార్థుల విజయకేతనం



ప్రజాపక్షం/హనుమకొండటౌన్: ఎన్‌టిఏ ప్రకటించిన జెఇఇ మెయిన్స్ 2024 ఫలితాలలో కెరీర్ పాయింట్ విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో వివిధ క్యాటగిరీలు, సిఆర్ఎల్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మొదటి బ్యాచ్‌తోనే బి.టెక్ విభాగంలో జె. హనీరావు అల్ ఇండియా 48వ ర్యాంక్, యం. చిత్రాంజలి అల్ ఇండియా 532వ ర్యాంక్ ఎల్. జశ్వంత్ 910వ ర్యాంక్, ఆర్ నిఖిల్ 2279వ ర్యాంక్, యం.ధనుంజయ్ 2464వ ర్యాంక్, యం.సంజయ్ పాల్ 3137వ ర్యాంక్, పి.శ్రీజ 4563వ ర్యాంక్, కె. కీర్త 4633వ ర్యాంక్, డి.దేవేందర్ 4836, యం.హిమబిందు 5210వ ర్యాంక్, బి.ఆశ్రిత్ గౌడ్ 5310వ ర్యాంక్, బి.సందీప్ 5685వ ర్యాంక్, కె.అఖిల్ నాయక్, జి.భరతార్థ్, బి.అరుణ్‌కుమార్, కె.కిషోర్ ఆర్.విక్రమ్, కె.చిర్‌భీఫ్ కౌషల్, ఎ.హేమంత్‌లు ఆల్ ఇండియా 10,000ల లోపు ర్యాంక్‌లు సాధించారు. 40శాతంపైగా విద్యార్థులు ఐఐటి జెఇఇ పరీక్షకు అర్హత సాధించారు. ఐఐటి నీట్ కోచింగ్‌తో పాటు అత్యుత్తమ ప్రణాళిక అమలు చేయడం వల్ల విద్యార్థుల ఇంతటి విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా వరంగల్ బ్రాంచ్ నిర్వహకులు కరుణాకర్ రావు, మధుపాల్ రావు, శ్రీనివాస్, దేవేందర్ రావు, దేవేందర్, రాజస్థాన్ కోటా ఫ్యాకల్టీ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీచింగ్, నాన్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ ప్రభంజనం



ప్రజాపక్షం/హనుమకొండటౌన్ : జెఈఈ మెయిన్స్ 2024 ప్రవేశ పరీక్ష ఫలితాలు ఎన్‌టిఏ విడుదల చేయగా ఎస్ఆర్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన విజయాలు సాధించారు. గురువారం విడుదలైన జెఈఈ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల జాతీయ స్థాయిలో విజయకేతం ఎగురవేసారు.

ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు దొంతుల మనీష్ జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 126వ ర్యాంకు సాధించాడు. జి.నవీన్ జాతీయ స్థాయిలో రిజర్వేషన్ కేటగిరీలో 5వ ర్యాంకు సాధించాడు. ఎ.నందిని రిజర్వేషన్ కేటగిరీలో 12వ రాంక్, వై. సాత్విక్ రెడ్డి రిజర్వేషన్ కేటరీలో 42వ ర్యాంకు, జి.కలు రిజర్వేషన్ కేటగిరీలో 55వ ర్యాంకు సాధించి ఎస్ఆర్ కీర్తి ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెట్టారు. ఇప్పటివరకు 3256కి పైగా ప్రవేశానికి విద్యార్థులు అర్హత సాధించి రాష్ట్రంలో ఎస్ఆర్ విజయపథాన్ని ఎగురవేసారు. ఓపెన్, అన్ని కేటగిరీలు కలిపి జాతీయ స్థాయిలో 1000లోపు 50పైగా ర్యాంకులు సాధించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలతో సంతోషాన్ని తెలియజేస్తూ ఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి భవిష్యత్తులు మరిన్ని ర్యాంకులు సాధించేలా తీర్చి దిద్దుతామని అశాభావం వ్యక్తంచేసారు. ఈ ఫలితాలు విద్యార్థులందరికీ స్ఫూర్తి దాయకం కావాలని ఆకాంక్షించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మెన్ వరదారెడ్డి,డైరెక్టర్‌లు మధుకర రెడ్డి,సంతోష్ రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో అత్యత్తమ మార్కులు సాధించేలా విద్యార్థులను ఎల్లవేళలా మరిన్ని విజయాలు సాధించేలా తీర్చి దిద్దుతామని అన్నారు.

## కార్మికుల హక్కులు కాలరాస్తున్న బిజెపిని ఎన్నికల్లో ఓడిద్దాం

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్




**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** కార్మిక హక్కులు హరిస్తున్న బిజెపిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిద్దామని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. గురువారం కుత్బుల్లాపూర్ ఎఐటియుసి నియోజకవర్గ నాయకులతో కలిసి మేడే పోస్టర్‌ను షాపూర్ నగర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగి యూసుఫ్ మాట్లాడుతూ గతంలో పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక వాటిని తీసివేసి కొత్త చట్టాలు తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసి బడా పెట్టుబడిదారులకు లాభం చేకూరుస్తుందని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాలు బిజెపి వచ్చాక 12గంటల పనిదినాలయ్యాయని, గతంలో ఇచ్చిన పెన్షన్ స్కీంను తొలగించి కార్మికులకు అన్యాయం చేసే కొత్త పెన్షన్ స్కీంను తెచ్చారన్నారు. ఇఎస్ఐలో మందులు దొరకట్లేదని, ఉద్యోగులు దాచుకున్న సొమ్మును కూడా ఇవట్లేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, సిపిఐ బాచూపల్లి కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు నగప్ప, దేవేందర్ ప్రసాద్, వెంకటేష్, సుంకిరెడ్డి, చంద్రమౌళి, సామెల్, రవి, బాలాజీ, కుమార్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## రోజు కూలీ రూ.600 ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాలు




**ప్రజాపక్షం/ఆలేరు :** ఉపాధి కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఉప్పాల ముత్యాలు డిమాండ్ చేశారు. గురువారం ఆలేరు మండలం శారజిపేట గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి కూలీల సమస్యల మీద సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనిముట్లు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. పనిచేస్తున్న ప్రాంతాల్లో టెంట్లు లేకపోవడం, తాగడానికి నీళ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండుసార్లు ఆజార్ తీసేసి వ్యవసాయ కూలీలపై ప్రేమ చూపి కనీస వేతనం వచ్చేటట్టు చూసి వారానికి ఒకసారి డబ్బులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, దూడల లింగం, యాదమ్మ, నరసమ్మ, మంగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## సింగరేణిలో షిఫ్ట్ వేళలు మార్చండి

ప్రాజెక్టు మేనేజర్‌కు ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికే ఓసీపీ–5లో పనిచేస్తున్న కార్మికులకు షిఫ్ట్ వేళలు మార్చాలని, ప్రాజెక్టు లో కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఓసిపి–5 ప్రాజెక్టు మేనేజర్ అనిల్ గాబలెకు గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు వినతిపత్రం అందజేసినట్టు ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్ పేర్కొన్నారు. వేసవి ఎండల తీవ్రతతో కార్మికులు డ్యూటీలు సరిగా చేయలేకపోతున్నారని , వారికి షిఫ్ట్ వేళలు మార్చాలని కోరారు. ఓసిపిలో ఎక్కువ కూలర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. బేస్‌వర్క్ షాప్‌లో ఓపెన్ షెడ్లు లేకపోవడంతో కార్మికులు పనిచేయుటకు ఇబ్బందులకు గురవుతున్నారు. బేస్ వర్క్‌షాప్‌లో ఓపెన్‌షెడ్డుకు సీలింగ్ లేదా తుంగ వేయించాలని, టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొగ సతీష్ బాబు, గండి ప్రసాద్, చందా తిరుపతి, చీకటి అంజయ్య, సోమ నర్సయ్య, భక్తి శ్రీనివాస్, ఆవుల సత్యనారాయణ, గోవింద రాజులు, దాసరి సురేష్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## వంట కార్మికులకు రూ.10వేలు కనీస వేతనం

మధ్యాహ్న భోజన వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ డిమాండ్




**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.10వేల వేతనం అమలు చేయాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవిందర్ డిమాండ్ చేశారు. హన్మకొండ బాల సముద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ధర్ముల రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ హన్మకొండ జిల్లా మహాసభకు హాజరై రవీందర్ మాట్లాడుతూ సొంత డబ్బులు పెట్టి పాఠశాలలో వంటలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూ పెట్టిన బిల్లులు సకాలంలో అందక వంట కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వంట కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### భోజన వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ

మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా జక్కు రాజు గౌడ్, అధ్యక్షురాలిగా జనగాని లక్ష్మి , ఉపాధ్యక్షులు వొల్లాల లక్ష్మి , ఎండి మస్తాన్ బి, ప్రధానకార్యదర్శిగా ధర్ముల రామ్మూర్తి,, సహాయ కార్యదర్శులుగా దామెర కవిత, వైనాల విజయ, ల్యాగ విజయ, రాధమ్మ, కోశాధికారిగా కల్పన బస్కె రాణి, సభ్యులుగా సధరం శాంత, ఒస్కుల ఇందిరలను ఎన్నుకున్నారు

# బిజెపి అధికారంలోకి వస్తే దేశ భవిష్యత్తు అంధకారమే

రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకే ఇండియా కూటమి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** బిజెపి అధికారంలోకి వస్తే దేశ భవిష్యత్తు అంధకారమే అవుతుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. భారత దేశ రాజ్యాంగానికే పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే ఇండియా కూటమి పనిచేస్తుందని పేర్కొన్నారు. గురువారం కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాడ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో సిపిఐ భాగస్వామ్యం ఉన్నందున తెలంగాణలో కాంగ్రెస్‌తో సయోధ్య కుదిరిందని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్క రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చి సిపిఐ మద్దతు కోరారని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ పనిచేస్తారని తెలిపారు. రెండోసారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాదం, హిందు, ముస్లింల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు చేస్తుందన్నారు. పదేళ్లుగా మోడీ ప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగించిందని, ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన సాగలేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లోనే బిజెపి పాలన కొనసాగిందని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీలు లేకుండా చేయాలని ఉద్దేశంతో బిజెపి అనేకమంది ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఇడి, ఐటి, సిబిఐ దాడులు చేయించిందన్నారు. మూడోసారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడం కోసం అనేక కుట్రలు పన్నుతోందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో మతోన్మాద బిజెపికి ఓటు వేయవద్దన్నారు. జైశ్రీరాం నినాదంతో బిజెపి ప్రజల వద్దకు వస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు కావాల్సింది కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టడం కాదని, సంక్షేమం కావాలన్నారు. కెసిఆర్ ఇంకా అహంకారంగా మాట్లాడుతున్నారని, కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడే ప్రజల సమస్యలపై, ప్రాజెక్టులపై, భూ సమస్యల పరిష్కారానికై, ధరణి పోర్టల్‌పై అనేక సలహాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారన్నారు. చివరకు ప్రశ్నా పత్రాల లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నారని, చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు మాయమాటలు చెపుతున్నారన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్, సిపిఐ పార్టీలు సంయుక్తంగా ప్రజల వద్దకు తీసుకువెళ్లి శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించడం జరిగిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి పనిచేయాలని, భూసమస్యలు, ప్రాజెక్టులు, ఉద్యోగాలపై దృష్టి పెట్టాలన్నారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు విజయానికి పనిచేయాలని సిపిఐ శ్రేణులను చాడ కోరారు. సమావేశంలో సిపిఐ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్య లు పొనగంటి కేదారి, గడిపె మల్లేష్, ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బోయిని తిరుపతి, నాగెల్లి లక్ష్మారెడ్డి, పైడిపల్లి రాజు, పిట్టల సమ్మయ్య, గొడిశెల తిరుపతి, కంది రవీందర్ రెడ్డి, మంద సుదర్శన్, బ్రాహ్మాండ్లపెల్లి యుగేందర్, ముద్రకోల రాజయ్య, న్యాలపట్ల రాజు, చెంచల మురళి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్రం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కార్మికుల పండుగ మేడేను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ కార్మిక లోకాన్ని కోరారు. గురువారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశం మెరుగు చిరంజీవి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి విలాస్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను హరిస్తుందన్నారు. గతంలో పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక వాటిని తీసివేసి కొత్త చట్టాలు తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసి బడా పెట్టుబడిదారులకు లాభం చేకూరుస్తుందని ఆరోపించారు. ఆదిలాబాదు అభివృద్ధి కాంక్షించని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. ఆదిలాబాద్ అభివృద్ధిని కాంక్షించని బిజెపిని ఓడించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలన్నారు. ప్రభుత్వరంగంలో సిపిఐలోని ప్రస్తుతం మూడు ఫ్యాక్టరీలు నడుస్తున్నాయన్నారు. సిసిఐ ప్రజల ఆస్తి అన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి గెలిస్తేనే సిసిఐ ప్రభుత్వ రంగంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో గాజెంగుల రాజు, ఎఐటియుసి జిల్లా ఉప ప్రధానకార్యదర్శి ఎం.కాంతారావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ.నారాయణ రెడ్డి, నాయకులు దాసరి అశోక్, అలాల శ్రీనివాస్, నక్క శంకర్, ఉప్పరి సురేష్, గొట్టుముక్కల నర్సింగ్, పొచ్చిరాం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రజెండా బలపడితే శ్రామికవర్గానికి మనుగడ

కార్మిక చట్టాల పరిరక్షణ ఉద్యమ దినంగా మేడే నిలవాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** పేదల పక్షాన నిలబడి వారి హక్కుల సాధనకు పాలకులను నిలదీసే గొంతుక ఎర్రజెండా అని, ఎర్రజెండా బలపడితే శ్రామిక వర్గానికి మనుగడ ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. మేడే వారోత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం సిపిఐ, ఎఐటియుసి జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో వట్టికొండ వంగ వెంకట్, వట్టికొండ మల్లికార్జున్‌రావు, ఎస్‌వి.రమణమూర్తి అధ్యక్షతన జరిగిన మేడే స్ఫూర్తి సదస్సులో ఆయన మాట్లాడారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో 8గంటల పని విధానం కోసం జరిగిన సమ్మె ఉద్యమంలో పాలకులు, యాజమాన్యం జరిపిన కాల్పుల్లో మరణించిన కార్మికుల రక్తంతో తడిసిందే ఎర్రజెండా అని పేర్కొన్నారు. వారి అమరత్వంతోనే అనేక కార్మిక చట్టాలు, హక్కులు ఏర్పడ్డాయని, చికాగో అమరుల స్ఫూర్తితో భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఉద్యమాలకు పాలకులు దిగిరాక తప్పలేదన్నారు. బ్రిటీష్ రాజ్యంలో, ఆ తర్వాత స్వతంత్ర భారతంలో పాలకులతో పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను ఏకమొత్తంగా బిజెపి ప్రభుత్వం రద్దు చేస్తుందన్నారు. మేడే స్ఫూర్తిగా సాధించు



కున్న 8గంటల పనిదినాన్ని, యూనియన్‌లు ఏర్పాటు చేసుకునే హక్కును, సమ్మె చేసే హక్కును కూడా హరించి యాజమాన్యాలకు కార్మికుల శక్తిని దోచిపెట్టే కుట్రలకు పాల్పడుతుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చట్టసభల్లో ఉన్న మందబలంతో కార్మిక ఉద్యోగ, ప్రజా, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ గోసపెడుతుందని, పోరాడి సాధించుకున్న 29 చట్టాలను యజమానులకు అనుకూలంగా నాలుగు కోడ్‌లుగా మార్పు చేసిందన్నారు. మోసపూరిత కుట్రలు, కుతంత్రాల తో మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని, లాభాల్లో నడుస్తున్న సింగరేణి గనులు, రవాణా , టెలికాం, రైల్వే, బ్యాంకులు, ఎలసి, రక్షణ రంగం, ఇస్రో లాంటి తదితర ప్రభుత్వరంగ సంస్థలను కూడా ఆదాని, అంబాని లాంటి పెట్టుబడిదారులకు అప్పణంగా అందిస్తున్నారని విమర్శించారు. ప్రజల కోసం కాకుండా ఆర్థిక బకాసరులకు ఆర్థిక నేరగాళ్ళుగా మోదీ ప్రభుత్వం కొమ్ముకాస్తుందని విమర్శించారు. దేశ సంపద, కార్మిక చట్టాల పరిరక్షణ ఉద్యమ దినంగా మేడేను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ సింగరేని కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, జి.వీరస్వామి, నరాటి ప్రసాద్, జె.గట్టయ్య, రాములు, రాము, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, గోనె మని, సుధాకర్, శేషగిరిరావు, కిష్టాఫర్, ఎర్రగాని కృష్ణ, లక్ష్మీ నారాయణ, భరణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


## దేశంలో వచ్చేది కాంగ్రెస్ సర్కారే

మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి బలరాంనాయక్‌ను గెలిపించాలి

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** దేశంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో అధికారం కాంగ్రెస్‌దేనని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ కేంద్రంలో తిరిగి అధికారంలోకి రాలేమని తెలిసిన బిజెపి ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతూ జైళ్లలో పెడుతుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జిఎస్‌టి తీసుకువచ్చి రూ.54 లక్షల కోట్లను పేదల నుండి వసూలు చేశారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎన్ని ఇచ్చారో చెప్పాలన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు పదేళ్లలో కూడా నెరవేరలేదన్నారు. జన్‌ధన్ ఖాతాలో రూ.15లక్షలు వేశారా ఒక్కసారి ప్రజలు ఆలోచన చెయాలన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చెయ్యడమే మన లక్ష్యమని కాంగ్రెస్ నేతలకు సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్‌లకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు అమలు చేశామన్నారు. బిఆర్‌ఎస్ 10 ఏండ్లు పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేశారని విమర్శించారు. రైతును రాజును చేయడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలతో పాటు రూ.10 లక్షల జీవిత భీమా ఇస్తామన్నారు. ములుగు, వెంకటాపూర్, కన్నాయిగూడెం, ఏటూరు నాగారం, మంగపేట మండలాలకు చెందిన బిఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిక వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి సీతక్క ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, డాక్టర్ అనిల్, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



### బడా వ్యాపారాలకు దేశ సంపదను దోచిపెట్టే పార్టీ బిజెపి


**వెంకటాపూర్ :** బిజెపి పార్టీ బడా వ్యాపారులకు తొత్తుగా మారి దేశ సంపదను వారికి దోచి పెడుతుందని మంత్రి సీతక్క అన్నారు. వెంకటాపూర్ మండలంలోని బండారుపల్లి, నర్సాపూర్, కేశవాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ చేస్తున్న కూలీల వద్దకు వెళ్ళి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్‌ని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎంపి ఎన్నికలు పేదల కోసం పొట్లాడే రాహుల్‌గాంధీ, బడా వ్యాపారులకు ప్రజాధనాన్ని దోచిపెట్టే నరేంద్రమోడికి మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. లక్షల కోట్ల రూపాయలు పేదల దగ్గర పన్నుల పేరుతో వసూలు చేసి కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసిన మోదీకి రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలను ప్రేమించడం, ప్రజలందరిని కలిపి ఉంచడమే రాహుల్ లక్ష్యమన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, యువకులు, విద్యార్థులు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కు ఓటు వేసి రాహుల్‌గాంధీకి తోడుగా పార్లమెంట్‌కు పంపాలని సీతక్క కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపిని ఓడించండి.. దేశాన్ని రక్షించండి

ఆర్థిక అసమానతలు పెంచిన మోదీ ప్రభుత్వం

భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించి.. దేశాన్ని రక్షించాలని భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో రాజ్యాంగ పరిరక్షణ జాన్ కన్వీనర్ వెంకగల్‌రెడ్డి అధ్యక్షతన ప్రజాస్వామ్య పరిరక్షణ.. పౌర సమాజ బాధ్యతలు అనే అంశంపై జరిగిన సదస్సులో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, న్యాయవాది కిరణ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు ప్రసాద్, సామాజిక విశ్లేషకుడు సీఎస్‌ఆర్ ప్రసాద్, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి పాల్గొన్న సదస్సులో డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ మాట్లాడారు. అవినీతి రహిత పాలన చేస్తామని, స్వదేశీ ఉత్పత్తులు పెంచి నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని, దేశ ప్రజల మధ్య ఆర్థిక అసమానతలను రూపుమాపుతామని ఎన్నో వాగ్దానాలు చేసి ఆర్థిక ఎజెండాతో మొదటి సారి అధికారంలోకి వచ్చిన బిజెపి మత విద్వేషాలను రెచ్చగొట్టి హిందూ ఓట్లను కొల్లగొట్టి రెండో సారి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలను మతం చుట్టూ తిప్పుతూ ఆర్థికేతర అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించి సాంస్కృతిక రంగంలో బలం పెంచుకొని మూడోసారి అధికారంలోకి రావాలని చేస్తున్న బిజెపి కుటిల రాజకీయాలను ప్రజలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి గద్దెనెక్కిన బిజెపి నోట్ల రద్దు.. ప్రయివేటీకరణతో ఉన్న ఉద్యోగాల్లో 12 కోట్ల ఉద్యోగాలను పోగొట్టారన్నారు. గత పదేళ్ల బిజెపిపాలనలో ప్రపంచంలో ఎక్కడాలేని విధం గా ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయన్నారు. ఆధిపత్య కులాల సంపదకు మతాన్ని జోడించి ప్రజలను అన్ని విధాలుగా అణచివేస్తూ పాలన కొనసాగిస్తున్న బిజెపి ఫాసిజాన్ని వ్యతిరేకించాలన్నారు. ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న ప్రజలకు ఊపిరాడని పాలన నుంచి ఒక వెసులుబాటు, కొంత ఉపశమనం కోసం ఇండియా కూటమిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రు పాషా, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది మధు, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఛైర్మన్ సాయిని నరేందర్, లాల్ నీల్ మైత్రి వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకురాలు రమాదేవి, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు నున్న అప్పారావు, భారత్ బచావో నాయకులు జైసింగ్ రాథోడ్, ఎండీ రాజ్‌మహ్మద్, సోమయ్య, ఓంబ్రహ్మం, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, దొమ్మటి ప్రవీణ్, మచ్చ దేవేందర్, ఉదయ్‌సింగ్, రాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## ఆరుగురు మృతి

(మొదటి పేజీ తరువాయి)

నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన శ్రీకాంత్ పదేళ్లుగా కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం గడుపుతన్నాడు. అతడికి భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు లాస్య, లావణ్య ఉన్నారు. లాస్యకు విజయవాడ గుణదలలో చెవులు కుట్టించే వేడుకకు హైదరాబాద్ నుంచి శ్రీకాంత్ కుటుంబంతో పాటు బంధువులు మాణిక్యమ్మ, చంద్రరావు, కృష్ణం రాజుస్వర్ణ పిల్లలు కౌశిక్, కార్తీక్ బయలుదేరారు. మొత్తం 10మంది కారులో విజయవాడకు వెళ్తుండగా కోదాడ పట్టణ శివారులోని శ్రీరంగాపురం వద్ద ఆగివున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాంత్ అతడి కుమార్తె లాస్య, బంధువులు మాణిక్యమ్మ, చంద్రరావు, కృష్ణంరాజు స్వర్ణ అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీకాంత్ భార్య నాగమణి అతని కుమార్తె లావ్యణతో పాటు బంధువుల పిల్లలు కార్తీక్, కౌశిక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని, మృతదేహాలను పోలీసులు కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులకు తక్షణ చికిత్స అందిస్తున్నారు. మృతుడు శ్రీకాంత్ స్వగ్రామం చిమిర్యాల నుండి బంధువులు పెద్దఎత్తున ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. బంధువుల రోదనలు వైద్యశాలలో మిన్నంటాయి. వేడుక ముచ్చట తీరకముందే బతుకులు గాలిలో కలిసిపోవడంతో కన్నీరు మున్నీరవుతున్న తీరు పలువురిని కంటతీరు పెట్టించింది. పోస్టుమార్టంకు ఓ ఆటోలో తెచ్చిన విగత జీవులుగా ఉన్న ఆరు మృతదేహాలను చూసి పలువురు ఉద్వేగానికి లోనయ్యారు.

## 1,202 మంది అభ్యర్థులు

(మొదటి పేజీ తరువాయి)

బరిలో ఉన్నారు. అందులో 1,098 మంది పురుష అభ్యర్థులు కాగా, 102 మంది మహిళలు ఉన్నారు. ఇద్దరు థర్డ్‌జెండర్లు ఉన్నారు. రెండవ దఫ పోలింగ్ జరిగే నియోజకవర్గాల్లో బుధవారంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. 1.67 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 16 లక్షలపైగా పోలింగ్ సిబ్బంది మోహరించారు. 15.88 కోట్ల ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని ఎన్నికల సంఘం తెలిపింది. అందులో 8.08 కోట్ల మంది పురుషులుకాగా, 7.8 కోట్ల మంది మహిళలు ఉన్నారు. 5,929 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు ఇసి పేర్కొంది. దాదాపు 34.8 లక్షల మంది మొదటిసారి ఓటు వేయనున్నారు .అదనంగా 3.28 కోట్ల మంది యువత 20–29 ఏళ్ల మధ్య వయస్సున్న వారు ఉన్నారు. రెండవ విడత ఎన్నికల కోసం మూడు హెలికాప్టర్లు, నాలుగు ప్రత్యేక రైళ్లు, దాదాపు 80 వేల వాహనాలు, భద్రతాసిబ్బదిని మోహరింపజేశారు. 50పైగా పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ సౌకర్యం కల్పించారు. కాంగ్రెస్ నేత శశిథరూర్, కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్, నటుడు, రాజకీయనేత అయిన అరుణ్ గోవిల్, కర్నాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్ సోదరుడు డికె సురేష్ (కాంగ్రెస్), కర్నాటక మాజీ సిఎం హెచ్‌డి కుమారస్వామి (జెడిఎస్) వంటి కీలక నేతలు పోటీలో ఉన్నారు. అదే విధంగా బిజెపి అభ్యర్థి హేమమాలిని, ఓమ్‌బిర్లా, గజేంద్ర సింగ్ షేకావత్‌లు వారి వారి నియోజకవర్గాల్లో హ్యాట్రిక్ విజయం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. మొత్తం ఏడు విడతల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండగా, గత శుక్రవారం మొదటి దశ పోలింగ్ 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 నియోజకవర్గాల్లో ముగిసింది. రెండవ విడతలో జరిగే పోలింగ్‌తో కేరళ, రాజస్థాన్, త్రిపురలోని మొత్తం స్థానాల్లో ఎన్నికలు ముగియనున్నాయి. ఈనెల 13న జరిగిన తొలి విడతలో తమిళనాడులోని 39, ఉత్తరాఖండ్‌లో 5, అరుణాచల్ ప్రదేశ్‌లో 2, మేఘాలయలో 2, అండమాన్ నికోబార్ దీవుల్లో ఒకటి, మిజోరామ్‌లో ఒకటి, నాగాలాండ్‌లో ఒకటి, పుదుచ్చేరిలో ఒకటి, సిక్కింలో ఒకటి, లక్ష్యద్వీప్‌లో ఒక స్థానంలో పోలింగ్ ముగిసింది. రెండవ విడత కింద జరిగే 89 సీట్లలో 2019లో జరిగే ఎన్నికల్లో ఎన్‌డిఎ 56, యుపిఎ 24 గెలుచుకున్నాయి. కాగా, రెండవ విడత కింద కేరళలో 2,77,49,159 మంది ఓటు వేసేందుకు అర్హులుగా ఉన్నారు. అందులో ఐదు లక్షలకుపైగా మంది తొలిసారి ఓటు వేయనున్నారు. ప్రస్తుతం వాయనాడ్ నుంచి ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ మరోసారి కూడా ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. సిపిఐ అన్నీరాజా, బిజెపి నుంచి కె. సురేంద్రన్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ మరో నేత శశిథరూర్ తిరువనంతపురం నుంచి నాల్గొవసారి గెలవాని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయనపై బిజెపి నుంచి చంద్రశేఖర్, సిపిఐ నుంచి పన్నయన్ రవీంద్రన్ బరిలో ఉన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ — రంగారెడ్డి
కరీంనగర్ | శుక్రవారం | 26 ఏప్రిల్, 2024 | 9

## ఎక్సైజ్ అధికారులకు మినహాయింపుపై ఆర్డర్స్ రిజర్వు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత రెవెన్యూ, హోమ్ ఇతర ప్రభుత్వ శాఖల్లోని అధికారులను బదిలీ చేసినప్పటికీ ఎక్సైజ్ శాఖలో మాత్రం బదిలీ చేయకపోవడాన్ని సవాల్ చేసిన కేసులో హైకోర్టు తీర్పును రిజర్వులో పెట్టింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె అనిల్ కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల బదిలీల నుంచి ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇవ్వడం అన్యాయమంటూ సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి పిల్ దాఖలు చేశారు. ఎన్నికల విధులతో సంబంధం లేని, ఆఫీసులకే పరిమితమయ్యే అధికారులను బదిలీ చేయాల్సిన అవసరం లేదని ఈసీ చెప్పింది. గత డిసెంబర్ నాటి ఈసీ ఉత్తర్వులకు, ఫిబ్రవరి నాటి ఉత్తర్వులకు సంబంధం లేదని, ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇవ్వడం అవినీతిని ప్రోత్సహించడమేనని పిటిషనర్ వాదన. వాదనల తర్వాత హైకోర్టు జడ్జిమెంట్‌ను రిజర్వులో పెట్టింది.

## సిసిఎస్‌కు నిధులు విడుదల హర్షణీయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిఎస్ ఆర్‌టిసి కార్మికులకు సిసిఎస్ బకాయిలు క్లియర్ చేసే నిమిత్తం ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేయడాన్ని టిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్న స్వాగతించారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులు అనేకమంది రుణాలకు దరఖాస్తు చేసుకున్నారని, నిధుల లేమి కారణంగా సిసిఎస్ రుణాలు ఇవ్వలేకపోయిందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గత 7 నెలలుగా రిటైర్డ్ ఉద్యోగులకు పిఎఫ్ డిపాజిట్లపై వడ్డీ అందక పోవటంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ వచ్చిన డబ్బులో రిటైర్డ్ ఉద్యోగులకు గత 7 నెలల నుండి రావాల్సిన వడ్డీ డబ్బులను వారికి జమ చేయాలని కోరారు. ఇక నుండి ఆర్‌టిసి కార్మికుల జీతాలలో రికవరీ చేసే ఎంఆర్‌డిఎఫ్, రుణాల రికవరీ మొత్తాలను ఆర్‌టిసి యాజమాన్యం సిసిఎస్ జమ చేయాలని, ఆ డబ్బు యాజమాన్యం అవసరాలకు వాడుకోకూడదని కోరారు.

## మధుయాస్కీకి సిఎం పరామర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కీ గౌడ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మధుయాస్కీగౌడ్ తల్లి అనసూయ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. అనసూయ దశదినకర్మ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి హయత్‌నగర్‌లోని మధుయాస్కీగౌడ్ ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అనసూయ చిత్రపటానికి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మధుయాస్కీ కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. సిఎంతో పాటు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం.నరేందర్‌రెడ్డి, ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు అనసూయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు

## మోదీపై ఎన్నికల కమిషనర్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధాని నరేంద్ర మోడీ రెండు, మూడు రోజులుగా మాజీ ప్రధానిపై చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాలను కించపరిచేలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధాని మోడీ వ్యాఖ్యలపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు శోభారాణి, రామచంద్రా రెడ్డి,నర్సారెడ్డి భూపతి రెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ వికాస్ రాజ్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. నరేంద్రమోదీ వ్యాఖ్యలు సరికావని, ఆయన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల తాళిబొట్లు తెంచుతారని మాట్లాడటం సరికాదని, మోడీ ఓటు బ్యాంకు రాజకీయాలు పాల్పడుతున్నారని ఆరోపించారు.

## కెసిఆర్ ఆదేశాల మేరకే హరీశ్‌రావు సవాల్ చేస్తున్నారా?

### ఎంఎల్‌ఎ రామ్మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ ఆదేశాల మేరకే హరీశ్‌రావు సవాల్ చేస్తున్నారా అని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ రామ్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌రావును కెసిఆర్ నమ్మడం లేదని, ఆయనను కెసిఆర్, కెటిఆర్ ఇద్దరూ కలిసి బిఆర్‌ఎస్‌లో నుండి బయటికి పంపే పనిలో ఉన్నారని ఆరోపించారు. గాంధీభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్ట్ నెలలో ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చామని, నాలుగు నెలలకే ఆగడం లేదని, 15 రోజులకే బిఆర్‌ఎస్ నేతలు రోడ్డెక్కారని ఎద్దేవా చేశారు. రుణామాఫీ చేస్తామని, హరీశ్‌రావు ఆగస్టు 15న తర్వాత ముల్లె, మూట సర్దుకుని ఫామ్‌హౌస్‌కు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలన్నారు. హరీశ్‌రావుది ఎంఎల్‌ఎ స్థాయి అని, ఆయనకు తాను సరిపోతానని, సిఎం స్థాయివరకు ఎందుకని ప్రశ్నించారు.

## రాజ్యాంగ హక్కుగా ఓటు వినియోగించుకోవాలి : బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్లందరు రాజ్యాంగ హక్కుగా ఓటును వినియోగించుకునేలా కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అన్నారు.లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమీషన్ చూడాలని, రాజ్యాంగాన్ని కాపాడుతూ, ఎన్నికల పట్ల ప్రజలకు, నాయకులకు, రాజకీయ పార్టీలకు విశ్వాసం కలిగించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు ఎన్నికల రోజు వేతనంతో కూడిన సెలవు ఇచ్చి, ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటుహక్కు వినియోగించుకోని వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందకుండా చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డి మనవత్వాన్ని చాటుకున్నారు. తన కాన్వయ్‌లోని అంబులెన్స్ వాహనాన్ని పంపించి గాయపడ్డ ఓ వ్యక్తిని హుటాహుటినా ఆస్పత్రికి తరలించారు.

## ఇంటర్‌లో రెసొనెన్స్ కళాశాలల అత్యుత్తమ ఫలితాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలు–2024 లో హైదరాబాద్ రెసొనెన్స్ జూనియర్ కళాశాలలు విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించి చరిత్ర సృష్టించారు. స్టేట్ టాప్ 5 మార్కుల్లో 186 విద్యార్థులు, స్టేట్ టాప్ 10 మార్కుల్లో 443 విద్యార్థులు, వివిధ సబ్జెక్టులలో 100 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు 666 మంది ఉన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి ఫలితాలలో అత్యధిక మార్కులు (468/470) స్టేట్ టాప్ 5 మార్కుల్లో 155 విద్యార్థులు, స్టేట్ టాప్ 10 మార్కుల్లో 360 మంది విద్యార్థులు ఉన్నారు. రాష్ట్ర ర్యాంకర్లను మాదాపూర్‌లోని రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో రెసొనెన్స్ హైదరాబాద్ కేంద్రాల డైరెక్టర్ పూర్ణచంద్రరావు సత్కరించారు.

### రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తున్న

# బిజెపికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** 75 సంవత్సరాలుగా అమల్లో ఉన్న రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తున్న బిజెపికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నిర్వహించిన రోడ్‌షోలో రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, డైరీ అథారిటీ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రంగారెడ్డి జెడ్‌పి చైర్ పర్సన్ అనిత హరినాద్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జి వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని దోచుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ గుజరాత్ నుండి వచ్చిందని, నేడు గుజరాత్ నుండి వచ్చిన నరేంద్ర మోదీ అదే తరహాలో భారతదేశాన్ని భ్రష్టు పట్టించాలని చూస్తుండని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి అంటే భారతీయ జనతా పార్టీ కాదని అది.. బ్రిటిష్ జనతా పార్టీ అని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన ఐటిఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. 10 సంవత్సరాలుగా దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కెసిఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన నరేంద్ర మోదీ, తెలంగాణ రాష్ట్రం సాధించుకుంటే ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూసిన నిరుద్యోగులను మోసం చేసిన కెసిఆర్‌లను కాల గర్భానికి తెలంగాణ ప్రజలు పంపిస్తారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేవుడి పేరు, మతం పేరు చెప్పి ఓట్ల కోసం వచ్చే వారిని నమ్మొద్దన్నారు. చేవెళ్ల నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండి విశ్వేశ్వర్ రెడ్డి కుటుంబానికి ఎంతో చరిత్ర, ప్రజలకు విశ్వాసం ఉందని, రాజ్యాంగం పట్ల అనుభవం ఉన్న విశ్వేశ్వర్‌రెడ్డి రిజర్వేషన్ల రద్దు చేస్తామంటున్న బిజెపి పక్షాన నిలబడి ఆయనపై ఉన్న విశ్వాసాన్ని పోగొట్టుకూడదని సిఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనపై లేనిపోని ఆరోపణలు, అసత్య ప్రచారం చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సోషల్ మీడియా ప్రచారాలు మాని... బహిరంగ విచారణకు రావాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, భీమ్ భరత్, నరేందర్, బడంగ్పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాలి

### స్పీకర్ పిటిషనర్ల ఫిర్యాదులు చేర్చండి
### ప్రభుత్వ న్యాయవాదికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్ :** ఖైరతాబాద్, భద్రాచలం, స్టేషన్ ఘన్‌పూర్‌ల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున గెలిచిన దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడంపై దాఖలైన వ్యాజ్యాలను గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్‌రెడ్డి విచారించారు. కాంగ్రెస్‌లో చేరడం పార్టీ పిరాయింపుల చట్టానికి వ్యతిరేకమంటూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ దాఖలు చేసిన విడివిడి వ్యాజ్యాలపై విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ పార్టీ తరఫున సికింద్రాబాద్ ఎంపీ సీటుకు పోటీ చేస్తున్నారని పిటిషనర్ లాయర్ చెప్పారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారన్నారు హనమకొండ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా అదే విధంగా చేయడంతోపాటు తన కుమార్తె కావ్యతో వరంగల్ ఎంపీ సీటుకు పోటీలో నిలుపుతున్నారని చెప్పారు. ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేశారని, పత్రికల్లో వార్తలు కూడా వచ్చాయని, ఇది పార్టీ పిరాయింపుల కిందకు వస్తుందని చెప్పారు. దీనిపై స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శిలకు వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళితే స్పీకర్ కార్యాలయంలోకి రానీయలేదని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది ద్వారా ఆ ముగ్గురిపై ఫిర్యాదులను స్పీకర్ ఆఫీసుకు చేరేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది కల్పించుకుని, ఏవిధమైన ఆదేశాల జారీ అవసరం లేదని, స్పీకర్ ఆఫీసుకు పిటిషనర్ల ఫిర్యాదులు చేరేలా చేస్తామని చెప్పారు. ఇందుకు అనుమతించిన న్యాయమూర్తి, ముగ్గురు ఎమ్మెల్యేలపై పిటిషనర్ల ఫిర్యాదుల అఫిడవిట్లు స్పీకర్ కార్యాలయానికి చేరేలా ప్రభుత్వ న్యాయవాది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పీకర్ ఆఫీసుకు అందినట్లుగా నిర్ధారణ చేయాలన్నారు. విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు.

## కాంగ్రెస్‌లోకి గుండు సుధారాణి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల సమయంలో బిఆర్‌ఎస్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. బిఆర్‌ఎస్‌కు చెందిన వరంగల్ మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి సమక్షంలో గుండు సుధారాణి గాంధీభవన్‌లో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, బిఆర్‌ఎస్ నాయకులు మానవతారాయ్,కాట ప్రదీప్ గౌడ్, మెదక్ బాలకృష్ణ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఎఐసిసి ఆదేశాల మేరకే చేరికలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల వరకు పార్టీలో పని చేసి, ఎన్నికల సమయంలో కొందరు బయటకు వెళ్లారని, అటువంటి నాయకులను తిరిగి పార్టీలో చేర్చుకోవాలని పిసిసికి ఎఐసిసి ఆదేశించిందన్నారు. బిఆర్‌ఎస్ నుండి ఎవరొచ్చినా చేర్చుకోవాలనే ఆదేశాలు ఉన్నాయన్నారు. పార్టీలో చేరివారు కాంగ్రెస్ ఇన్‌చార్జులు, ఎంఎల్‌ఎల వద్ద పని చేయాలన్నారు. పార్టీలోకి చేరే వాళ్లంతా డిక్లరేషన్ ఇవ్వాలని, జవాబుదారీగా చేరికలు ఉంటాయని, ఎవ్వరూ నిరాశ చెందవద్దని, అందరూ కలిసి పని చేయాల్సిందేనని అన్నారు. కోదండరెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలకు అవకాశవాదమే ఎజెండా అని, కాంగ్రెస్‌కు నిర్దిష్ట సిద్ధాంతం, నియమాలు ఉన్నాయన్నారు.

## ఐపిఎల్ టికెట్‌ల జారీలో అక్రమాలు

### యువజన సంఘాల ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐపిఎల్ టికెట్‌ల జారీలో పారదర్శకత లేకుండా వ్యవహరించిన హెచ్‌సిఎ బోర్డ్, సన్ రైజర్స్ ఫ్రాంచైజీ యజమాన్యాల తీరు తీవ్ర గర్హనీయమని యువజన సంఘాలు మండిపడ్డాయి. ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ జరుగుతున్న సందర్భంలో అధిక ధరలను నియంత్రించేందుకు రాష్ట్ర వినియోగదారుల ఫోరమ్, వసతుల నిర్వహణలో అలసత్వం వహిస్తున్న హెచ్‌సిఎపై రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్), డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ), ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పివైఎల్) తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి అన్నారు. టికెట్‌లను బ్లాక్‌లో అమ్ముకుంటున్న హెచ్‌సిఎ, సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఛలో ఉప్పల్ స్టేడియంకు బయలుదేరిన యువజన సంఘాల నాయకులను హిమాయత్ నగర్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె. ధర్మేంద్ర, డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హష్మీ, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. ప్రదీప్ మాట్లాడుతూ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో గురువారం సన్ రైజర్స్ హైదరాబాద్ రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య ఐపిఎల్ మ్యాచ్ జరగాల్సి ఉందని, ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్‌లను గత శుక్రవారం విక్రయానికి పెట్టారని, అయితే టికెట్‌లను పేటిఎంలో అమ్మకానికి పెట్టిన క్షణాల్లోనే టికెట్‌లు అమ్ముడు పోయాయంటూ బోర్డ్ పెట్టారని తెలిపారు. దాదాపు 36 వేలకుపైగా టికెట్‌లను అమ్మకానికి పెట్టిన అరగంటలోపే ఏవిధంగా అమ్ముడుపోతాయో హెచ్‌సిఎ, సన్ రైజర్స్ యజమాన్యాలు రాష్ట్ర ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఇప్పటికే అనేక విధాలుగా యువజన సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేసిన, హెచ్‌సిఎ బోర్డ్ ఇప్పటివరకు ఎటువంటి సమాధానం చెప్పలేదన్నారు. స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న సందర్భంలో నాణ్యతలేని ఆహార పదార్థాలను, కూల్ డ్రింక్స్‌ను అధిక ధరలకు హెచ్‌సిఎ సిబ్బంది అమ్ముతున్నారని, అధిక ధరలకు తినుబండారాలను అమ్మడం దుర్మార్గమన్నారు. వేసవికాలం సందర్భంగా స్టేడియంలో ప్రేక్షకులకు నీటిని సైతం అందించకుండా దుర్మార్గంగా హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్య ప్రసాద్, శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, మజీద్, కళ్యాణ్, పివైఎల్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి రవి కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మం తెచ్చేందుకు బిజెపి కుట్రలు

### ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి రఘునాయక్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించే విధంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల్లో ప్రసంగాలు చేస్తున్నారని ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి రఘునాయక్ ఆరోపించారు. గురువారం షాద్‌నగర్‌లోని ఎంఎల్‌ఎ నివాసంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే లక్ష్యంతో కాంగ్రెస్‌పై అనేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రేచ్చగొట్టే విధంగా ప్రధాని మోదీ ప్రసంగాలు ఉంటున్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల మహిళల మోడలో ఎంతో పవిత్రంగా ఉన్న పుస్తెలు, మెట్టేలను ముస్లింలకు తాకట్టు పెట్టే రోజులు వస్తాయని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రసంగించారు. హిందూ సాంప్రదాయాన్ని విమర్శించడం సరైన పద్ధతి కాదని, త్యాగాల చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించుకోవాలని సూచించారు. రాముడిని అడ్డుపెట్టుకొని ఓట్లు అడగటం సిగ్గు లేదా అని ప్రశ్నించారు. పబ్లిక్ సెక్టార్లను విక్రయించడమే పనిగా పెట్టుకున్నారే తప్పా ప్రజా సంక్షేమానికి ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ పదేళ్ళలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మతాన్ని, సోషలిజాన్ని కాపాడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి నాలుగు నెలలు గడుస్తుంటే కరువు తీసుకువచ్చిందని ప్రస్తుత బిఆర్‌ఎస్ ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. బిఆర్‌ఎస్ కంటే మెరుగైన విద్యుత్, తాగునీరు ప్రజలకు అందిస్తున్నామనే విషయాన్ని ప్రజలందరు గమనించాలని కోరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమని పేర్కొన్నారు. సమావేశంలో టిపిసిసి సభ్యుడు బాబర్‌ఖాన్, హరినాథ్‌రెడ్డి, వీరేశం, మహ్మద్ ఇబ్రహీం, భాస్కర్ గౌడ్‌లు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలు

### ఆందోజు రవీంద్ర చారి



**ప్రజాపక్షం/హయత్ నగర్:** మేడే అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి పిలుపునిచ్చారు. గురువారం హయత్ నగర్ మండల సమితి, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అధ్యక్షులు గోల్కొండ నాగరాజు సారథ్యంలో పార్టీ కార్యాలయంలో మే డే గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఏఐటీయూసి జిల్లా సబ్ కమిటీ సభ్యులు సామిడీ శేఖర్ రెడ్డి లు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేయాన్నారు.

**షాద్‌నగర్:** మేడే కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు మేడే స్ఫూర్తిలో పోరాటాలను ఉధృతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు కోరారు. గురువారం షాద్‌నగర్‌లో మేడే గోడపత్రిలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కార్పోరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేడే దిన్నాన్ని పోరాట దినంగా మార్చుకొని కార్మికుల పక్షాన నిలబడి ఉద్యమాలు చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులకు సంఘటితం చేసుకుంటే భవిష్యత్ కార్యచరణపై చర్చించి పోరాటాలు నిర్వహించాలని పేర్కొన్నారు. మేడేను పురస్కరించుకొని షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో, రెండు మున్సిపాలిటిల్లో ఎర్ర జెండాను ఎగురవేసేందుకు కార్మిలలోకం ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.శ్రీనునాయక్, నాయకులు లింగం నాయక్, కిషన్‌నాయక్, ఆటో యూనియన్, భవన నిర్మాణ కార్మికులు రాజు, రవి, మధన్‌లు పాల్గొన్నారు.



## చేవెళ్ళ లోక్‌సభకు 88 నామినేషన్లు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి చేవెళ్ళ లోక్ సభ నియోజక వర్గ స్థానానికి గురువారం మొత్తం 88 నామినేషన్లు దాఖలు అయ్యాయి.చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం సంబంధించి ప్రధాన పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి,బిఆర్‌ఎస్ నుండి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తో పాటు ఆయన కుమారుడు కాసాని వీరేష్ తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. వీరితో పాటు వివిధ పార్టీల నుండి, సంఘాల తోపాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా తమ తమ నామినేషన్లను దాఖలు చేశారు. కాదు చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం మొత్తం 64 మంది అభ్యర్థుల నుండి 88 నామినేషన్లు దాఖలు కాగా గురువారం ఒక్కరోజే 30 మంది అభ్యర్థుల నుండి 32 నామినేషన్లు దాఖలు చేశారు.ఇది ఇలా ఉండగా ప్రధాన పార్టీలకు చెందిన బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంజిత్ రెడ్డి ల పేర్లతో పోలిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం చేయడం విశేషం.

### బిఆర్‌ఎస్ అభ్యర్థిగా కాసానీ వీరేశ్

చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా కాసానీ వీరేశ్ రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ శశాంకకు గురువారం నామినేషన్ సమర్పించారు.

## రంజిత్‌రెడ్డి నామినేషన్‌కు కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/షాబాద్:** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి నామినేషన్‌కు స్థానిక కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్ళారు. గురువారం షాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ జన సమీకరతో ర్యాలీగా తరలివెళ్ళారు. టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, టిపిసిసి కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంపిటిసిలు గుండాల అశోక్, మల్లేష్, జయమ్మ, వెంకట్‌రెడ్డి, కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచులు నరేందర్‌రెడ్డి, జనార్థన్‌రెడ్డి, ఖాజామియా పటేల్, కోరి చిన్నయ్య, దర్శనాల బుచ్చయ్య, మహేందర్ గౌడ్, నర్సింలు, బుర్ర ఆంజనేయులు గౌడ్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు మల్లేష్‌తోపాటు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.వెంకటేశ్వర్‌రావు ర్యాలీని ప్రారంభించారు. గురువారం షాద్‌నగర్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని డిఎంహెచ్ డాక్టర్ బి.వెంకటేశ్వర్‌రావు ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలు మలేరియా నిర్మూలనకు పలు విషయాలను ప్రజలకు వివరించారు. ర్యాలీ అనంతరం ఫరూఖ్‌నగర్ ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో షాద్‌నగర్ డివిజన్ స్థాయి వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లకు, ఎంఎల్‌ఎహెచ్‌పి వైద్యాధికారులకు, ఏఎన్‌ఎంలకు, ఆశ వర్కర్లకు మలేరియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మలేరియా వ్యాధిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా వైద్యుడు రాకేష్, డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ , హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులుతోపాటు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోచేరిన వివిధ పార్టీల నాయకులు



ప్రజాపక్షం/కల్వకుర్తి : ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామానికి చెందిన మొండేళ్ల శ్రీనివాసులు , మాధారం మాజీస ర్పంచ్ కాంగ్రెస్ మండలపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీకండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి అబ్దుల్‌సమీ, యువజన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి షైబాజ్, ఎస్సిసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు చాంద్‌పాషా, మన్సూర్, వహీద్, అమీర్, కాంగ్రెస్ నాయకులు, డిఎన్ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## ఇవిఎంల కమీషనింగ్‌ను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఐడిఓసి సముదాయంలోని సమావేశమందిరంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 117 సెక్టోరియల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సెక్టోరియల్ అధికారులకు ఇవిఎంకు సంబంధించి కమీషనింగ్ సీలింగ్‌లపైన అవగాహన కల్పించారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేశ్‌జైవన్ని, జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ పాల్గొని అధికారులకుగల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు ఇవిఎంలకు సంబంధించిపూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ నిబంధనలు తూచ తప్పకుండా కచ్చితంగా పాటించాలని సూచించారు. ఇవిఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.

## ఎంఎల్‌ఏ ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/కల్వకుర్తి : వెల్దండ మండలం కొట్ర గ్రామానికిచెందిన వసంతపు మహేష్‌యాదవ్ బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గురువారం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఎల్‌ఏ కసిరెడ్డినారాయణరెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మహేష్ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

## భరత్‌ను గెలిపిద్దాం

### గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ను గెలిపించి ప్రధానమంత్రి నరేంద్రమోడికి బహుమతిగా ఇద్దామని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌స్థానానికి బిజెపి అభ్యర్థిగా ప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నల్లవెల్లి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహంవద్ద కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. ఈసందర్భంగా భూపేంద్రపటేల్ మాట్లాడుతూ దేశంలో ఆధారంలేని అభాగ్యులకు ఆధారం గ్యారెంటీ నరేంద్రమోడి అన్నారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఎన్నికలలో మోడి కంటే మించిన బలమైన నాయకుడు లేడన్నారు. దేశ వికాసానికి బిజెపి ఒక్కటే ప్రామాణికమని దానికి ప్రధానిగా మోడి మాత్రమే అర్హుడని అన్నారు. కోట్లాదిమందికి ఉచిత రేషన్‌తోపాటు భరోసా కల్పించిన ఘనత నరేంద్రమోడికే దక్కుతుందన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నీతికి నిజాయితికి మారుపేరుగా గత మూడు దశాబ్దాలుగా రాజకీయాలలో ఉన్న పోతుగంటి రాములు ఎంఎల్‌ఏ, ఎంపిగా ఈప్రాంతంలో మంచిపేరు సంపాదించారన్నారు. నాగర్‌కర్నూల్ బిజెపి అభ్యర్థిగా ఆయన కుమారుడు పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను బిజెపి నాగర్‌కర్నూల్ స్థానాన్ని కేటాయించిందని ఆయనను ఎంపిగా గెలిపించి ప్రధానమంత్రి నరేంద్రమోకి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ ఎంపి పోతుగంటి రాములు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ ఎంపి బరిలో తన తనయుడు ఉన్నాడని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, నియోజకవర్గ ఇంచార్జీ దిలీపాచారి, డిసిసిబిడైరెక్టర్ , ఏపి రాష్ట్ర నాయకులు జక్కా రఘునందన్‌రెడ్డిలతోపాటు బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను ప్రకటించడంపై హర్షం



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల్లో ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటించిందని కొల్లాపూర్ తీన్మార్‌మల్లన్న టీ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తీన్మార్ మల్లన్నకు ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటించడంతో గురువారం కొల్లాపూర్ పట్టణకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి టీం సభ్యులు ఆవుల రాజశేఖర్ ఆధ్వర్యంలో పూలమాలవేసి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, కౌన్సిలర్ రహీం, మాజీసర్పంచ్ మేకల నాగరాజు, వీపనగండ్ల అధ్యక్షుడు బీరయ్యాయాదవ్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ, మాలలచైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ మద్దెల రాందాసు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణవేణి విద్యార్థుల ప్రభంజనం



ప్రజాపక్షం/కల్వకుర్తి : 202324 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికిచెందిన శ్రీకృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపిసి ద్వితీయ సంవత్సరంలో ఎం.చంద్రిక 980 మార్కులతో నాగర్‌కర్నూల్ జిల్లా 4వర్యాంకు సాధించింది. ఎంపిసి ప్రథమ సంవత్సరంలో సయ్యద్ అహ్మద్‌ఆలీ 441 మార్కులతో కల్వకుర్తి తాలుకా ప్రథమస్థానంలో నిలిచాడు. ఇంటర్మీడియట్ ఫలితాలల్లో విద్యార్థులు జిల్లా, తాలుకా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ అనంతరాములు, అధ్యాపకులు సత్కరించి అభినందించారు.

# పాలమూరు అభివృద్ధికి ఓటేయండి

### చల్లా వంశీచంద్‌రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః స్థానిక ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి నేతృత్వంలో గురువారం కుర్వ గడ్డపల్లిగ్రామంలో శ్రీ పర్వవేదీశ్వర స్వామి దేవాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భైరంపల్లి శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి కంచనపల్లి, సింగం దొడ్డి, దోనూరు, బోయిన్‌పల్లి గ్రామాలలో కార్యకర్తల, నాయకులు నిర్వహించిన ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు జిల్లాను బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వాలలో ఉండి అభివృద్ధిని చేయకుండా ఆగం చేశారని ఇలాంటి పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కేసిఆర్ ప్రజా సంపదను కొల్లగొట్టి ఖజానాను ఖాళీ చేయడమే కాకుండా ప్రజల నెత్తిన అప్పుబారాన్ని మోపి అడ్డగోలుగా కాకీ కూతలు కూస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని గత పార్లమెంటు ఎన్నికల్లో ఉద్దేర మాటలు చెప్పి గద్దెనెక్కిన నరేంద్రమోడీ ఎందుకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వలేదో చెప్పి ఓట్లు అడగాలని లేకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పాలని బిజెపి అభ్యర్థి డికె అరుణకు డిమాండు చేశారు. అవినీతి, అక్రమాలతో ప్రజలను ప్రాంతాన్ని దోపిడీ చేసి మరింత ఆస్తులు కూడబెట్టుకునేందుకు పాలమూరుకు వచ్చిన డికె అరుణను ఈ ఎన్నికల్లో ప్రజలందరూ ఓడించి బుద్ధిచెప్పాలని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి పార్టీకి ఓటేస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయడమే కాకుండా ప్రజా భద్రత ప్రశ్నార్థకంగా మారి మతం, కులం, ప్రాంతం, పేరిట మారణహోమం సృష్టిస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దొచేవాడికి కిరాయి కొట్టోడు జత అయినట్టుగా నరేంద్ర మోడి, కేసీఆర్ ఒక్కటేనని వీరికి ఓటేస్తే ఆర్ఎస్ఎస్ దొడ్లో వేసినట్టేనని ఆయన తెలిపారు. అందుకే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలందరు సిద్దమై కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడి తనను ఆశీర్వదించి మహబూబ్ నగర్ ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ నాయకులు వెంకట శివ ప్రసాద్, రవి, శ్యాంసుందర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మిడ్జిల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్వాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గౌస్, నర్సింహ, రాజన్న, సుదర్శన్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి , చల్మారెడ్డి, వెంకటయ్య, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని వ్యాఖ్యలు రాజ్యాంగ విలువలకు విరుద్ధం

### కాంగ్రెస్ గెలిస్తేనే ప్రజల సంపదకు గ్యారెంటీ : హనీఫ్ అహ్మద్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని ముస్లింలపై చేస్తున్న వ్యాఖ్యలు భారత స్వాతంత్ర్య స్ఫూర్తికి, భారత లౌకిక రాజ్యాంత విలువలకు విరుద్ధమని తెలంగాణ ఉద్యమనేత ప్రముఖ సామాజిక వేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ అన్నారు. రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని ముస్లింలను టార్గెట్ చేసి మాట్లాడటం ప్రపంచ పౌర సమాజం మోదీ మతోన్మాదం పట్ల నివ్వెర పోతున్నదని, విస్మయం వ్యక్తం చేస్తున్నదని, భారత లౌకిక ప్రజాస్వామ్య వాదులు తీవ్ర కలతచెందుతున్నారని తెలిపారు. దేశంలోని మైనార్టీలపై విషం కక్కడం ప్రధాని స్థాయికి తగదని ఆయన అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ లోని తన కార్యాలయంలో హనీఫ్ అహ్మద్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ గెలిస్తే దేశంలోని సంపద అంతా ముస్లింలకు చెందుతుందని ఒక ప్రధాని స్థాయి వ్యక్తి అబద్ధం చెప్పడం గోబెల్స్ ప్రచారం తప్పా మరొకటి కాదని ఘాటుగా విమర్శించారు. ప్రధాని మోడీ హయాంలో సంపన్నుల ఆస్తులు రెట్టింపు అయ్యాయని, అదే సమయంలో పేదరికం పెరిగిందని తెలిపారు. పేదరికం కారణంగా తాళిబొట్టు తాకట్టు పెట్టే వారి సంఖ్య పెరిగిందని ఇది మోదీ మధ్యతరగతి ప్రజలకు ఇచ్చిన గ్యారంటీనా? అని ప్రశ్నించారు. ప్రజల తిండి , పానియాలపై దుస్తులు, పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ తదితర వస్తువులపై అనేక రెట్లు పన్ను పెంచారని తెలిపారు.

## ఎన్నికల సాధారణ పరిశీలకులకు కలెక్టర్ స్వాగతం

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాకేంద్రానికి చేరుకున్న నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు రుచేష్‌జైవన్షిని అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, సీతారామారావు, వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి నియమించబడిన ఎన్నికల సాధారణ పరిశీలకులుగా రుచేష్‌జైవన్షి ఎన్నికల సరళిని పరిశీలిస్తారని కలెక్టర్ తెలిపారు. సాధారణ పరిశీలకులు ఎన్నికలు ముగిసేవరకు జిల్లాలో అందుబాటులో ఉంటారని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నాగర్‌కర్నూల్ , కల్వకుర్తి, అచ్చంపేట, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల ఎన్నికల పర్యవేక్షణ పరిశీలిస్తారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకై కొనసాగుతున్న ఏర్పాట్ల గురించి జనరల్ అబ్జర్వర్‌కు కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టిన చర్యల గురించి తెలియజేశారు. జనరల్ అబ్జర్వర్ రుచేష్‌జైవన్షి సెల్‌నెం.8790015179 వాట్సాఫ్ ద్వారాకాని మెసేజ్‌రూపంలో అభ్యర్థులు ప్రజలు ఎవరైనా సమాచారం ఇవ్వవచ్చు అన్నారు. ఇమెయిల్‌ఐడి observernaga kurnool@gmail.com మెయిల్ ఐడిద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

## మృతురాలు కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం / శ్రీరంగాపురం : కేంద్రంలోని గంగపుత్ర కాలనీకి చెందిన బొల్లెద్దుల లక్ష్మమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం మండల కాంగ్రెస్ నాయకులు వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తుడి మెగారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా మరణించిన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ మేఘన చేయూత కింద ఆర్థిక సాయం అందజేయాలని ఎమ్మెల్యే మెగారెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి రూ. 5వేలు, నాయకులు శ్రీహరి రాజు రూ. 5వేలు చొప్పున మృతురాలి కుటుంబానికి అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్‌రెడ్డి, సయ్యద్ వాయుద్దీన్ శ్రీహరి, రాజు, మిత్ర బృందం ఈ కురుమన్న , ఆశన్న, టైలర్ అంజి, రాజు, మేస్త్రీ అంజి, ఆంజనేయులు, గంగపుత్ర కాలనీవాసులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.



## కాంగ్రెస్ ప్రజలకు చేసింది ఏమీ లేదు

ప్రజాపక్షం / వీపనగండ్ల : కాంగ్రెస్, బిజెపి పార్టీలకు కనువిప్పు కలగాలంటే పార్లమెంట్ ఎన్నికలలో, బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్, ప్రవీణ్‌కుమార్ గెలుపు చారిత్రక అవసరమని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటి మాజీ చైర్మన్ , కొల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎంపీ ఎన్నికల ఇంచార్జీ డా. ఆంజనేయగౌడ్ అన్నారు. వీపనగండ్ల మండల కేంద్రంలో జరిగిన బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి హాజరైన ఆంజనేయగౌడ్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాంగ్రెస్ సర్కార్ పాలన లో ఒట్లు, బొట్లు తప్ప జనానికి జరిగిందేం లేనేలేదన్నారు. పాత దుర్దినాలను మళ్లీ పాలమూరు ఉమ్మడి జిల్లాకు తీసుకొచ్చిన కాంగ్రెస్ సర్కార్ పై ప్రజలు ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. ఎల్లుండి నాగర్‌కర్నూల్ జననేత కేసిఆర్ రానున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి, మాజీ ఎంఎల్ఏ హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ కమలేశ్వర్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్ కుమార్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. సమావేశంలో పిఏసిఎస్ చైర్మన్ రామన్ గౌడ్ , ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

### పంచాయతీ కార్యదర్శికి సూచించిన డిఆర్‌డిఓ పిడి

ప్రజాపక్షం/బాలానగర్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేయాల్సిన కూలీల సంఖ్య కంటే చేస్తున్న వారి సంఖ్య ఎందుకు తక్కువగా ఉందని, మిగతా వారిపై ఎందుకు ఫోకస్ చేయడం లేదని గౌతపూర్ పంచాయితీ కార్యదర్శి ప్రీతిని జిల్లా డిఆర్డి పిడి ప్రశ్నించారు. గురువారం ఈ మేరకు బాలానగర్ మండల పరిధిలోని గౌతపూర్ గ్రామపంచాయితీలో డిఆర్డి మహబూబ్‌నగర్ పిడి పోలింగు బూతులు, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో 300 మంది ఉపాధి కూలీలు పనిచేస్తుంటే కేవలం 50 మంది మాత్రమే పనికి రావడం తగదని, కూలీల సంఖ్య 150 వరకు పెంచాలని పంచాయితీ కార్యదర్శి ప్రీతికి సూచించారు. అలాగే నర్సరీని మరింతగా అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. ఎంపీడీవో శరత్ చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.




## భూగర్భ జలాల వృద్ధి కోసం ప్రత్యేక చర్యలు

### జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్లంబర్లు, మేస్త్రీలకు ఇచ్చిన 3 రోజుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి వాతావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఎం.డి. సుదర్శర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో భూగర్భ జలాలు ఎండిపోయిన నేపథ్యంతో వాటిని రీఛార్జ్ చేయడానికి జలమండలి పలు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా ట్యాంకర్లు ఎక్కువగా బుక్ చేసుకున్న 30 వేల మంది ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించామని చెప్పారు. ఇందుకోసం 18 ఎన్‌జిఓ సంస్థలకు చెందిన ప్రతినిధులు పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికే వారు 700 మందనికి కలిసి ఇంకుడు గుంతల ప్రాముఖ్యం, నిర్మాణ పద్ధతిని సైతం వివరించినట్లు చెప్పారు. ప్రస్తుతం శిక్షణ పొందిన వారంతా, హైదరాబాద్ నగరంలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలనుకునే వారికి సాంకేతిక సాయాన్ని అందిస్తారన్నారు. హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాల్ని పెంచేందుకు జలమండలి, ఈపిటిఆర్ఐ, జిహెచ్ఎంసి సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణంపై 150 మంది ప్లంబర్స్, మేస్త్రీలకు ఈ నెల 22 నుంచి 3 రోజుల పాటు (22, 24, 25 తేదీల్లో) శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి జాల సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.




## దోమల నివారణకు విస్తృత చర్యలు

### జిహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : దోమల నివారణకు ఎంటమలాజి విభాగం విస్తృతంగా చర్యలు చేపట్టిందని జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ ఎన్.రవి కిరణ్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమాన్ని బేగంపేట సర్కిల్ వెస్ట్ మారేడ్‌పల్లి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రవి కిరణ్, చీఫ్ ఎంటమలాజిస్ట్ డాక్టర్ రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి కిరణ్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న మొత్తం ఎంటమలాజి సిబ్బంది చాలా ఉత్సాహంగా దోమల నిర్మూలన కార్యక్రమంలో తమ విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ వ్యాధులను అరికట్టడంలో ఎంటమలాజి సిబ్బంది ప్రధాన భూమికను పోషిస్తున్నారని, ఎన్నికల నిర్వహణలో కూడా ఎంటమలాజి సిబ్బంది పాత్రను ప్రశంసించారు. రాంబాబు మాట్లాడుతూ 1897వ సంవత్సరంలో డాక్టర్ రోనాల్డ్ రాస్ అనే మిలిటరీ వైద్యుడు ఆడ ఏనాఫిలస్ దోమ ద్వారా మలేరియా వ్యాధి సోకుతుందని వెల్డించారని తెలిపారు. 2008వ సంవత్సరంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ వారి 60వ సమావేశంలో ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్క పౌరుడు మలేరియా వ్యాధి ని ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అవగాహన కల్పించాలని, 2008 ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవంగా గుర్తించడం జరిగిందన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం థీమ్‌లో భాగంగా మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వ్యక్తిగతంగా తీసుకోవాల్సిన చర్యలు, సమాజ పరంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, సికింద్రాబాద్ జోన్ సీనియర్ ఎంటమలాజిస్ట్ దుర్గా ప్రసాద్, బేగంపేట సర్కిల్ అసిస్టెంట్ ఎంటమలాజిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ ధనా గౌడ్, డివిజన్ సూపర్‌వైజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమం కోసం

## సిఎం నిరంతరం కృషి

### నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నట్లు నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల కోసం 18 గంటల పాటు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్కొక్కటి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాణీ స్వీకారం చేసిన రోజే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీని అమలు చేయడం జరిగిందన్నారు. నేను మా మేనత్తకు మద్దతు ఇస్తానని చాలా మంది అనుకుంటూ ఉండొచ్చని, నేను కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలిచానని వేరే పార్టీకి ఎలా మద్దతు ఇస్తానో ఆలోచించాలన్నారు. ఎమ్మెల్సీ కోడ్ వల్ల ఉమ్మడి జిల్లాలో రూ.500 గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు కాలేదన్నారు. ఆరు గ్యారెంటీలు అమలైతే మా పరిస్థితి ఏమిటని ఇతర పార్టీలు ఆలోచిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు తెలిపారు. పార్లమెంటు పరిధిలో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, ఎంపీ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. మహబూబ్‌నగర్ జడ్పిచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి సీఎంకు బహుమతిగా ఇద్దామని కోరారు. గద్వాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య మాట్లాడుతూ హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. వెనుకబడిన జిల్లా అభివృద్ధిలో రావాలంటే, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీలు గెలిస్తే కేంద్రం నుంచి మనకు అనేక నిధులు వస్తాయని తెలిపారు. సమావేశంలో నారాయణపేట జెడ్పిచైర్‌పర్సన్ వనజ, వంశీచంద్‌రెడ్డి, సతీమణి ఆశ్లేషారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు సీజే బెనహర్ లక్ష్మణ్ యాదవ్, రాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌కు భవిష్యత్తులో మనుగడ కష్టం

### మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వంద రోజుల్లో హామీ అమలు చేస్తామని చెప్పి, అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో మనుగడ ఉండదని మాజీ మంత్రి టిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్త సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సాగునీరు లేక పంటలు ఎండి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, ఆయన అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆడవాళ్లు నీళ్ల కోసం బిందెలు తీసుకుని బయటికి వచ్చే దుర్భర పరిస్థితులు దాపురించాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలు పట్టణాల్లో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో స్థానికుడైన మన్నే శ్రీనివాస్‌రెడ్డిని గెలిపిస్తే మహబూబ్‌నగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సభ్యులు మన్నే శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందని ఆయన అన్నారు. మాజీ శాసనసభ్యులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కావని ప్రజలకి అర్థం అయిందన్నారు. కెసిఆర్ బస్సు యాత్రతో కాంగ్రెస్, బిజెపి పార్టీల్లో గుబులు ప్రారంభం అయిందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సాట్స్ మాజీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్టీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యాదయ్య, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డిసిసిబి వైస్ చైర్మన్ వెంకటయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## బిఫాం అందజేసిన కాంగ్రెస్ నేతలు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అభ్యర్థిత్వ బిఫాం పత్రాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రవి నాయక్‌కు నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, గద్వాల , మహబూబ్‌నగర్ , నారాయణపేట జిల్లాల జడ్పీ చైర్మన్లు సరిత, స్వర్ణ సుధాకర్‌రెడ్డి, వనజమ్మలతో కలిసి గురువారం వంశీచంద్‌రెడ్డి సతీమణి చల్లా అశ్లేషారెడ్డి అందజేశారు.

## చివరిరోజు అధిక సంఖ్యలో నామినేషన్లు

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ఏమైనా సందేహాలు, ఫిర్యాదులకు భారత ఎన్నికల సంఘం నియమించిన సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా ఐఎఎస్, మొబైల్ నెంబర్ 9059797275, మెయిల్ నుండి generalobserver011@gmail.com లో ఎన్నికల వ్యయ పరిశీలకులు వరుణ్ రంగ స్వామి ఐఆర్ఎస్, మొబైల్ నెంబర్ 8522875617, మెయిల్ ఐడి vrswamyexpobr11pc.mbnr@gmail.comలో సంప్రదించవచ్చని, నేరుగా సంప్రదించాలనుకునే వారు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అర్ అండ్ బి గెస్టు హౌస్‌లో సంప్రదించవచ్చని వారు తెలిపారు. నామినేషన్‌ల దాఖలు కు గురువారం చివరి రోజు అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. సాధారణ పరిశీలకులు సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఛాంబర్‌లో సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా నామినేషన్ ప్రక్రియాను పరిశీలించారు.

## కెసిఆర్ బస్సు యాత్రతో ప్రభుత్వానికి వణుకు

ప్రజాపక్షం/ బాలానగర్ : తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ బస్సు యాత్రతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వెన్నులో వణుకు మొదలైందని బాలానగర్ మండల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్ విమర్శించారు . తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ముఖ్యమంత్రి కెసిఆర్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. 26 వ తేదీన జరిగే పాలమూరు బస్సు యాత్రకు బీఆర్ఎస్ అభిమానులు , కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు పదేళ్లుగా మాయమాటలతో ప్రజల విద్వేషాలు పెంచుతూ అధికారం చలాయిస్తున్న బిజెపి మోడీ ప్రభుత్వానికి సరైన సమాధానం ఓటు ద్వారా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పనున్నారని బాలు నాయక్ పేర్కొన్నారు ?

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు మండలం మాలపల్లి గ్రామ సమీపంలో శాఖపురం (వై) నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను గురువారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైన అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
కరీంనగర్ | శుక్రవారం | 26 ఏప్రిల్ 2024 | 11

## 114మంది నామినేషన్లు దాఖలు



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:పార్లమెంటు ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల పర్వం గురువారంతో పూర్తయింది. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల దాఖలు చేసే ప్రక్రియలో మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి పూర్తయే నాటికి 114 మంది అభ్యర్థులు 177 నామినేషన్ల పత్రాలను దాఖలు చేసారని జిల్లా ఎన్నికల అధికారి గౌతం తెలిపారు. చివరి రోజైన గురువారం ఏకంగా 61 మంది 91 నామినేషన్లను దాఖలు చేసారని ఆయన తెలిపారు. ప్రధాన రాజకీయ పార్టీలైన బిజెపి తరపున ఈటెల రాజేందర్, బిఆర్ఎస్ తరపున రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ తరపున పట్నం సునీత రెడ్డిలతో పాటు పలు పార్టీల పక్షానే కాకుండా స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలోనే నామినేషన్లు దాఖలు చేసారు.

## ఒక్కసారి గెలిపిస్తే సేవకురాలిలా పనిచేస్తా..



ప్రజాపక్షం/మల్కాజిగిరి: తనను గెలిపిస్తే ప్రజలకు అన్ని వేళలా అందు బాటులోఉంటూసేవకురాలిలాపనిచేస్తే మల్కాజిగిరి ప్రాంతాన్ని ప్రగతి పథంలోకి తీసుకొని వెళతానంటూ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి పట్నం సునీత రెడ్డి అన్నారు. ఆనంద్‌బాగ్‌లోని మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో గురు వారం ఆరు డివిజన్లకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సతీష్ కుమార్, గుండా నిరంజన్, చంద్రశేఖర్, సీల్ యాదగిరి, నాగేందర్ గౌడ్, కొండగౌడ్, జీవన్ రెడ్డి, బికె శ్రీనివాస్, సంపత్‌గౌడ్, ప్రవీణ్, ఉమేష్ సింగ్, వినోద్ యాదవ్, సంతోష్ రాందాస్, సత్యమూర్తి, శంకర్, నాగరాజు, సంజయ్, ఫారూఖ్, షరీఫ్, మంద భాస్కర్, శారద, పుష్పలత, కనక లక్ష్మి, సుజాత, చరణ్ జిత్ గౌడ్, అశోక్, కన్నా, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మోడీ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/దుండిగల్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడి చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు వినతిపత్రం అందచేసిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి,టిపిసిసి ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, టిపిసిసి లీగల్ సెల్ ఛైర్మన్ రామ చంద్ర రెడ్డి ఈ సందర్భంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టో చూసి మోడీ భయపడుతున్నారని, అందుకే ప్రజలను కులాలు, మతాలు, వర్గాలుగా విడగొట్టి రెచ్చగొడుతున్నారని తెలిపారు. బిజేపి పార్టీకి దేశం మొత్తం ఎదురుగాలి వీస్తుందని, అది కప్పిపుచ్చుకోవడానికి మతపరమైన వ్యాఖ్యలు చేస్తూ లబ్ది పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. నరేంద్ర మోడీ, ఆ పార్టీకి చెందిన నాయకులను ప్రచారంలో పాల్గొనకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వికాస్ రాజ్ ను కోరారు.

## ఈటలను మెజార్టీతో గెలిపించాలి



ప్రజాపక్షం/మల్కాజిగిరి: ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సేవ చేసే ఈటెల రాజేందర్‌ను ఎంపిగా భారీ మెజార్టీతో గెలిపించాలంటూ కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో కల్సి మల్కాజిగిరి డివిజన్‌లోని శ్రీకృష్ణ నగర్,విష్ణుపురి కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కల్సుకొని ఈటెలను గెలిపించాలంటూ అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేద కుటుంబాలకు ఉచిత బియ్యం సరఫరా, ఆయుష్మాన్ భారత్, ముద్ర రుణాల్లాంటి అనేక ప్రజా సంక్షేమానికి పథకాలను అందిస్తోందని ఆయన తెలిపారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు అవినీతి, కుంభకోణాలకు మారు పేరన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక బిజెపి నేతలు శరత్ యాదవ్, మురళి, మాధవ్, శ్రీరామ్, రవి, సంతోష్, పవన్, సోమా శ్రీనివాస్, సునీతా యాదవ్, రితూ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విజయం తథ్యం



ప్రజాపక్షం/నవాబుపేట్ : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని ఆర్కతల గ్రామ మాజీ సర్పంచ్ వద్దే రాములు అన్నారు. గురువారం ఆర్కతల గ్రామం నుండి ఎంపీ రంజిత్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి నామినేషన్ కు 200 మందితో బయలు దేరిన మాజీ సర్పంచ్ వద్దే రాములు ఈ సందర్భంగా మాట్లాడుతూ, చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని రంజిత్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను కచ్చితంగా అమలు చేసి తీరుతుందని చెప్పారు.అంగట్లోకి కొత్తగా మారువేషం వేసుకొని మతాలను విభజిస్తూ ఓట్లు అడిగే పార్టీనీ నమ్మే పరిస్థితిలో చేవెళ్ల ప్రజలు లేరని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్వర్యంలో అన్ని పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వద్దె రాములు, గోపాల్ రెడ్డి గోవింద్, కిష్టయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను చెల్లింపులో 5% తగ్గింపు

ప్రజాపక్షం/శామీర్‌పేట : తూంకుంట మున్సిపల్‌లోని గృహ, ఇండస్ట్రి యజమానులకు ఆస్థిపన్ను చెల్లింపులో ఐదు శాతం తగ్గింపు ఇస్తున్నామని ఇట్టి అవకాశాన్ని యజమానులు వినియోగించుకోవాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. గురువారం మున్సిపల్‌లో ఆస్థిపన్ను చెల్లింపుల స్కీమును వెల్లడిస్తూ ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202425కు సంబందించి ఏప్రిల్ 30 లోగా ఆస్థిపన్ను చెల్లించిన వారికి 5 శాతం తగ్గింపు స్కీమును అమలుపరుస్తామని చెప్పారు. ఈ స్కీం గడువు ఇంకా 5 రోజులు మాత్రమే ఉందని ఈ అవకాశాన్ని తూంకుంట పురప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటి ఈఈ సునీత, బిల్ కలెక్టర్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు స్లిప్పులు రానివారు సంప్రదించాలి



ప్రజాపక్షం/శామీర్‌పేట : తూంకుంట మున్సిపల్‌లోని ప్రజలకు ఓటరు స్లిప్పులు రానియెడల బిఎల్‌వోలను సంప్రదించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్, సహయ ఎన్నికల అధికారి ఆర్. వెంకటగోపాల్ అన్నారు. గురువారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 24 బిఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికలు 2024కు సంబంధించి ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పులు చేరవేయాల్సిన భాద్యత బిఎల్‌వోలపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌వోలు, బిఎల్‌వోల సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

## 'నీటికొరత లేకుండా చూడండి'

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా అన్ని గ్రామ పంచాయతీపరిధిలో వేసవి కాలం ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉన్న సందర్భంగా గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాద్యత మీ అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు.దృష్యా మధ్యమం ద్వారా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ ప్రజలకు నీటి కొరత లేకుండా చూడాలని సంబందిత అధికారులను అదేశించారు. ఎక్కడైన నీటి సమస ఏర్పాడితే వేంటనే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని అధికారులను అదేశించారు. పక్షలకు ప్రతి గ్రామంలో ప్లాస్టిక్ పెద్ద బౌల్స ఏర్పాటు చేసి నీటిని నింపి పెట్టాలని ఆదేవిధంగా పశువులకు నీటి తోట్లు శుభ్రం చేసి నీటిని నింపలను అదేశించారు. ఎన్ఆర్‌జిఎష పనుల అంచనా ప్రకారం ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ సరోజు డిపిఓ జయసుద తదితరులు పాల్గోన్నారు.

### నిబంధనలు పాటించండి

ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా వ్యయ పరిశీలకులు రాజీవ్ చబ్రా అన్నారు. వికారాబాద్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. రాజీవ్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల సంబందించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించేందుకు వీలుగా చేపట్టిన ఏర్పాట్లును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అదికారులందరు సమన్వయంతో పని చేస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల ,ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు వచ్చిస్తున్న ఖర్చుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వికారాబాద్ నియోజకవర్గం లో చేపడుతున్న వివిధ అంశాలపై రాహుల్ శర్మ వ్యయ పరిశీలకులు వివరించారు.

# బిజెపి, బిఆర్‌ఎస్‌లను తిప్పికొట్టండి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: మతోన్మాదంతో పెచ్చరిల్లిపోతున్న బిజెపి, పదేళ్ల పాటు ప్రజలను నిలువు దోపిడీతో వంచించిన బిఆర్‌ఎస్‌లను తిప్పి కొడుతూ రాష్ట్రాన్ని నిజమైన ప్రగతే లక్ష్యంగా కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డిని మల్కాజిగిరి స్థానం నుండి భారీ మెజారిటీతో గెలిపించాలంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాల మల్లేష్ కోరారు. గురువారం ఈసిఐఎల్‌లోని పార్టీ కార్యలయం నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో కె.స్వామి అధ్యక్షతన జరిగిన జిల్లా పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి గత రెండు దశాబ్దాలుగా మతోన్మాదాన్ని పెంచి ప్రజల్లో ద్వేష భావాన్ని పెంపొందించిందని, ఇదే పద్ధతిలో ఓట్ల వేటలో ఉందన్నారు. బిజెపి మనువాదాన్ని ప్రవేశపెట్టి దేవంలో చిచ్చు పెట్టి ప్రజలను బానిసలుగా చేసే లక్ష్యంగా కుట్ర చేస్తోందన్నారు.దేశంలో స్వతంత్రంగా పని చేయాల్సిన సిబిఐ, ఈడి లాంటి సంస్థలను తమ స్వప్రయోజనాల కోసం వాడుకొంటూ ప్రశ్నించే గొంతుకలను, ప్రతిపక్షాలను అణచి వేస్తోందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ బిజెపి కారణంగా దేశ సమగ్రత, సమైక్యతకు తీవ్ర భంగం వాటిల్లుతోందని అన్నారు. పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శులు జి.దామోదర్‌రెడ్డి, యు.ఉమామహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్. దశరథ్, రొయ్యల కృష్ణమూర్తి, తోటపల్లి శంకర్, ఎస్. శంకరరావు, కె. ధర్మేంద్ర, జె.లక్ష్మి, రచ్చ కిషన్, హరినాథ రావు, ఎస్ వెంకట్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మలేరియా నిర్మూలనే ధ్యేయం



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : ప్రపంచ మలేరియా దినోత్సవం ను పురస్కరించుకొని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పల్వాన్‌కుమార్ అధ్వర్యంలో డిఎంహెచ్ఓ కార్యాలయంలో మలేరియా అవగాహనా ర్యాలీని జెండిఊపి ప్రారంభించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవం జరుపుకుంటామని , ఈరోజు జిల్లా లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మలేరియా అవగాహన ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని ,2030 నాటికి మలేరియా ను నిర్మూలించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలలో ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన పెరగడం వలన గ్రామాలు, పట్టానాలలో పారిశుద్యం కార్యక్రమాలు మెరుగు పడడం వలన మలేరియా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. వికారాబాద్ గత రెండు సంవత్సరాలుగా ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# నికర లాభాన్ని నమోదు చేసిన ఒలెక్ట్రా

### గత ఆర్థిక సంవత్సరంలో రూ.76.83 కోట్ల లాభం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ (ఓజిఎల్), మార్చి 31తో ముగిసే క్యూ4, పూర్తి సంవత్సర ఏకీకృత ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గురువారం జరిగిన సమావేశంలో డైరెక్టర్ల బోర్డు, ఫలితాలను అధికారికంగా ఆమోదించింది. ఈ ఆర్థిక సంవత్సరం 2023/24లో కంపెనీ మొత్తం 8,232 ఎలక్ట్రిక్ వాహనాల ఆర్డర్‌లను అందుకుంది. ఇందులో 3,000 బస్సులు బెస్ట్ ముంబై తిరిగి ఆర్డర్ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కంపెనీ దేశంలో 10,000 ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్ బుక్ మైలురాయిని అధిగమించింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో 131 ఎలక్ట్రిక్ వాహనాల డెలివరీలతో సహా కంపెనీ ఇప్పటి వరకు 1,746 ఎలక్ట్రిక్ వాహనాలను డెలివరీ చేసింది. కంపెనీ వద్ద ప్రస్తుతం 10,969 బస్సు ఆర్డర్లు ఉన్నాయి. బలమైన డిమాండ్ కొనసాగుతోంది.

### మార్చి 31,2024తో ముగిసే పూర్తి సంవత్సరపు పనితీరు ముఖ్యాంశాలు

2023/24 ఆదాయం రూ.1154.14 కోట్లు, 5.8 శాతం పెరిగింది. కంపెనీ ఇబిఐటిడిఎ పూర్తి సంవత్సరంలో రూ.185.51 కోట్లకు చేరుకుంది. ఇది మునుపటి సంవత్సరంతో పోలిస్తే 20.5 శాతం పెరుగుదలను సూచిస్తుంది. పిబిటి రూ.105.78 కోట్లకు పెరిగింది. ఇది గత ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే 18.3 శాతం పెరుగుదల. పిఎటి గత ఆర్థిక సంవత్సరం రూ.65.59 కోట్లతో పోలిస్తే 17.1 శాతం పెరిగి, రూ.76.83 కోట్లుగా ఉంది. ఫలితాలపై ఒలెక్ట్రా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ప్రదీప్ మాట్లాడుతూ, 2023 24 పూర్తి సంవత్సరానికి మా ఏకీకృత రాబడి, లాభదాయకతలో బలమైన పురోగతిని సాధించినందుకు సంతోషిస్తున్నామన్నారు. తమ తయారీ సామర్థ్యాన్ని పెంచడం, సాంకేతిక సామర్థ్యాలను మెరుగుపరచడంపై దృష్టి కొనసాగుతుందన్నారు.




## కాంగ్రెస్‌కు షాక్ ఇచ్చిన గోపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/నవాబుపేట్: పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి ఆ పార్టీ సీనియర్ నాయకులు రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ పులిగారి గోపాల్ రెడ్డి షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ కు ఆయన రాజీనామా చేసి తన రాజీనామా లేఖను పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చెల్లా నర్సింహా రెడ్డికి, నవాబ్ పేట్ మండల పార్టీ అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్యకు తన రాజీనామా పత్రాన్ని పంపించారు. తన ఆరోగ్యం సహకరించకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీకి విడుతున్నట్లు చేస్తున్నట్లు రాజీనామా పత్రంలో పులుగారి గోపాల్ రెడ్డి రాసుకొచ్చారు. ఇన్నాళ్లు కాంగ్రెస్‌లో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని పేర్కొన్నారు.

### ఆరోగ్యం బాగాలేక పార్టీకి రాజీనామా చేశారా...?

రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీగా కొనసాగుతున్న పులిగారి గోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకీ రాజీనామా చేయడానికి ఆరోగ్యం బాగాలేక పోవడమే కారణమా...? తనకు పార్టీలో ఇన్నాళ్లుగా ఉన్నా సరైన గుర్తింపు లేకనే పార్టీకి రాజీనామా చేశారా..?పార్టీకి రాజీనామా చేయడంలో ఆంతర్యం ఏమిటో అనేది మాత్రం రాజీనామా చేసిన వ్యక్తికి మాత్రమే తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి కమలం లేదా కారు పార్టీలో చేరుతారా లేదా అనే విషయం రేపో.. మాపో తెలుస్తుంది.

## నాగారంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

ప్రజాపక్షం/నాగారం: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శిల్పానగర్ కాలనీలో శ్రీ వెంకట చంద్రమౌళీశ్వర హనుమాన్ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు రెండవ రోజు ఆలయ చైర్మన్,7వ వార్డు కౌన్సిలర్ గూడురు సబితాఅంజనేయులుగౌడ్, ప్రధాన కార్యదర్శి 6వ వార్డు కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.5వ వార్డు కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, ఆలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చండి

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే అనంద్ అధ్వర్యంలో వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ని ధన్నారం గ్రామ పొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లడి బాగోగులు తెలుస్కున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల తరపున డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హమీలు అమలు కాక రైతులు గోసపడుతున్నారని తెలియజేశారు. మద్దతు ధరతో పాటు 500ల బోనస్ ,2లక్షల రుణమాఫీ ఎకరానికి 15వేల రైతుబంధు వెంటనే అమలు చేయాలని అన్నారు. పులుసుమామిడిలో శ్రీహనుమన్ విగ్రహ ప్రతిస్థాపాన కార్యాక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కామల్‌రెడ్డి అధ్వర్యంలో పూజకార్యక్రమంలో పాల్గోన్నారు.

## సకాలంలో ఓటర్లకు స్లిప్పులివ్వండి

ప్రజాపక్షం/నాగారం: సకాలంలో ఓటర్ స్లిప్పులను అందజేయాలని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ అన్నారు.గురువారం నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో బిఎల్ఓతో కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు.ప్రతి ఓటరుకు స్లిప్పులను అందజేయాలని బిఎల్ఓలకు ఆదేశాలు జారీ చేశారు.

## సునీతా గెలుపు... అభివృద్ధికి మలుపు



### మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ తోటకూర వజ్రేష్‌యాదవ్

ప్రజాపక్షం/జవహర్‌నగర్:సునీతా గెలుపు మల్కాజిగిరికి మలుపులాంటిదని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు మేలు జరుగుతుందని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సునితామహేందర్‌రెడ్డి గెలుపును కోరుతూ జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరయ్యారు.వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి 60ఏళ్ళు వెనక్కిపోయిందని, కోట్లాడి సాధించుకున్న తెలంగాణలో సబ్బండ వర్గాలు అణిచివేయబడ్డాయని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునితామహేందర్‌రెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి చెందుతుందని తెలిపారు. అనంతరం 6వ డివిజన్ కార్పొరేటర్ పల్లపు రవి ఆధ్వర్యంలో వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో 300కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# 'నోరు అదుపులో పెట్టుకో..'




ప్రజాపక్షం/శామీర్‌పేట : రేవంత్‌రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న కేటిఆర్ నిజాలు తెలుసుకుని మాట్లాడాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఇటీవల తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ సభలో రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై ఏ బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి స్పందించారు. గురువారం శామీర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై బిఆర్ఎస్ నాయకులు చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా అవినీతి అక్రమాలు చేసుకుంటు డబ్బులు సంపాదించడమే ధ్యేయంగా బిఆర్ఎస్ పాలన సాగిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందజేశామని, మహిళలు రూ. 500కే గ్యాస్ సిలిండర్, రైతులకు ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు రైతుబంధు, రైతు బీమా, ఆరోగ్యశ్రీని రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామని చెప్పారు. మీ ప్రభుత్వ హయాంలో ఉచిత విద్యుత్, డబుల్ బెడ్‌రూమ్‌లు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు నిరుద్యోగ బృతి, ఇచ్చారా అని ప్రశ్నించారు. మీ ఆడపడుచు కవిత లిక్కర్ దందా చేసి జైలులో ఉన్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నీ బావ హరీష్ కాకతీయ మిషన్‌లలో కమీషన్‌లు తీసుకోలేదా.. నువ్వో తిరుగుబోతు మీ అయ్యా ఓ తాగుబోతు అని ఎద్దేవ చేశారు. బిఆర్ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్‌లు రావని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని మీ దుకాణం బంద్ అయ్యిందని ఈ ఎన్నికల తర్వాత అందరు జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేసేటప్పుడు మీ గతం గుర్తు చేసుకోవాలని హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రటరి భరత్‌కుమార్, ఎస్‌సి సెల్ మండల ప్రసిడెంట్ ఊరడి వెంకటేష్, గ్రామశాఖ అధ్యక్షులు సతీష్‌యాదవ్, సీనియర్ నాయకులు తుంకి స్వామి, భూపాల్, కరుణాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

ప్రజాపక్షం / కొడంగల్ : దేశంలో ఎవ్వరు ఎన్ని కుట్రలు వేసిన అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని కొడంగల్ మండల ఎంపీపీ ముద్దప్ప దేశ్ముఖ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అప్పాయిపల్లి, ఊడిమేశ్వరం, చిట్లపల్లి, ఖాజాహైమాద్‌పల్లి, అంగడిరాయిచూర్ రాష్ట్రంలో మన నాయకుడు అధికారంలోకి రావడం ముఖ్యమంత్రి కావడం మనకు ఎంతో శుభసూచికమన్నారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో మన కొడంగల్ ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. అలాంటప్పుడు ఇతర పార్టీలకు ఓటు ఎందుకు వేయాలో చెప్పాలన్నారు. మెడికల్ కాలేజీలు, నర్సిం గ్ కాలేజీలు, పారామెడికల్ కాలేజీలు, వెటినరీ కాలేజీలు, నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం, రైల్వే లైన్, సిమెంట్ ఫ్యాక్టరీ, ఫార్మ కంపెనీలు ఇలా అనేక రకాలుగా అభివృద్ధి జరుగుతుందన్నారు.టీపీసీసీసభ్యులుమహ్మద్ యూసుఫ్, కొడంగల్ మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మెన్ ఉషారాణి, పిఎసిఎస్ చైర్మెన్, ఆర్య వైశ్య జిల్లా అధ్యక్షుడు కట్కం శివకుమార్‌గుప్త, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి, మిఠాయిరాజు, రాము, సాయి, అచ్చకుంట్ల శ్రీకాంత్, చిట్లపల్లి గ్రామ సర్పంచ్ వెంకట్‌రెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.


# కొడంగల్‌లో ఆగని ఇసుక అక్రమ రవాణా

### రాజకీయ నాయకులు,పోలీసుల అండదండలు
### నామమాత్రంగా ఒక ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ప్రజాపక్షం / కొడంగల్: కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో అక్రమ ఇసుక రవాణా యథేచ్చగా సాగుతుంది. గురువారం ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి పోలీసులు స్పందించి నామమాత్రంగా ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. తాండూర్ నుంచి కొడంగల్ నియోజకవర్గానికి నిత్యం అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్‌లు నడుస్తున్న కూడా పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేకపోతున్నారు. ప్రత్యక్షంగా ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారం ఇస్తున్న కూడా పోలీసులు స్పందించకపోగ, అక్రమ వ్యాపారులు స్థానికులపై ఆగ్రహం వ్యక్తం చేస్తు నోటికి వచ్చిన భూతులు తిడుతుడు ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు పట్టిస్తారా.. ! అంటు బెదిరింపులకు గురి చేస్తున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ వ్యాపారాలు చేసే వారికి పోలీసులు ఎందుకు వత్తాసు పలుకుతున్నారని వాపోతున్నారు. తాండూర్‌లో ఉండే నాయకులు అధికారులతో చర్చించి ఇసుక రవాణాకు అనుమతులు ఇచ్చారని అలాంటప్పుడు ఆపే దమ్ము ధైర్యం ఎవ్వరు ఇచ్చారని బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇంత జరుగుతున్న పోలీసుల కళ్ల ముందే ట్రాక్టర్‌లు నడుస్తున్న పట్టించుకోకుండా అక్రమ వ్యాపారులకు మద్దతు ఇస్తున్నారంటు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దీనిపై పోలీసు ఉన్నాతాధికారులు స్పందించి అక్రమ రవాణాకు కళ్లెం వేస్తారా.. లేకా అక్రమార్కులకే వత్తాసు పలుకుతారా వేచి చూడాల్సిందే....!

## 'ఓటు హక్కు వినియోగించుకోండి'




ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌పై ప్రజల్లో ఉన్న క్రేజ్‌ను వినియోగించుకొంటూ మేడ్చల్ జిల్లా ఎన్నికల నిర్వహణాధికారులు ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ జరిగే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాన్ని విన్నూత పంథాలో ఓటు వేయాలంటూ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కార్యక్రమాలతో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు గాను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుండి జిల్లా కలెక్టర్, ఎన్నికల నిర్వహణాధికారి గౌతం ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. దీనిలోని భాగంగా గురువారం ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న ఉప్పల్ స్టేడియాన్ని వేదికగా ఏర్పాటు చేసుకొన్నారు. ఆయన ఆదేశాల మేరకు నోడల్ అధికార్లు, సిబ్బంది పలు బృందాలుగా ఏర్పాటు చేసుకొని స్టేడియం లోపల, బయట మ్యాచ్ వీక్షకులను కల్సుకొంటూ ఓటు ప్రాధాన్యతను వివరించారు. క్రికెట్ వీక్షకులతో పాటు సమీప ప్రాంతాల్లో కనపడే విధంగా ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియచేసే విధంగా రూపొందించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, స్టాండ్లు, బోర్డులను ఏర్పాటు చేసారు. ఓటు వేయటమనేది దేశ భవిష్యత్తును నిర్ణయించేదని, ఎన్నికల పర్వం దేశానికి గర్వ కారణమని, కొత్తగా నమోదు చేసుకొన్న యువ ఓటర్లు తప్పని సరిగా తమ తొలి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటు వేసే విధంగా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ చైతన్య పరిచే విధంగా వివరిస్తూ నినాదాలు చేసారు.

## అధైర్యపడొద్దు..



ప్రజాపక్షం/నవాబుపేట్: అధైర్యపడకండి అండగా ఉంటానని మృతి చిందిన కాలే అమృతమ్మ కుటుంబాని పామేనా భీం భరత్ అన్నారు. గురువారం నవాబుపేట్ మండలంలోని చించల్ పేట గ్రామానికి చెందిన కాలే అమృతమ్మ భర్త రాంచంద్రయ్య నిన్న రాత్రి స్వర్గస్తు లైన విషయం తెలుసుకొని చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జి పామేనా భీమ్ భరత్ హాజరై వారి పార్థివ దేహాన్ని పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం తెలిపారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు చింపుల సత్య నారాయణ రెడ్డి, మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, వైస్ ఎంపిపి కౌకుంట్ల బందయ్య గౌడ్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు పాండు రంగా రెడ్డి, సాయి కుమార్‌పాల్గొన్నారు.

## క్రీడ



# అదరగొట్టిన బెంగళూరు.. ఎట్టకేలకు రెండో విజయం

**హైదరాబాద్:** ఎట్టకేలకు బెంగళూరుకు రెండో విజయం. హైదరాబాద్‌తో జరిగిన పోరులో ఆ జట్టు 35 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. కోహ్లి (51), రజత్ పటిదార్ (50) అర్ధశతకాలతో చెలరేగారు. గ్రీన్ (37), డుప్లెసిస్ (25) రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో ఉనద్కత్ 3, నటరాజన్ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 171 పరుగులకే పరిమితం అయింది. షాబాజ్ అహ్మద్ (40*) టాప్ స్కోరర్. అభిషేక్ శర్మ (31), కమిన్స్ (31) చెలరేగారు. బెంగళూరు బౌలర్లలో స్వప్నిల్ సింగ్ 2, కర్ణ్ శర్మ 2, గ్రీన్ 2, జాక్స్ 1, దయాల్ 1 వికెట్ తీశారు.

# టి20 వరల్డ్‌కప్‌లో ఎవరికి చోటు దక్కేనో?




**న్యూఢిల్లీ :** ఐసిసి టి20 వరల్డ్‌కప్‌కు 15 మంది ప్లేయర్‌లతో స్క్వాడ్‌ను ప్రకటించాల్సిన సమయం ఆసన్నమవుతోంది. మే 1లోగా టీమ్‌ను అనౌన్స్ చేయాలని ఐసిసి విధించిన గడువు సమీపిస్తోంది. బిసిసిఐ ఈ వారం చివరిలో లేదా వచ్చే వారం ప్రారంభంలో ఎప్పుడైనా స్క్వాడ్‌ను ప్రకటించవచ్చు. త్వరలో కెప్టెన్ రోహిత్ శర్మ సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ సమావేశమై చర్చించే అవకాశం ఉంది. అయితే ఐపిఎల్‌లో చాలా మంది ఆటగాళ్లు తమ ప్రదర్శనతో టి20 టీమ్ సెలక్షన్‌గా గట్టి పోటీ ఇస్తున్నారు. ఒక ప్లేస్ కోసం ఇద్దరి కన్నా ఎక్కువ మంది ప్రయత్నిస్తున్నారు. ఈ సమయంలో కెప్టెన్, సెలక్షన్ కమిటీ ఎవరిని ఎంపిక చేసుకుంటుంది, ఎలాంటి స్ట్రాటజీ అమలు చేస్తుందనే దానిపై భిన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**రాహుల్ x సంజూ శాంసన్:** టీ20 జట్టులో మొదటి కీపింగ్ బ్యాటర్ ఆప్షన్‌గా పంత్ చోటు దక్కించుకోవచ్చు. పంత్ 161 స్ట్రైక్ రేట్‌తో 342 పరుగులతో అత్యధిక పరుగుల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. కీపింగ్, బ్యాటింగ్‌లో అదరగొడుతున్నాడు. అయితే సెకండ్‌కీపర్ స్లాట్ రాహుల్, సంజూ శాంసన్ మధ్య పోటీ నెలకొంది. రాహుల్ ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లలో 141 స్ట్రైక్ రేటుతో 302 పరుగులు చేశాడు. మరోవైపు శాంసన్ 8 గేమ్‌లలో 152 స్ట్రైక్ రేటుతో 314 రన్స్ కొట్టాడు. అయితే మిడిల్ ఆర్డర్ ఎక్స్‌పీరియన్స్, రేంజ్ ఆఫ్ షాట్స్ కారణంగా సంజూ కంటే రాహుల్‌కు అవకాశాలు ఎక్కువ ఉన్నాయి.

**పాండ్యా వర్సెస్ శివమ్ దూబె:** ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా బ్యాటింగ్ ఫామ్ సెలెక్షన్ ప్యానెల్‌కు ఆందోళన కలిగిస్తోంది. పాండ్యా ఎంఐ తరఫున 8 మ్యాచ్‌లలో 17 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఫినిషర్ రోల్‌లో వచ్చి 7 సిక్సర్లు మాత్రమే కొట్టాడు. ఇప్పటివరకు లీగ్‌లో 142 స్ట్రైక్‌రేట్ తో చేసిన 150 పరుగులు ఆకట్టుకోలేదు. అయితే టీ20 అవకాశం కోసం ఎదురుచూస్తున్న శివమ్ దూబే, చెన్నై తరఫున బౌలింగ్ చేయలేదు. దీంతో సెలక్టర్లు పాండ్యాకు ఓటు వేయవచ్చు. స్కిల్, పేస్ పరంగా దూబే పాండ్యాకు పోటీ రాలేదు. అయితే దూబె ప్రస్తుత బ్యాటింగ్ ఫామ్ (8 మ్యాచ్‌లలో 22 సిక్సర్లు)ను విస్మరించలేం.

**బిష్ణోయ్ వర్సెస్ అవేష్ వర్సెస్ అక్షర్:** ఐదుగురు బౌలర్లుగా జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌కు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. బుమ్రా, కుల్దీప్ మినహా ఇతర బౌలర్లు గొప్ప ఫామ్‌లో లేరు. అందువల్ల అదనపు బౌలర్ ఎంపిక అవసరం. రాజస్థాన్ రాయల్స్ పేసర్ అవేశ్, ఢిల్లీ క్యాపిటల్స్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ అక్షర్, లఖ్‌నవూ సూపర్ జెయింట్ లెగ్ స్పిన్నర్ బిష్ణోయ్ మధ్య త్రిముఖ పోరు నెలకొంది. డెత్ బౌలింగ్ విషయానికొస్తే, అవేష్, 9.41 ఎకానమీ రేట్‌తో ఎనిమిది వికెట్లు సాధించాడు.
బిష్ణోయ్ ఐదు వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. అయితే ఫ్లాట్ ట్రాక్‌లలో, అతని ఎకానమీ 8.47 ఆకట్టుకుంటోంది. ఏడు మ్యాచ్‌లు ఆడిన అక్షర్ పటేల్ 7 వికెట్లు తీశాడు. 7.06 ఎకానమీతో బౌలింగ్ చేశాడు. పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే అక్షర్ తెలివైన ఎంపిక అవుతాడు. పైగా బ్యాట్‌తో కూడా రాణించగలడు. తాజాగా గుజరాత్ టైటాన్స్‌పై 43 బంతుల్లో 66 పరుగులు చేశాడు.

# ధావన్ ఎప్పుడు తిరిగొస్తాడంటే?

**న్యూఢిల్లీ :** ఐపిఎల్ 2024లో పెద్దగా ఆకట్టుకోని టీమ్‌లలో పంజాబ్ కింగ్స్ కూడా ఉంది. ఢిల్లీపై విజయంతో టోర్నీని ప్రారంభించిన పంజాబ్ కింగ్స్ ఆ తర్వాత ఒక్క మ్యాచ్‌లో మినహా అన్నీ ఓడిపోయింది. ఏప్రిల్ 26న కోల్‌కతాలో కెకెఆర్‌తో పంజాబ్ తలపడుతోంది. ప్లేఆఫ్స్ రేసులో ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌కు కెప్టెన్ శిఖర్ ధావన్ అందుబాటులో ఉంటాడని ఆశించిన ఫ్యాన్స్‌కు నిరాశే మిగిలింది. చెన్నై మ్యాచ్‌కు ఫిట్‌గా ధావన్ 38 ఏళ్ల శిఖర్ ప్రస్తుత లీగ్‌లో చివరిసారిగా ఏప్రిల్ 9న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్ ఆడాడు. అప్పటి నుంచి గాయంతో దూరంగా ఉండటంతో, పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా సామ్ కరన్ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ధావన్ ఎంట్రీపై పంజాబ్ స్పిన్ బౌలింగ్ కోచ్ సునీల్ జోషి రియాక్ట్ అయ్యాడు. ధావన్ కోలుకుంటున్నాడని, మే 1న చెన్నై మ్యాచ్‌కు తిరిగి రావచ్చని చెప్పాడు.



## రీల్

# హీరోయిన్ తమన్నా పై కేసు

ఇప్పుడు పాన్ ఇండియా సినిమా దగ్గర మంచి ఆదరణ ఉన్న హీరోయిన్స్‌లో మిల్కీ బ్యూటీ తమన్నా కూడా ఒకరు. పలు వెబ్ సిరీస్‌లలో ఎక్కువగా కనిపిస్తున్న తమన్నా రీసెంట్ గా అయితే సూపర్ స్టార్ జైలర్ లో కనిపించింది. అలాగే మరో పక్క కన్నడ చిత్రం బాక్ తో ఈ మేలో రాబోతుంది. అయితే తమన్నా వీటితో పాటుగా పలు ఎండోర్స్ మెంట్స్‌కి కూడా ప్రమోట్ చేస్తుంది అని తెలిసిందే. ఇప్పుడు అలా చేసిన ఓ ప్రమోషన్ ఆమెపై కేసు పడేలా చేసింది. ఇక మరిన్ని వివరాల్లోకి వెళితే ప్రస్తుతం భారతదేశంలో మోస్ట్ పాపులర్ క్రికెట్ ఫార్మాట్ ఐపీఎల్ జరుగుతున్నా సంగతి తెలిసిందే. అయితే దీనికి అధికారికంగా ప్రసారం చేసే హక్కులు బుల్లితెరపై స్టార్ సంస్థకి ఓటిటిలో జియో, వియాకామ్ 18 అనుబంధ జియో సినిమా యాప్‌లో మాత్రమే చూసే అవకాశం ఉంది. అయితే ప్రస్తుత ఆధునిక యుగంలో వీటికి కూడా అనధికారికంగా స్ట్రీమ్ చేసే ఎన్నో ఇతర మాధ్యమాలు ఉన్నాయి. మరి వీటిలో ఓ బెట్టింగ్ యాప్ ఫేయిర్ ప్లే అనే యాప్ ని ఆమె ప్రమోట్ చేస్తూ అందులో కూడా ఐపీఎల్ ని చూడొచ్చని ప్రమోట్ చేసింది. దీనితో ఇలా ఎలా ప్రమోట్ చేస్తారని వియాకామ్ 18 వారు మహారాష్ట్ర కోర్టుకెక్కారు. దీనితో ఆమెపై ఇప్పుడు సైబర్ కేసు నమోదు అయ్యింది. దీనితో ఆమె ఈ ఏప్రిల్ 29 లోపు వివరణ ఇవ్వాల్సిందిగా సమన్లు జారీ చేసినట్టుగా తెలుస్తుంది. మరి దీనిపై తమన్నా ఏం చేస్తుందో చూడాలి.

# సుహాస్ కోసం సలార్ మేకర్స్.!

మన టాలీవుడ్ లో మంచి టాలెంట్ కలిగిన యువ నటుల్లో సుహాస్ కూడా ఒకడు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ ఇప్పుడు మెయిన్ లీడ్ లో ఆసక్తికర కాన్సెప్ట్ ఉన్న సినిమాల్లో నటిస్తున్న తన నుంచి ఈ మే లో రిలీజ్‌కి రాబోతున్న చిత్రమే ప్రసన్నవదనం. దర్శకుడు అర్జున్ వై కే తెరకెక్కించిన ఈ చిత్రం టీజర్‌తోనే మూవీ లవర్స్‌లో మంచి ఆసక్తి రేపింది. అయితే ఈ సినిమా రిలీజ్‌కి మంచి డిమాండ్ కనిపిస్తుంది. మన తెలుగులో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్ ఎల్ ఎల్ పి వారు రిలీజ్ చేస్తుండగా కర్ణాటకలో ఈ చిత్రాన్ని సలార్, కేజీయఫ్ సినిమా నిర్మాణ సంస్థ హోంబళే ఫిలమ్స్ వారు రిలీజ్ చేస్తుండడం విశేషం. దీనితో సుహాస్ సినిమాకి మాత్రం మంచి రిలీజ్ నే రెండు రాష్ట్రాల్లో దక్కింది అని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణన్ అలాగే రాశి సింగ్ తదితరులు నటిస్తుండగా విజయ్ బుల్గానిన్ సంగీతం అందించాడు అలాగే జె ఎస్ మణికంఠ, టి ఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మాణం వహించారు.





# మహేష్ బాబు డబుల్ బొనాంజా

లెటర్బాక్స్డ్ అనేది సినీ ప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అవసరం లేని పేరు. అత్యంత ప్రజాదరణ పొందిన సినిమాలను చర్చించడానికి, రేట్ చేయడానికి మరియు సమీక్షించడానికి ఈ ప్లాట్ఫారమ్ ఉపయోగపడుతుంది. ఇటీవల లెటర్బాక్స్డ్ లో అత్యధిక అభిమానుల ఆదరణ చూరగొన్న టాప్ 100 చిత్రాల జాబితాను ప్రకటించింది, ఇది 2024 వరకు సంవత్సరానికి అత్యధిక అభిమానుల నిష్పత్తితో ర్యాంక్ చేయబడింది. ఇంట్రెస్టింగ్ విషయం ఏమిటంటే, ఈ 100 చిత్రాలలో 4 తెలుగు చిత్ర పరిశ్రమకు చెందినవి మరియు అభిమానుల నుండి అపారమైన ప్రేమను పొందినవి కావడం విశేషం. ఈ చిత్రాలలో అతడు (42వ ర్యాంక్), జెర్సీ (57వ ర్యాంక్), సాగర సంగమం (75వ ర్యాంక్), ఖలేజా (85వ ర్యాంక్) అందుకున్నాయి. ముఖ్యంగా, వీటిలో రెండు చిత్రాలలో సూపర్ స్టార్ మహేష్ బాబు నటించారు, మరియు మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ రెండింటికీ దర్శకత్వం వహించారు. దీని ద్వారా మహేష్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ ఎవర్ గ్రీన్ అని మరోసారి రుజువైంది. బాక్సాఫీస్ వద్ద అతడు మంచి హిట్ అయినా ఖలేజా మాత్రం ఆకట్టుకోలేదు. అయినప్పటికీ కూడా ఇవి టివిలో ప్రసారం అయిన ప్రతి సారి మంచి రేటింగ్స్ అందుకుంటుంటాయి. ఇక తాజాగా మహేష్, త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన గుంటూరు కారం థియేటర్స్ లో మంచి విజయం అందుకోగా అనంతరం ఓటిటి ప్లాట్ఫారమ్ నెట్ఫ్లిక్స్లో విడుదలై మరింత గణనీయమైన ఆదరణ సంపాదించుకుంది. భవిష్యత్తులో మరొకసారి ఈ ఇద్దరి క్రేజీ కాంబినేషన్లో ఆకట్టుకునే మూవీ రావాలని ఫ్యాన్స్, ఆడియన్స్ కోరుతున్నారు.

# హోటల్‌లో అగ్నిప్రమాదం

## ఆరుగురు సజీవ దహనం



**పాట్నా/న్యూఢిల్లీ :** బీహార్‌లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. పాట్నా రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఆరుగురు సజీవదహనమయ్యారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నట్లు పోలీసు తెలిపారు. పాట్న జంక్షన్ సమీపంలో ఉన్న హోటల్‌లో గురువారం ఉదయం 11 గంటలకు మంటలు చెలరేగాయని, దాదాపు 20 మంది చిక్కుకుపోయారని ఎస్‌పి చంద్రప్రకాశ్ తెలిపారు. ఘటనాస్థలిలో నిర్వహించిన రెస్క్యూ పనులను ముగించామన్నారు. మొత్తం ఆరుగురు మృతి చెందగా, తీవ్ర గాయాలైన మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. వారికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామి చెప్పారు. మృతులను, తీవ్రంగా గాయపడిన వారిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని, వారి కుటుంబ సభ్యులకు కూడా సమాచారం అందిస్తామన్నారు. అయితే అగ్నిప్రమాదానికిగల కారణాలను కచ్చితంగా చెప్పలేమన్నారు. ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారని, వారి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌పి పేర్కొన్నారు.

**పివిసి పైప్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం**

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కాళింది కుంజ్ సమీపంలోని దోభీ ఘాట్ వద్ద ఓ పివిసి పైప్ తయారీ ఫ్యాక్టరీలో గురువారం ఈ దుర్ఘటన జరిగింది. అగ్నిప్రమాదంతో ఫ్యాక్టరీ నుంచి పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించింది. ఐదు అగ్నిమాపక యంత్రాలను ఘటనా స్థలానికి అధికారులు రప్పించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనకు కారణాలు, ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా వెలుగుచూడలేదు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయని అధికారులు చెబుతున్నారు.

# ఎన్నికల ప్రచారానికి సునీత కేజ్రీవాల్..!



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత.. ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఢిల్లీ తూర్పు లోక్‌సభ స్థానం నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి అభ్యర్థిగా కులదీప్ కుమార్ బరిలో దిగారు. ఆయనకు మద్దతుగా ఆ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కొండ్లి అసెంబ్లీ స్థానం నుంచి ఈ వారంతంలో ఎన్నికల ప్రచారానికి సునీత కేజ్రీవాల్ శ్రీకారం చుట్టనున్నారు. ఇక ఈ ఎన్నికల్లో ఢిల్లీలో ఆప్, కాంగ్రెస్ పార్టీతో జత కట్టింది. దాంతో పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, న్యూఢిల్లీ లోక్‌సభ స్థానాల్లో ఆప్ తన అభ్యర్థులను బరిలో దింపింది. అలాగే ఈశాన్య ఢిల్లీ, వాయువ్య ఢిల్లీ, చాందినీ చౌక్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ.. తన అభ్యర్థులను రంగంలోకి దింపింది. దీంతో ఢిల్లీలోని లోక్‌సభ అభ్యర్థుల తరఫున సునీత ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. అలాగే సునీత గుజరాత్, పంజాబ్‌ల్లో సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. ఇక గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా సునీత పేరును ఇప్పటికే ఆ పార్టీ ప్రకటించిన విషయం విధితమే మార్చి 21వ తేదీన ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఇడి అరెస్ట్ చేసింది. ఆ క్రమంలో ఆయన తీహార్ జైల్లో ఉన్నారు. మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా ఇండియా కూటమి ఏర్పాటు చేసిన ర్యాలీల్లో సైతం సునీత పాల్గొంటున్నారు. కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ అరెస్ట్‌కు నిరసనగా గత ఆదివారం.. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఇండియా కూటమి ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో సునీత పాల్గొన్నారు.

## లాయర్లకు వాట్సాప్‌లోనే కేసు లిస్టుల సమాచారం

# డిజిటలైజేషన్‌లో సుప్రీంకోర్టు మరో ముందంజ

### ఇక కాగితంతో పని చాలా తక్కువే సిజెఐ చంద్రచూడ్ ప్రకటన




**న్యూఢిల్లీ :** భారత సర్వోన్నత న్యాయస్థానం డిజిటలైజేషన్ దిశగా గురువారంనాడు మరో ముందడుగు వేసింది. ఇకమీదట సుప్రీంకోర్టులో విచారణకు రాబోయే కేసుల జాబితాలు, కేసులు దాఖలు చేసిన వివరాలు వంటివన్నీ న్యాయవాదులకు వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం లభ్యమవుతూ ఉంటుంది. భారతప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఈ ప్రకటన చేశారు. ఈ చర్య సుప్రీంకోర్టు పనివిధానంలో అతిపెద్ద ప్రభావం చూపించగలదని ఆయన అన్నారు. పనులు చేయడంలో మనకు ఉండే అలవాట్లపైన కూడా ఈవాట్సాప్ తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. అదేవిధంగా కాగితం వాడకానికి గరిష్టస్థాయిలో స్వస్తిచెప్పడానికి, దాని వినియోగాన్ని తగ్గించడానికి ఈ చర్యలు బాగా దోహదం చేస్తాయని ఆయన చెప్పారు. దీర్ఘకాలంలో కాగితం వాడకం బాగా తగ్గిపోతుందన్నారు. వాట్సాప్ సేవలను సుప్రీంకోర్టుకు సంబంధించిన వారికి వివిధ విభాగాల వారిని సమీకృతం చేసి అందుబాటులోకి తీసుకువస్తారు. సుప్రీంకోర్టుకు రోజువారీ పనివిధానంలో అవసరమైన సమాచారాన్ని ముందుగానే సంబంధిత బాధ్యులకు సులభ పద్ధతిలో డిజిటలీకరణ ద్వారా చేరవేసేందుకు ఏర్పాట్లు చేశారు. వ్యక్తిగత ఆస్తులను సామూహికంగా సమాజానికి ఉపయోగపడేవిధంగా భౌతిక వనరులుగా పరిగణించవచ్చునా లేదా అనే విషయంపై దాఖలైన అనేక పిటిషన్లపై న్యాయపరంగా చాలా విసుగెత్తించేవిధంగా అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఈ విషయంపై జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలోని తొమ్మిదిమంది సభ్యులుగల విస్తృత ధర్మాసనం విచారణ ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ డిజిటలీకరణ విషయాన్ని ప్రకటించారు. రాజ్యాంగంలోని 39(బి) అధికరణ కింద రాజ్యవిధానంలోఆదేశిక సూత్రాలలో ఒక భాగంగా ఉన్న ఈ భౌతిక వనరుల అంశంపై ఈ విచారణ దృష్టి పెట్టింది. ఈ కేసు విచారణ సందర్భంగా చంద్రచూడ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి) సేవల ద్వారా వాట్సాప్‌ను సమీకృతం చేసి సమాచారాన్ని సులభంగాన్యాయవాదులకు ఎప్పటికప్పుడు అందుబాటులోకి తెస్తామని అన్నారు. ''సుప్రీంకోర్టు సేవలు దేశంలో ప్రారంభమై 75 సంవత్సరాలుపూర్తయిన సందర్భంగా ఇది ఒక చిన్న చొరవతో కూడిన విషయం. సమాచారాన్ని సులభంగా చేరవేయడంలో సమయాన్ని ఆదా చేసి సందేహాలను తీర్చడంలో ఇది చాలా శక్తిమంతమైన ప్రభావం చూపిస్తుంది. ఈ వాట్సాప్ సందేశాలు సర్వాంతర్యామిగామన నిత్యజీవన పనివిధానంలో సేవలు అందిస్తాయి, ఇది శక్తిమంతమైన సమాచార ప్రసార ఆయుధం. న్యాయాన్ని అందుబాటులోకి తేడానికి, మరింత బాహాటత్వ విధానాలతో న్యాయవ్యవస్థ పని పరిస్థితులను మెరుగుపరచడానికి తన ఐటీ సేల ద్వారా ఈ వాట్సాప్ సేవలు ప్రయోజనం చేకూరుస్తాయి'' అని చంద్రచూడ్ అన్నారు. సుప్రీంకోర్టులో ధర్మాసనాల ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యే న్యాయవాదులు, కక్షిదారులకు సంబంధించిన రికార్డులు ఆటోమేషన్ ద్వారా సమయానుకూల కర్తవ్య నిర్వహణకుగాను సందేశాల రూపంలో సమాధానాలుగా అందుబాటులోకి వస్తాయి, కేసులను ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఫైలింగ్ చేయడానికి సంబంధించి, కేసు లిస్టులు, జాబితాలు, ఉత్తర్వులు, తీర్పులు అన్నీ అందుబాటులోకి వస్తాయన్నారు. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ ఇది ఒక విప్లవాత్మకమైన చర్య అని అన్నారు. అవిధంగా చంద్రచూడ్ కూడా న్యాయాధిపతిగా వాట్సాప్ నంబర్ 87 67 68 76 76 ను షేర్ చేశారు.

# న్యాయ్ పత్ర్ వివరించేందుకు సమయమివ్వాలి



**న్యూఢిల్లీ :** న్యాయ పత్ర్(కాంగ్రెస్ మ్యానిఫెస్టో)ను వివరించేందుకు తనకు సమయం ఇవ్వాల్సిందిగా ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే లేఖ రాశారు. న్యాయ్ పత్రలో లేని, రాయని అంశాల గురించి ప్రధాని సలహాదారులు తప్పుడు సమాచారం ఇచ్చారని రెండు పేజీల లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రజల సంపదను పునఃపంపిణీ చేస్తుందని, దానిని చొరబాటుదారులకు ఇస్తుందని ప్రధాని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఖర్గే లేఖ రాశారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులు, కులాలు, వర్గాలకు అతీతంగా అణగారిన వర్గాలకు న్యాయం చేయడమే న్యాయ పత్ర్ లక్ష్యమని లేఖలో పేర్కొన్నారు. సంబంధం లేని అంశాలను చెబుతూ మతపరమైన విభజన తీసుకురావడం మీకు అలవాటుగా మారిందని, అలా మాట్లాడడం ద్వారా ప్రధాని స్థానం గౌరవాన్ని దిగజారుస్తున్నారని ప్రధానికి రాసిన లేఖలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. మీకు న్యాయ పత్ర్‌లోని అంశాలను వివరించి, తద్వారా దేశ ప్రధాని హోదాలో ఉండి తప్పుడు ప్రకటనలు చేకుండా ఉండేందుకు, తనకు సమయం ఇవ్వాలని ఖర్గే కోరారు. ఇటీవల ప్రధాని చేసిన ప్రసంగాలను చూసి తాను ఆశ్చర్యపోలేదని, దిగ్భ్రాంతికి గురి కాలేదని అన్నారు. మొదటి దశ ఎన్నికల్లో మీ పార్టీ నిరుత్సాహపూరితమైన ప్రదర్శన చూసి మీరూ, మీ నాయకులు ఇలాగే మాట్లాడుతారని ముందే ఊహించినట్లు తెలిపారు. మీకూ, మీ ప్రభుత్వానికి నిరుపేదల పట్ల ఆందోళన లేదని మాకు తెలుసునని అన్నారు. మీ 'సూట్ బూట్ కీ సర్కార్' కార్పొరేట్‌ల కోసమే పని చేస్తుందని, వేతన జీవులు అధిక పన్నులు చెల్లిస్తుంటే కార్పొరేట్‌లకు మాత్రం పన్నులు తగ్గిస్తుందని విమర్శించారు. ఆహారం, ఉప్పులపై పేదలు జిఎస్‌టి విధిస్తుందని, అదే సమయంలో కార్పొరేట్‌లు జిఎస్‌టి తిరిగి చెల్లింపులు కోరుతున్నారు. తాము పేదల, ధనికుల అంతరాల గురించి ప్రస్తావించినప్పుడల్లా మీరు హిందూ, ముస్లింలు అంటూ మాట్లాడుతుంటారని విరుచుకుపడ్డారు. తమ మ్యానిఫెస్టో అన్ని మతాలకు సంబంధించిందని, స్వాతంత్ర్యపూర్వం ముస్లిం లీగ్, వలస పాలకులు మీకు మిత్రులుగా ఉన్న విషయాన్ని మీరు మరిచిపోయి ఉండకపోవచ్చని మోదీ కి రాసిన లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ పేదలను సాధికారులుగా చేయాలని చూస్తే, పేదలు దాచుకున్నది దోచుకోవడంపైనే మీ పాలన దృష్టి పెట్టిందని విమర్శించారు.

**ఆగ్రా :** ఉత్తర్‌ప్రదేశ్‌లో బుజ్జగింపు విధానాల ఆధారంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల కూటమి ఏర్పాటైందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఆగ్రాలో బిజెపి ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల సంపదను ఎక్స్ రే తీసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని పునరుద్ఘాటించారు. సంపద పునఃపంపిణీ ద్వారా ప్రజల వారసత్వ సంపద నుండి కాంగ్రెస్ దూరం చేస్తుందన్నారు. మన తల్లులు, సోదరీమణుల దాచిన సొమ్ముపై వారి కన్నుపడిందని, తాను మాత్రం వారి సంపదకు చౌకీదార్‌గా నిలబడతానని చెప్పారు.

# కన్నౌజ్ నుంచి అఖిలేష్ యాదవ్ నామినేషన్ దాఖలు



**లక్నో :** సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ పోటీ చేసే స్థానంపై స్పష్టత ఇచ్చింది. యుపిలోని కన్నౌజ్ నుంచి అఖిలేష్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీకి ఎంతో పట్టున్న కన్నౌజ్ నియోజకవర్గం నుంచి అఖిలేశ్ మూడు సార్లు విజయం సాధించారు. ఇక 2012, 2014 ఎన్నికల్లో ఆయన భార్య డింపుల్ యాదవ్ గెలిచారు. అయితే 2019 ఎన్నికలలో బిజెపి అభ్యర్థి పాథక్ చేతిలో ఆమె ఓటమి చవిచూశారు. నామినేషన్ దాఖలు అనంతరం ఎస్పీ చీఫ్ మాట్లాడుతూ ఎస్పీ చేపట్టిన అభివృద్ధిని బిజెపి ఉద్దేశపూర్వకంగా నిలువరిస్తోందని ఆరోపించారు. బిజెపి నెగెటివ్ రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రజలను పదేపదే అవమానిస్తోందని ఆరోపించారు. కన్నౌజ్ ప్రజలకు సేవలందించేందుకు తాను ఇక్కడికి వచ్చానని చెప్పారు. ఎస్‌పి హయాంలో కన్నౌజ్‌లో జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుసునని అన్నారు. కాగా, కొద్ది రోజుల క్రితం ఈ నియోజకవర్గం నుంచి అఖిలేశ్ మేనల్లుడు, ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ అల్లుడైన మాజీ ఎంపి తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేస్తారని పార్టీ వర్గాలే ప్రకటించాయి. ఇక పార్టీ నేతల ఒత్తిడి మేరకు అఖిలేశ్ పోటీలో ఉండాలని నిర్ణయించారు.

# ఒడిశాలో భద్రతా బలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతం

**భువనేశ్వర్ :** ఒడిశాలోని బౌద్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య గురువారం తెల్లవారుజామున జరిగిన కాల్పుల్లో కనీసం ఇద్దరు మావోయిస్టులు మరణించారని పోలీసులు తెలిపారు. కాంతమాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్హెల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో మావోయిస్టులు, ఒడిశాలోని ఎలైట్ స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఒజి) సిబ్బందికి మధ్య ఎదురుకాల్పులు జరిగినట్లు అదనపు డిజి (ఆపరేషన్) దేవ్ దత్తా సింగ్ తెలిపారు. 'ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో రెండు మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఆయుధాలు, గ్రెనేడ్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. గురువారం ఉదయం వరకు ఆపరేషన్ కొనసాగింది. చనిపోయిన మావోయిస్టులను సునీల్, సంతుగా గుర్తించామని, వీరిద్దరూ మావోయిస్టుల 8వ కంపెనీకి చెందినవారని సింగ్ తెలిపారు. సునీల్ ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమాకు చెందినవాడని, సంతు రాష్ట్రంలోని బీజాపూర్‌కు చెందినవాడని తెలిపారు. భద్రతా సిబ్బంది గాయపడినట్లు ఎటువంటి నివేదిక అందలేదని మరో అధికారి తెలిపారు.

# ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అరెస్టుపై సుప్రీంకోర్టులో ఇడి కౌంటర్..!

**న్యూఢిల్లీ :** ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అఫిడవిట్‌లో ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ప్రధాన సూత్రధారి కేజ్రీవాల్‌గా పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో సమన్లు పంపినా హాజరలేదని.. విచారణకు సహకరించడం లేదని ఆరోపించింది. ఢిల్లీ ప్రభుత్వ మంత్రులు, ఆప్ నేతలు, ఇతరులతో కలిసి నేరానికి పాల్పడ్డారని.. ఇందులో కేజ్రీవాల్ ప్రధానపాత్ర పోషించారని పేర్కొంది. అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఈడీ వ్యతిరేకించింది. ఢిల్లీ ముఖ్యమంత్రికి తొమ్మిదిసార్లు సమన్లు పంపినా ఒక్కసారి విచారణకు హాజరుకాలేదని పేర్కొంది. కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేశారు. కేజ్రీవాల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేస్తూ.. ఈ నెల 24లోగా సమాధానం చెప్పాలని ఈడీని ఆదేశించింది. కేసు విచారణను 29న జరుగనున్నది. కేజ్రీవాల్ తప్పు చేశారనేందుకు అధికారుల వద్ద సమగ్ర ఆధారాలు ఉన్నాయని ఈడీ కోర్టుకు తెలిపింది. కేజ్రీవాల్ అరెస్ట్ చట్టబద్ధంగానే జరిగిందని ఇడి కౌంటర్‌లో స్పష్టం చేసింది.